Sree

Rajavahanavijayam.

BY

A. Narayana Rao.

[Price Re. 1—4—0.

శ్రీ

ఆరంకముల నాటకము.

అడుసుమల్లి నారాయణరావుగారిచే

రచియింపఁబడి

బెజవాడ సి. యస్. ముద్రాక్షరశాల్లయందు,

ప్రొప్రయిటరు:

పోతిన శ్రీనివాసరావు పాత్రుడుగారిచే

ముద్రింపఁబడియె.

1923.

[వెల రు. 1—4—0.

శ్రీ సరస్వత్యై నమః.

విజ్ఞప్తి.

సంపూర్ణ పాండిత్యరహితుఁడను, దృశ్యప్రబంధ లక్షణాల్పజ్ఞుఁడ నభవలేశుండనగునేను నాటకంబునకు గడంగుట పరిహాసాస్పదమే. గాన కూచిమంచి తిమ్మకవికృత రసికజనమనోభిరామ శ్రవ్యప్రబంధ మాధురీ ప్రవాహంబున నోలలాడుచున్నతఱి శృంగార దృశ్యప్రబంధ నిర్మాణం బొనర్పనని వారణోత్సాహంబు జనింపఁ గవితావ్యాయామంబున కేని యుపయోగింపదాయని దశకుమార చరిత్రాంతర్గత రాజవాహన చరిత్రఁగొని రాజవాహన విజయంబను పేర నీనాటకమును రచియించితిని.

పదంపడి హూణభాషాభ్యాసనానురక్తుఁడనై యిప్పటి వరకం దేకృషిసలుపుచున్న నాకిఁక నాంధ్రకవితాభ్యాసంబు గగనప్రసూనంబని యుఁబూర్వకవితాలఘుసామర్థ్యంబేని భావివిశ్రాంతిసమయంబులఁదలంపురా దీనిముద్రించుట నుత్తమంబను నూహయు, మదీయనాటకంబు నాద్యంతంబు బరిశీలించిన మద్గురువర్య మిత్రబృందంబునాటక ముద్రణంబునకై యొనర్చిన దీర్ఘప్రోత్సాహంబును నిట్టికార్యంబునకు సాహయ్యభూతులాయెను పాఠకులకొనర్చు నావిన్నపంబులన్నియు నాంది ప్రస్తావనయందే యున్నకతంబున చర్విత చర్వణంబొనరింపనేరక యిందలి దోసంబులెఱింగించుచో ద్వితీయ ముద్రణంబున నవ్వాని సవరించి వారికిఁ గృతజ్ఞుఁడనగుదునని మాత్రము విన్నవింతును.

నాటకమందలి దోసంబుల సవరించిన మద్గురువర్యులగు బ్రహ్మశ్రీ సత్యసుబ్రహ్మణ్యేశ్వరులకును, బ్రహ్మశ్రీ భమిడిపాటి అయ్యప్పశా

స్త్రీగారికిని, బ్రహ్మశ్రీ చర్ల నారాయణశాస్త్రిగారికిని పీఠిక వ్రాసియొ
సంగిన మ॥రా॥శ్రీ పెనుమచ్చ సత్యనారాయణరాజుగారికిని నావంద
న సహస్రంబుల నర్పించెదను.

దీర్ఘకాలమయినను విసుగక పెక్కు నాయాసంబులఁజెంది సా
ధ్యమైనంతవరకు ముద్రణాదోషంబుల రానీక యచ్చొత్తించిన శ్రీ
సి. యస్. ముద్రాక్షరశాలాధిపతి పోతిన శ్రీనివాసరావుపాత్రుడుగారి
కెంతయుఁ గృతజ్ఞుఁడను.

గుడివాడ,
30—12—23.

ఇట్లు,
అడుసుమల్లి నారాయణరావు,

పీఠిక.

కావ్యములు శ్రవ్యములు, దృశ్యములు, అని యిరుతెఱంగులు గానున్నవి. అనఁగా వినఁదగినవి. చూడఁదగినవి. దృశ్యకావ్యములకె రూపకములని పేరు.

నటులు రాజవాహనాది రూపములను దమయందారోపించుకొని నటించుటచేత వీనికి రూపకములని పేరుగలిగినది.

ఉభయకావ్యములు వాఙ్మయోపకరములు, నీతిదాయకములునైయున్నవి. అందు దృశ్యకావ్యములు, ప్రథమస్థానము నాక్రమించుచున్నవి. తొల్లింటి యార్యచరిత్రలు, ప్రత్యక్షముగాఁ జూడవలయుననిన నాటకములు శరణ్యములు. జానపదులుఁ (అనాగరికులు) నైతికముగాఁగాని, ఆర్థికముగాఁగాని, రాజకీయముగాఁగాని వృద్ధిపొందవలెననిన, రూపకములు శరణ్యములని నాయూహ.

ఏరూపకంబు యొక్కయు నౌచిత్యంబునటులపై నాధారము పడియున్నది. ఏయేతావులనే యేరాగముల నాలాపములఁ బల్కవలెనో యాయాచోట్ల నటులటులాచరించినచో రూపక ప్రదర్శనము చూపఱుల నానందాబ్ధి నోలలాడించును.

కేవలాలాపంబులచేఁగాక నటులు నాలువిధములఁ బాత్రౌచిత్యము నిలుపవలయును. రూపకంబులు నాట్యము ప్రధానముగాఁ గలవి కావుట రూపకమునందువచ్చు స్త్రీ పురుషుల యవస్థల నభినయించుట నాట్యము.

ఆంగికము, వాచికము, సాత్త్వికము, ఆహార్యము అను నాలుగుతెఱంగుల నటులు భావప్రకటనమును గావింపవలయును. అనఁగాఁ గరచరణాద్యంగవిన్యాసములచేతను, మాటలచేతను, మనోభావములు

శ్రీ రాజవాహన విజయమున వచ్చు పాత్రలు.

— పురుషులు —

రాజవాహనుఁడు ... కథానాయకుఁడు మగధ దేశాధీశసుతుఁడు.
రాజహంసుఁడు ... మగధావనీశుఁడు.
పుష్పోద్భవుఁడు ... { కథానాయకుని స్నేహితుఁడు. రాజహంసుని మంత్రి కుమారుఁడు.
వీరశేఖరుఁడు ... { విద్యాధరుఁడు కథానాయకుని శృంఖలబద్ధునిఁ జేసినవాఁడు.
మానసారుఁడు ... మాళవాధీశుఁడు. కథానాయిక తండ్రి.
దర్పసారుఁడు ... మానసారుని కుమారుఁడు.
చండవర్మ ... { కథానాయకుని కారాగృహమందుంచినవాఁడు. మానసారుని చెల్లెలికుమారుడు.
అపహారవర్మ ... కథానాయకుని స్నేహితుఁడు.
సింహవర్మ ... అంగదేశపురాజు.
కృతవర్మ ... చండవర్మ మంత్రి.
వామదేవమహర్షి ... }
వార్తాహారి ... } రాజహంసునుండి రాజవాహనునకు వార్తఁ దెచ్చినవాఁడు.
ఏణజంఘుఁడు ... దర్పసారునుండి చండవర్మకు వార్తదెచ్చినవాఁడు
కారాగృహాధికారి ... }
మాళవసైనికుఁడు ... } మొదలగువారుఁ గొందఱు వరుదెంతురు.
సేవకుఁడు ... }

— స్త్రీలు —

అవంతిసుందరి ... కథానాయిక. మానసారుని కూతురు.
బాలచంద్రిక ... పుష్పోద్భవుని భార్య.
చంపక... ... }
కేతకి ... ... } అవంతిసుందరి చెలికత్తెలు.
స్వర్ణలత ... }
మహాదేవి ... కథానాయిక తల్లి.
వసుమతి ... కథానాయకుని తల్లి.
సురతమంజరి ... అప్సరస రాజవాహనుని చెఱనుండి విడిపించినది.

శ్రీ సరస్వత్యైనమః

శ్రీ

రాజవాహనవిజయము.

నాంది

శ్రీవైదగ్ధ్యపరింపఁదన్ను, నిజవైరిక్ష్మాస్థలిం జేరి, యా
దేవిం జేకొని, శాత్రవాళిరణధాత్రింగూల్చి, సత్సౌఖ్య పా
రావారంబుననోలలాడి జయశోభాధారుఁడై మించు రా
జీవాక్షుండు నిరంతరాభ్యుదయముం జేకూర్చిమిమ్మోముతన్॥

(నాంద్యనంతరమున సూత్రధారుఁడు ప్రవేశించి పుష్పాంజలింజల్లి)

మహానీయులగు నోసదస్యులారా!

చ॥ పలుకులమార్దవంబు, రసభావసమున్నతమైనశైలి, యు
జ్జ్వలపద గుంభనంబుఁగనఁజాలనియట్టి కవిత్వమంచు నా
త్మలనిరసింపఁబోక దయఁదాల్చి కనుంగొనుఁడర్థహీనతన్
బలికినఁగాని యాచిలుక పల్కులు ముద్దులమూటఁగట్టవే॥

తే॥గీ॥ లలిత చంద్రమండలమందు లక్షణంబు
గగనమార్గమునందు మేఘములగములు
ఆమ్రఫలమందుటెంక, కావ్యంబునందు
దోసములు గల్గకుండుట మస్తరంబు॥

నటి—(పుస్తకముతోఁ బ్రవేశించుచు)

కవిరాజవిరాజితము—లలితసరోజదళంబుల భృంగకు
లంబులుబాడ హాళాహాళి కో
వెలలుజరింప రసాలలతాఘన

వీధులపైఁ బ్రుధివీజఘనల్
పలుపలులీలల భర్తలకైతమిఁ
బాల్పడఁ బాంధులపైని శరా
వళివిడువన్నుమబాణుఁడహో పొలు
పారెవసంతము భవ్యముగన్

సూత్ర—మనోహారిణీ! నేడేమో కాని నానయనేంద్రియములకు నీ వొక వివాహోన్ముఖ వధూరత్నంబువలెఁ గాన్పించుచున్నావు. కారణమేమైయుండును.

నటి—మీరెప్పుడిటులనే ప్రశ్నింతురు. వసంతాగమంబునఁగల కంఠములకు నూత్న సౌందర్యాగమంబగుటెఱుంగరా?

సూత్ర—నూత్న సౌందర్యాగమమే కాదు. మన్మథవేదనాగమమునుకూడఁ గాఁగలదు. ఏదీ! యిటురమ్ము నీబింబాధరరాగంబెటులున్నదో పరిశీలించెద.

నటి—చాలు. చాలు. మీకు యుక్తాయుక్త జ్ఞానవిచక్షణ లేనటులున్నది. (పోఁబోవును.)

సూత్ర—కాంతామణీ! నామాటనాలింపుము. నన్నునిరసించియేగకుము. కాదనియేగెదవేని రాజవాహన ప్రథమ సందర్శనంబున వానివాక్యంబులనిరసించి యంతఃపురంబునజొచ్చి మన్మథానలంబునఁ గృశియించిన యవంతిసుందరి మాడ్కియయ్యెదవు ఆలోచించుకొనుము. (పైట చెఱఁగుఁబట్టుకొనును.)

నటి—(పైట చెఱఁగు నూడఁబెఱుకుకొనుచు) మీ యుపమానంబులకేమి లెండు.

సూత్ర—సఖీ! ఉపమానంబులుఁగావు. నిశ్చయముగ రాఁబోవు ప్రథమరంగంబున నవంతిసుందరివి కాఁగలవు. కాన క్షణకాలమునల్పి నావాక్యంబులాలింపుము.

నటి— ఇపుడు నన్ను మీకోరునదేమి?

సూత్ర— రాజవాహనుఁడనుగా నున్న నేను యువకులు యువతులఁ గోరునదియేఁ గోరెద. దీనికేమి కాని నిన్నటివఱకు నాకుత్తుకఁ జించుకొనిన రాని నీవు నేఁడు మత్ప్రశంస కానిదే వచ్చితివేల?

నటి— ఏమీ! నేటి నా రాక మీకిష్టము లేదా? అటులయినఁ బోయెద.

సూత్ర— ప్రేయసీ! ఎంతయవివేకురాలవు.

తే॥గీ॥ చాతకములు పుంస్త్వవిహీన జనములక్క
మాధవాగమ కాంతాగ మద్వయంబు
నందుఁగలుఁగు సౌఖ్యంబుల నందనెందు
నీరసించు పశుప్రాయులేరుగలరు॥

నేఁడు మనముఁ బ్రదర్శింపఁబోవు నాటకమేమి? నీరాక నేనిరసించుటేమి? ఎట్టివాక్యములుచ్చరించితివి.

నటి— నాథా! నేటి ప్రదర్శనార్హమగు నాటకమెయ్యది?

సూత్ర— చదివినకొలఁది నీమతి క్షీణించుచున్నటులున్నయది. నీచేతనున్న నీయభిమానగ్రంథమే నేఁడు ప్రదర్శనార్హము.

నటి— (చేతనున్న గ్రంథమవలోకించి) మీమంజులవాక్య పుంజమాధుర్యంబున జరుఁగనున్న కార్యము మఱచితిని. నాథా! అంతగా జ్ఞప్తిలేదు. దీని కథానాయకుఁడెవఁడు.

సూత్ర— అవివేకురాలా! గ్రంథాభిధానము రాజవాహనవిజయమని యెఱిఁగియుఁ గథానాయకునడుఁగుచుంటివా? మతిపోయినట్లున్నది.

నటి— అవును. కృతికర్తనడుఁగఁబోయి కథానాయకు నడిగితి. క్షమింపుము.

సూత్ర—కొండఁబిఱుఁదక్రిందనుండుకొని రాళ్లనువెతకిఁ టులుకలికివి కృతికర్తఁగూర్చి రచింపఁబడిన యొకటిరెండు పద్యములఁజూచి చదువుము. నీసంశయ నివారణకాఁగలదు.

నటి—(పుస్తకముఁజూచుచు)

సీ॥ నిఖలభూషణరాజ నీరాజితాంగనా
గణగురజపురమ్ము కాపురమ్ము
వైరినృపాల నిర్వాపణోత్సాహ క
క్రమప్రభూతపదమ్ము రాచకొలము
† కవికేసరికిశోర కవిమణిబిరుదాంక
కోవిదయుగ్మమ్ము గురుజనమ్ము
కవినాథవక్త్రి రంగచ్ఛారదాదివ్య
పాదపంకేజమ్ము పాత్రిథితమ్ము
ఆ॥వె॥ ప్రబలసద్యశోవిభాసి లక్ష్మ్యంబికా
వేంకటార్యయుగము పితృజనంబు
సకలపండితజన సన్నుతాష్ట శతావ
ధానయుగము మదభిమానధనము॥

సూత్ర—ప్రాణనాయికా! ఏమి నీగాత్ర మాధుర్యము? వసంతాగమంబునఁగాఁబోలు నీకలకంఠముఁగలకంఠమును మీఱుచున్నది. తెఱువాతిఁజదువుము. నీసంశయ నివారణముకాఁగలదు.

నటి—(గ్రంథమవలోకించుచు)

తే॥గీ॥ పదునేఁబదేండ్ల ప్రాయంబువాఁడ నఘుసు
మల్లివంశజుఁడ భరతమాతృకరుణ
రాజవాహన సచ్చరిత్రంబుఁ దీని
వ్రాసినాఁడ నారాయణరావునేను॥ (అని చదువును.)

---

† సత్యసుబ్రహ్మణ్యేశ్వర శతావధానులు.

సూత్ర— ఈబాల కవికి భరతమాతృ కరుణాకటాక్షంబున దీర్ఘాయువు లభించునుగాక. సఖీ! ఇటుచూడుము

తే॥గీ॥ మాళవాధీశునాత్మ జమహితచరిత
నరయుచున్నట్టి రాజవాహనుని కరణి
కైరవలతావరూథినిఁ గాంచుకొఱకు
వేచియున్నాఁడు చూడుమీ విడు దుపోలతిఁ॥

నటి— ఔనుగాని మన యప్రస్తుత వాక్యంబుల నియమితకాల మాసన్నమగుచున్నను నాటక ప్రదర్శనంబునకుఁగడఁగమి సభ్యులు కోపగింతురేమో రండు. పోదము.

సూత్ర— అవును మనవారిఁగలిసి పాత్రల సిద్ధపఱుతము.

(నిష్క్రమణము.)

ఇది ప్రస్తావన.

శ్రీ

రాజవాహనవిజయము.

ప్రథమాంకము.

(రంగము—అవంతీపురమునందలి యుద్యానవనము.)

(భూసురవేషధారులగు రాజవాహనుఁడు, పుష్పోద్భవుఁడును ప్రవేశింతురు.)

రాజ—మిత్త్రమా! ఈశృంగారోద్యాన సౌభాగ్యవిశేషముం గంటివా?

లయగ్రాహి॥ కుందఫలపూరకురువిందకరవీరపిచు
మంద సహకార సుమబృందముల మోదం
బందిముదమార నరవిందములఁ దూఁటిమక
రందములఁ గ్రోలి సుఖమందిలతల దిం
దిందిరములాడ హరిచందన పరాగముల
మందమలయానిలుఁడు డెందములయందా
నందమునుఁ గూర్పఁ బికసుందరులు పాడఁ దరు
బృందములఁ గూడి చెలువొందె వనమెల్లన్॥

పుష్పో—దేవా! ఈ పతంగమధురస్వనంబుల వింటిరా?

తే॥ గీ॥ వనరమా కన్యకును మాధవునకుఁ బెండ్లి
సలుపువేళను మంగళ స్వనములనఁగ
శారికాకీర కోకిల చంచరీక
సంఘములుగూడి రావంబు సలుపఁదొడఁగె॥

రాజ—ఆహా! యువకులగు వధూవరుల కీదినసంబు లెంతసుఖప్రాయం
బులు మిత్రమా! చూడు

సీ॥ పండువెన్నలలోన వనకేళిసల్పుచు
నెఱులఁ బూగుత్తులఁ దుఱిమి తుఱిమి
కాసారములఁ జేరి కంచుకంబులవిప్పి
యంబువులం దోలలాడియాడి
జిలుగువల్వలఁదాల్చి శ్రీగంధమునలంది
పూవుగీములఁ జేరఁ బోయిపోయి
జాబిల్లిరానేల సరసంబులాడుచు
సంతసంబున రతి సలిపిసలిపి

మరుని నసిలోనఁ గెలిచి సామ్రాజ్యమంది
తనివిదీఱంగ సుఖముల ననుదినంబు
నించు వేడుకనందుచు నీవసంత
మెల్లఁ గడపుచో నాభాగ్య మెన్నవశమె॥

పుష్పో—అట్లేయగుఁగాక.

రాజ—అటులనియెదవేల? ఏమికావలయు?

పుష్పో—భవదీయాభీష్టార్థం బిటులవచించితిని.

రాజ—ఇందు నాయభీష్టం బేమికలదు.

పుష్పో—"ఈవసంతమెల్లఁ గడపుచో నాభాగ్యమెన్నవశమె" అని వచించితివిగదా?

రాజ—వయస్యా! నీపెడయర్థంబుల కేమిలెమ్ము. రాజపుత్త్రినిఁ గొని వత్తుననిపోయిన బాలచంద్రిక యింకనురాదేమి?

పుష్పో—ఈ సరికి వచ్చుచునేయుండును. రిపుత్స్మానాధపుత్త్రినిఁ జేపట్ట నెంచిన నీకీ భూసురవేషము చక్కఁగ సరిపడినదిసుమా?

రాజ—ఇదినీ ప్రజ్ఞావిశేషమేకదా?

పుష్పో—రాజా! ఈ శేఫాలికాగుల్మాంతరితంబగు నీప్రదేశమునుండి మందగమనంబున నేతెంచు నీమందయాన సొయ్యారంబవలోకింపుము.

సీ॥ ధారాధరాంతర్గతంబై పిసాళించు
లలితసౌదామినీ లతయనంగ
మన్మథతూణీర మధ్యమమైమించు
రమణీయ పుష్పనారాచమనఁగ
పూర్వాద్రిశిఖరాగ్ర పూర్వమైరహిమించు
దివ్యమౌ బాలచంద్రికయనంగ
శైవాలికాంతర స్థానమైవికసించు
కమనీయ పుండరీ కంబనంగ
కాఁక బూదినొంది మెఱుంగుఁ గాంచుచున్న
కళుకుమేలిమి బంగారు కణికయనఁగ
పాదపంబుల నొప్పారు బాటనుండి
వచ్చుచున్నదిసుమ్మి భూపాలపుత్రి॥

రాజ——అమాత్యాత్మజా! ఇటు చూడుము.

చ॥ వలకుల నేఁగుదెంచు వనబర్హికి నాట్యముసెప్పి మంజువా
క్కులశుక రాజముందనిపి కోయిలఁబిల్చుచు హంసికింగలం
కుల గమనంబు నేరిపిదుకూలముఁ జేసవరించి మైామువె
న్నెలలనుఁగాయఁదోటి చెలినింగొని సుందరి యిట్లువచ్చెడిన్,
కావున నీమాధవీలతాగుల్మకంబుల మాటున కేఁగి యాబోటియాటపాటల వీక్షింతమురమ్ము. (ఇరువురు నొక పొదచాటున కేఁగుదురు.)

(అంతనవంతీసుందరీ, బాలచంద్రికలు ప్రవేశింతురు.)

—♦ వృషగతిరగడ ♦—

అవం——ఏటికీవిటునన్నుఁ దెచ్చితి వింతులందఱిబంపియీదెస
బాల——పాటలాధర! యేమిగల్గునె వనముసూడఁగరాదె యీదెస
అవం..పొలఁతి! యేమిదిపోయి యవ్వెడఁబొన్న పూవులఁగోయరాదటె
బాల——వలదు! వలదిటు రమ్మటంచునుఁబల్కు మీయిట నీకువాదటె
అవం——చాలుఁ జాలును నిల్వఁజాలను చంచరీకరవంబులందును
బాల — గోల! తేటులురావె సంపెగకోరకంబులు గిల్లుమందును
(పువ్వులఁ గోయుదురు.)

అవం—భామ రమ్మిటు కుందకుట్మల పంక్తులదును మంగఁబోదము

బాల—చామ! అల్లనరమ్మ మొల్లల జడనుఁ దుఱుమఁగఁగొల్వ మోదము (పూవులఁ గోయుదురు.)

అవం—మాధవీ ప్రతతీగృహంబుల మాటుఁ జేరియుఁగూరుచుందము

బాల—భూధవాత్మజ! రమ్మపోదము (ప్రక్కకుఁజూపుచు) పూప రాగము లేచెనందము

అవం—చూతపల్లవ సంచయంబులఁ జూచిమెక్కెడుఁ జూడుపికములు

బాల—భీతినొందుచుమనలఁజూచియు వెడలిపోయెడుఁజూడుశుకములు

అవం—సొంపుఁగొల్పుచుఁగేరియాడెడుఁ జూడుమయ్యవె పావురంబులు

బాల—సంపతిల్లుచు విందుఁగొల్పెడు శారికాకల నిస్వనంబులు

అవం—పుడమినెల్లనుఁ జల్లెఁజూడుము పుష్పరాసుల బొండుమల్లెలు

బాల—ఎడమ కంగుగఁ జంపకంబుల వెందుఁజూచినఁగాని కొల్లలు. రాజపుత్రి! ఈయిసుకతిన్నెఁ గూరుచుందమురమ్ము. (ఇరువురుగూరుచుందురు.)

అవం—బాలచంద్రికా! ఈ సరోవరపద్మంబుననున్న కోకమిథునంబును వీక్షింపుము.

మ॥ అనురాగంబుదయించి వెల్లివడి యత్యంతంబు నిర్బంధమై
చని పూవిల్తుని కేళిముంపఁగను స్వస్సాంగత్య భాగ్యంబునం
దనువుల్ జ్ఞప్తిఁ దొఱంగఁ దేఁటులు మదోన్మాదంబునం దేమిచే
సిన వీక్షింపవు జ్ఞానశూన్యులుగదా చింతింపఁగామాతురుల్॥

బాల—సఖీ! నేఁడేటికో నీశరీరంబున మన్మథాంకములు వొడఁగట్టుచున్నవి.

అవం—(క్రోధాంకురముతో) నీ సరసంబులు చాలు లే. అవియా! తద్వ్యతిరేకంబులా?

బాల—ఇంతమాత్రంబున నీకీ కోపమేటికే? ఏమియుఁగావు యౌవనారంభ భాగ్య విశేషములు.

అవం— నీవెప్పుడిటు లవ్యక్తసంభాషణం బొనరించెద వేలనే?

బాల— ఎవరికి వారిట్టులే స్వవిషయంబులఁ గప్పిపుచ్చఁజూతురే?

అవం— చెలీ! ఈ ప్రసంగమేటికే?

రాజ— ఆహా ఈయాదిగర్భేశ్వరీ వాక్యపుంజంబు లెంతయొప్పియున్నవి

తే॥ గీ॥ పలుకుఁబలుకున నమృతంబు సిలుకుచుండ
భవ్యరసభావములను గుంభనమొనర్చి
మంజులధ్వనిఁ బలుకు నీ మధురవాణి
స్రష్టసృష్టి నేరీతిగా సలిపినాఁడొ?

అవం— సఖీ! వనవిల్తుని పూజార్థంబయి కుసుమసమితిఁ గొనిరమ్మని పంపిన నెచ్చెలులింక రాకున్నారేలనో?

బాల— సుందరీ! కుసుమంబులఁ దునుమవలదా? రావలదా?

అవం— చెలీ! ఈనాఁడేమోకాని నామనంబునకొకవిధమగు నుత్సుకమయ్యెడిని.

బాల— అదినే నెఱుంగుదును వివాహోన్ముఖులకుఁ గలుగునదియే యది.

అవం— చాలును నీ కెప్పుడిట్టిమాట లేనా? (ప్రక్కకుఁజూచుచు) సఖీ!

ఉ॥ రంగద భంగమంజుల తరంగ సరోవరమందుఁజూడు మీ
భృంగయుగంబులొక్కట నవీనలతాంత పరాగమెల్ల దే
హాంగములందునిండ ముదమారఁగ నాయరవింద మందిర
ప్రాంగణమందు సల్పెడి విహారము నూత్నవధూవరుల్బలెన్ ॥

బాల— రాజపుత్రి! నీశరీరంబున శృంగారరస ముప్పొంగుచున్నటులున్నదే?

రాజ— భళిరా? వాక్సతీతిరస్కృతిమృదుమధుర వాక్యంబులు ననన్యసామాన్యలావణ్యవిశేష శేముషిందనరారు సంగసౌష్టవంబునుఁ గలిగి యీ యమనామనంబు నెంతహరించుచున్నది. ఈ స్థూదరాంగి మానవ కాంతారత్నమై యుండునా? లేక,

సీ॥ దినమొక్కరీతిఁ బృథ్వీస్థలంబులనెల్లఁ
దిరుగాడు నిందిరా దేవియేమొ
భక్తశేఖరులఁ గృపామతిఁ బ్రోవంగ
వసుధడిగ్గినయుమా వనితయేమొ
విబుధభాషావచో విభవంబుఁ బ్రకటింపఁ
జరియించుభారతీ సాధ్వియేమొ
ఉగ్రదైతేయ భయోత్పాతమునఁ జేసి
భువివసించెడి శచీ యువతియేమొ
అఖలభువనైక సుందరి నరసిపోవ
భూమిఁదిలకించునా రతీరామయేమొ
కాకయుండిననీమేని కాంతిగలదె
యెంతవెదకినమానవ కాంతలందు.

మిత్త్రమా! ఇక్కాంతామణీ సర్వాంగసౌష్టవం బవలోకింపుము.

ఉ॥ కంబునడంచు గ్రీవము మొగంబు హసించునిశాధినాథుఁ గో
కంబుల దూఱెడిం గుచయుగంబు, గనుంగవమించుఁ బుండరీ
కంబుల యానమంచనడకం బరిహాసముసేయునౌర! లో
కంబుల నెందునేని గలుగం బొడఁగందుమెయిట్టి సుందరిన్॥

ఈపె సకలలోకసుందరాంగీమాలికారత్నంబని నొక్కి నక్కాణింపఁ గలను సుమా?

పుష్పో--అవును తానలచినది రంభయుఁ దాముసింగినదిగంగయుంగదా?

రాజ—మిత్త్రమా! నిజముగావచియింపుము. ఆపె సుందరాంగి కాదా?

పుష్పో—కాకేమి నీవే మోహించుటఁగనిన నాపె సుందరాంగి కాదని
యెవరనఁగలరు.

రాజ—వయస్యా! ఊరకొనుము. ఆపె తన నెచ్చెలితో నేదియో
సంభాషించుచున్నది.

అవం—బాలచంద్రికా! ఈ మాధవీలతం జూడుము.

తే॥ గీ॥ నిండుగాఁ బూసి సుమరాజ ముండనటుల
భ్రమరసందోహ మా మకరందమానఁ
బోవు విహగరాజంబులు ముందె విశ్ర
మింప నేలనో చూడుమీ మించుఁబోఁడి॥

బాల—అవును (తనలో) రాజపుత్రిం గొనిరమ్మని నాకాజ్ఞాపించిన రాజవాహనుఁడు మన్మాధునితోఁగూడ నిందుండనోపును. ఆహా! ఏమి యీరాజపుత్రి ప్రతిభావిశేషము. ఇం దెవ్వరో యుండిరని సూచించుచున్నది ఇప్పట్టున వారినిటకు రమ్మనుటయే శ్రేయము. వారి రమ్మని సైగ నొనర్చెద. (దిక్కులు పరికించును.)

రాజ—మిత్త్రమా! ఇక్కాంతామణీ మేధాశక్తిం బరికించితివా! మన మిటనున్న నాపెకుఁ గనఁబడకఁబోము. కావున నటుఁ బోదమురమ్ము.

పుష్పో—అవును ఈ వటవృక్ష స్కంధంబున దాఁగుదమురమ్ము
(వేఱొకచోఁ బ్రవేశింతురు.)

రాజ—మనమా! ఈపె నెంత వర్ణించిన నీకుఁ దనివితీఱదుగదా!

సీ॥ సిగ్గుచేఁ బైకొన్న జిలుగువల్వనుఁ ద్రోచి
చొక్కంపు పాలిండ్లు నిక్కిచూడ
చేవమై తనరారు రేవెలుంగును గొంత
కసుగందు నెమ్మోము గళలుదేరఁ
గాంచిన మాత్రానఁ గఱఁగు గాటుకనీటి
జిగిసోగ కన్నులు సొగసుఁ గులుక
నిండు జవ్వనమందు నిగ్గుఁ దేఱెడునట్టి
మిసిమించుఁ జెక్కిళుల్ మెఱయుచుండ
మంద మారుతంబునఁ గ్రిందునంది మోము
నున్నముంగురులు పెనంగి హాయలుమీర
తివిరి యాడెడుఁ గ్రొమ్మించు తీవకరణి
ధరణిఁ జలియించుచుండె నీ తన్వియార॥

(బాలచంద్రిక రాజవాహన పుష్పోద్భవుల రమ్మని తలయూఁపును.)

రాజ—అమాత్యశేఖరా! నీప్రేయసిరమ్మని తలయూఁపుచున్నయది ప్రథమమున నీవేఁగి వనమాలికాన్వేషణాపరుండవై యిట కేతెంచినటుల నటించుచు సమయానుకూలంబుగ సంభాషించి యీ చిత్రఫలకంబు నాకొసంగుము.

పుష్పో—సరియే నీవీ వటవృక్షస్కంధంబున దాఁగి నా చమత్కారం బెల్ల వీక్షించుచుండుము.

రాజ—మిత్త్రమా! ఒక్కటి వినుము. కార్యసాఫల్యానుకూలంబుగ నాటకమాడవలయును సుమా?

పుష్పో—అమాయకుఁడా! నీవు నాకింతగా నొక్కి వక్కాణింపవలయునా! మదీయ ధీచాతుర్యంబున నెట్టి కఠినమానవునేనియు గఱఁగించి నాయత్న మాయావాగురంజొన్పనా? ఆత్మశ్లాఘనమేల గావించుకొనవలయు సర్వంబీవే యెఱుంగఁగలవు. పోయివచ్చెద.

రాజ—కార్యసాఫల్య మగునుగాక.

(పుష్పోద్భవుఁడుముందునకురాఁగ బాలచంద్రికావంతీసుందరులు లేతురు)

రాజ—ఆహా! ఏమి యిమ్మదవతి తత్తరపాటు?

సీ॥ పరపురుషాలోక భాగ్యంబునంగల్గు
తత్తరపాటింతఁ దగులఁజేసి
బంగారు జిగిరంగుపైఁటఁ గేలనుఁబట్టి
గబ్బిగుబ్బలజంటఁ గప్పిపుచ్చి
స్త్రీస్వభావంబైన చిఱులజ్జపైకొన
క్రీగంటి చూపులఁ గీలుపఱచి
కాంతుల వెదఁజల్లు గండయుగ్మంబున
చిఱునగ వొక్కింతఁ జెలువొనర్చి

కలకలస్వనంబులవిన్న నులికిపడుచు
ముద్దుమోమున నల్లాడు ముంగురులను
చేతసవరించి నృపకన్య సిగ్గుతోడఁ
బరపురుషుఁగాంచుఁ దనబోటి పజ్జనుండి॥

(పుష్పోద్భవుఁడు సమీపింప నవంతీసుందరి బాలచంద్రికనువీడి చెట్లచాటున కేఁగును.)

పుష్పో—(తనలో) అఝ్ఝారే! సౌందర్యంబన్న నిట్లుగదా యుండవలయును. నన్నీమత్తకాశిని యెఱింగియుండునా? (ఆలోచించి) లేనియెడల భూసురవేషధారినగు నాకై చాటునకేఁగనేల? అయిన నిటులఁ బలికెద. (ప్రకాశముగా) ఓ మానినీమణీ! మమ్ముఁగాంచి యింత సిగ్గునొందవలయునా? నీవంటివారికిట్టి కట్టఁడి కృత్యంబులు చెల్లునా?

బాల—(అవంతీసుందరినిడాసి) సఖీ. వీనింగని చాటునకేఁగెదవేల?

అవం—(సిగ్గుతో) పరపురుషుఁడు గదా?

బాల—అవివేకురాల! త్రిలోకైక పూజ్యుండగు నీభూసుర ముఖ్యునకు సత్కారం బొనరింపక యేఁగుటమేలా!

అవం—భూసురుండని నీవెటు లెఱుంగుదువు?

పుష్పో—(తనలో) ఆహా! యేమి ఈపె దివ్యజ్ఞానము?

బాల—ఈతఁడు సకలశాస్త్రజ్ఞాన సంపన్నుఁడు. ఎట్టి దైవంబులనేని చూపఁగలండు. సకలమణిమంత్రౌషధంబుల నెఱింగినవాఁడు. కొలఁదికాలంబుననుండి తనహితుఁడగు నొకనితో నీపురంబున వసించుచున్నవాఁడు ఇదియ యీతని వృత్తాంతము.

అవం—(మిన్నకుండును.)

బాల—ప్రియసఖీ! అవంతీసుందరీ! పూజ్యాస్పదులఁ దిరస్కరించిన వారి యవస్థల వినియుంటివికదా! ఏల సిగ్గునొందెదవు. ఇమ్మహానీయుని సత్కరింపుము.

అవం—(తనలో) ఈసమయంబున నీతని వృత్తాంతంబెల్ల నరసెదఁగాక. (ప్రకాశముగా) దేవా! మదీయ నమస్కృతులఁగైకొని యీ యాసనం బలంకరింపుఁడు.

పుష్పో—(తనలో) ఈమెం జేపట్టినప్పుడుగదా నామిత్రునది భాగ్యమగును? (ప్రకాశముగా) వివాహోన్ముఖీ! నీయభీష్టంబు సిద్ధించునుగాక.

అవం—దేవా!

ఉ॥ ఎయ్యెడనుండి మీరలిటు లేఁగుచునుంటిరి మీదువాసమా
నెయ్యది, పోవుకార్యమది యేమొ వచింపఁగఁ జెల్లునేని తా
మియ్యెడఁ దెల్పఁగోరెద మహీతల పూజ్యపదారవింద మీ
కెయ్యది వాంఛితంబొ యదియే నొనరించెదఁ దెల్పినంతనే,

మీవంటిమహనీయుల పాదపద్మంబులఁబూజించుటకదా మాభాగ్యము.

పుష్పో—(తనలో) ప్రథమంబున నీ వినయంబు లేమా యెనో (ప్రకాశముగా) కాంతామణీ! మా వాసంబొక గ్రామమా? ఆసేతు హిమాచలపర్యంతంబునుంగల తీర్థయాత్రల సేవించుచు నాయా ప్రదేశంబులంగల విశేషములనరయుచుఁ బోవుచుందుము. మాకుఁగోరఁదగు కోరికలుండునా? నీసచ్చర్యలను సంతృప్తులమైతిమి. నీకు శుభంబగుఁగాక.

రాజ—(తనలో) ఈమందగమన వాక్సుధారసం బెంతయొప్పియున్నది. ఈకాంతామణిఁ జేపట్టినప్పుడుగదా నాభాగ్యము? నాకట్టి భాగ్యముండునా?

పుష్పో—బాలామణీ.

ఆ॥ వె॥ మాళవేశుఁడైన మానసారుని పుత్రి
నంచుమాకుఁదోఁచె నావి కుసుమ
బాణపూజసేయ వసిఁజొచ్చితివి కావె
సిగ్గున దనేలఁ జెప్పరావె॥

అవ—త్రికాలవేదులకుఁ దెలియని దేమికలదు.

పుష్పో—సతీమణుల ప్రయత్నములు సఫలములగుచునే యుండును.

రాజ—(తనలో.)

సీ॥ అమృతోపమానమై హర్షోక్తి నొప్పారు
నసమానమైన తీయందనంబు
మోహనాకారమై ముజ్జగంబులనున్న
కాంతల నవ్వు చక్కందనంబు
అసదృశజ్ఞానమై యతిథికార్యంబులఁ
గనఁజేయు సుప్రభా కౌశలంబు
వర్ణనార్హంబు పక్షిసంతతిఁ బ్రోవఁ
జెలువారు కరుణావిశేష విధము
అపరవాణినా నొప్పు విద్యాధికంబు
గలిగి యలరారు మాళవ కాంత సుతన
వంతి సుందరీమణిఁ గాంచి పంచబాణు
బారిఁబడకుండ జీవింప వశమెనాకు,
తేనెసోనలఁగేరు నీపె వాగ్ధారలనింకఁ గ్రోలెదఁగాక.

బాల—(వ్రేలితోఁ జూపుచు) సఖీ! తన కోడివారలవిడనాడి ముందయానంబున సరోవరప్రాంతంబున కేతెంచు నీ రాయంచ విలాసముం జూడుము.

అవం—(తనలో) ఈ మిషచే బాలచంద్రిక నిటనుండి వెడలఁబుచ్చెద (ప్రకాశముగా) ఔనే చెలీ! తిర్యగ్జంతువులు సహిత మొక్కొక్కవేళ బాల్యస్నేహితులకన్న హృదయాకర్షణం బొనరించును. నీవెట్టులైనఁ దానిఁబట్టుకొని రాఁగలవా? ప్రాణంబులుండఁ గొనిరావలయును సుమీ?

బాల—నీకా రాజహంస బంధనంబిష్టమైన నటులే కావింతును. (ముందునకేతెంచి తనలో) అమాయకురాలింక నీతని విప్రునిగనే భావించుచున్నటులున్నది. కాని ముందెటులఁ దెలియఁ

గలదో? యీ మాధవీలతం డాఁగి వీరిసంభాషణ మాలించెద. (ఆలోచించి) ఇదియే మంచియుపాయము (ప్రకాశముగా) అమ్మా! పోయివచ్చెద.

అవం—కార్యసాఫల్య మొనరింపవలయు. (బాలచంద్రిక నిష్క్రమించును.)

పుష్పో—ఓమదవతీ! నిండుజవ్వనంబుననున్న నీకు వివాహముగాకుండుట విచార్యాంశము సుమీ!

అవం—(సిగ్గుతో) రాజుల కార్యంబు లెప్పుడిట్టివేకదా?

పుష్పో—కాంతామణీ! చక్కగా వక్కాణించితివి నీవైననడుగక పోతివా?

అవం—(లజ్జపడును.)

పుష్పో—రాజపుత్త్రి! సమాధాన మొసంగ నిష్టములేదా?

అవం—(లజ్జతో) ఇట్టి వాక్యంబులాడువారికి నైజములుగావుగదా?

పుష్పో—ఇంతకు వివాహవిషయంబును మీగృహంబునఁ బ్రయత్నములేవైన జరుగుచున్నవా?

అవం—(కాలిబొటనవ్రేలితో భూమిని వ్రాయును.)

పుష్పో—స్వయంవరమునకు నీజనకుం డిష్టపడునా?

రాజ—(తనలో) మిత్త్రమా! చక్కగాఁ బ్రశ్నించితివి. ఇట్టులకదా హితులు దమమిత్త్రుల యభీష్టంబు లొనరింపఁజూచుట.

అవం—(క్రోధాంకురముతో) బాగుగనేయున్నది. పూజ్యుల సత్కరించి పుణ్యతీర్థమహిమంబుల వినవలయునని యెంచిన నన్నెట్టి విషయంబులఁ బ్రశ్నించుచుంటిరి.

పుష్పో—తగిన కారణములేక యడుగుటలేదు. కోపమందకుము.

అవం—ఆకారణ మేమి?

పుష్పో—తినఁబోవుచుఁ జవులడుగనేల. ముందు నాప్రశ్నకు సమాధాన మొసంగుము. తరువాత నెల్లవిషయంబు లెఱింగించెద.

అవం—మిముఁజూడ నేదియో చెడునడత నిందుఁ బ్రవేశించినటులఁ దోఁచుచున్నది.

పుష్పో—(చెవులు మూసికొని) హరిహరీ! సతతము శ్రీపతి పాదపద్మంబుల భజియించు మాకట్టి దుర్నడతలుండునా? దైవసాక్ష్యంబుగ నేనట్టి యుద్దేశ్యంబున రాలేదు.

అవం—అటులైన క్షత్రియకన్యల కెద్దియుచితమో యట్టులేయని యేలఁ దలఁపరాదు?

పుష్పో—కన్యకామణీ! నీమనమిప్పు డెవ్వరియందు లగ్నమైయుండెనని నేనడుగవచ్చునా?

అవం—చాలుఁజాలు. బ్రాహ్మణోత్తముండవని చనువొసంగి నందులకా యిట్లు ప్రశ్నించుచుంటివి.

పుష్పో—(తనలో) ఏమీ? ఈపె వాక్చాతుర్యము? ఈపెమనంబెట్టిదో కనుంగొనవలయు. ఇప్పుడేమని ప్రశ్నింతును. మదీయమిత్రసౌందర్యంబెల్ల వర్ణించిచూచెద. (ప్రకాశముగ) మానినీమణీ! మఱియేమియును లేదు నేను మున్నొకనాఁడు తీర్థయాత్రాచరణంబొనర్ప నొక్కయరణ్యమార్గంబున నేఁగుచుఁ దనతోడివారలతో విహరించు నొక్క రాజకుమారుఁ గంటిని. ఆతని లావణ్యవిశేషంబునుఁ గాంచినదాది యాతఁడీ భువనచక్రంబెల్ల నేకచ్ఛత్రంబుగా నేలఁగలఁడని నిశ్చయించితిని. ఆతని వయోవిలాసంబు వర్ణింప నయ్యాదిశేషునకైన నశక్యంబే,

సీ॥ పసనారుమేలిమి బంగారుమైచాయ
తమ్ముల పగవాఁడు దళుకుమొగము
తామరతూఁపు లందంబు బాహుయుగంబు
తళుకుటద్దంబు జెక్కులడంబు

బాలచంద్రుని వైభవము ఫాలభాగంబు
రోలంబకులము శిరోరుహములు
విషమశరాస్థాన పీఠంబు వక్షంబు
కలువపూరేకులు కన్నుదోయి

సామసవిరోధి ధైర్యంబు సాహసంబు
శ్రీశుహృదయంబు కరుణావిశేషమార
అతుల వర్ణనాతీతమై యవనినాథ
పుత్త్రుఁడొప్పార నెవ్వాఁడు బొగడఁగలఁడు॥

అట్టి నవమన్మథున కెవ్వతె యర్ధాంగియైయుండఁ దగునాయని యోచించుచుండ నిన్ను గాంచినదాది నా మనంబున నొక విధమగు సంతోషం బుదయించుచున్నది.

మ॥ మగువా! మాటలు నేయుయేల వినుమీమారుండెయా వాఁడు సో
యగమందెవ్వరు సాటిగారతని కీ వవ్వానిఁ జేపట్టినన్
జగమందెల్లెడ ధన్యవయ్యె దటులంగాదేని నీ చెల్వమె
ల్లఁగనన్ గానన సీమచంద్రికయగున్ లాభంబె జన్మంబటన్,

కావున దూరమాలోచించుకొనుము.

అవం—(తనలో) అట్టి ధన్యుఁడెవఁడొకదా? నిజముగ నీతఁడాతని విషయమెఱిఁగింప నేతెంచియుండునా? ఈతఁడు భూసురుఁడా? నమ్మఁజాల. ఈతనియాకృతి క్షత్త్రియుండని నిర్ధారణం బొనర్చుచున్నయది.

పుష్పో—కాంతాలలామా! నీమనంబున నేదియో తర్కించుచున్నటు లున్నావు. ఆతని యాకృతి వీక్షింపని దెటులసమాధాన మొసంగుదుననియా! అటులైన నిదిగో నాతని చిత్రఫలకము. (చిత్రపట మొసంగి) ఈ యాకృతి వెనుకభాగంబున నే తదీయ చరితాంశము లిఖింపఁబడియె. నద్దానిఁగూడ వీక్షింపుము.

అవం—(చిత్రఫలకముఁ గైకొని యా ప్రతిమ నాపాదమస్తకము వీక్షించును.)

పుష్పో—అమ్మాయీ! ఏలనంతగాఁ బరీక్షించెదవు నీమనంబింకనుఁ దృప్తికాలేదా? అప్పను తృప్తియెటులగును.

చ॥ సురలలనాజనంబతని సోయగముంగని మోహమంది మం
దిర శయనాలయంబులఁ దదీయ సురూపముఁ వ్రాసి నిత్య మ
చ్చెలువడి చూచుచుండ్గలుగు చెద్దుము చేనని మేషులైరి నీ
వరయుట కేమిలెమ్ము భువనైక మనోహరమూర్తి నాతని॥

రాజ—(ప్రకాశముగా) మిత్రమా! మూలికలఁ గొన్ని స్వీకరించితిని. అందుఁగొన్ని యివియవియని నిర్ణయింపలేకున్నాఁడను. ఒకసారి యిటు రాఁగలవా?

పుష్పో—మానినీమణీ! మే మిరువురము మిత్రులము మూలికలకై యందందు వెతకుచు నేనిందు నిన్ను సందర్శింపఁగలిగితిని. నాహితుఁడు మదీయాగమంబునకై నిరీక్షించుచున్నవాఁడు పోయివచ్చెదను.

అవం—చిత్తము. (పుష్పోద్భవుఁడు నిష్క్రమించును.)

రాజ—(తనలో) మదీయ స్నేహిత సందర్శనాభిలాషనై యాతనిఁ గాన నటులనటించెద. ఓయీ! పుష్పబాణా! నేచెద్దిములు వర్ణనాతీతములుగదా? (ప్రకాశముగా) ఇయ్యెడనుండియే గదా నాహితునికంఠస్వరమువినవచ్చినది. ఏఁడీ! కానరాఁడే? (అందందు వెతకుచు నవంతసుందరినిఁగాంచి) ఈమెనడిగి చూచెదను.

మ॥ అతివా! ఎవ్వరిదానవీ వెఱుఁగ నియారామమందేల నీ
గతినేతోడును నీడలేక తిరుగంగాఁ జెల్లునేనీవు శ్రీ
సతివో భారతివో నగాత్మజవొ యెంచంజాలఁ బ్రార్థింతు నా
హితునెందేఁ గనుఁగొన్నఁ దెల్పగదె మత్తేభేంద్ర కుంభస్తనీ!

అవం—(చాటునకేఁగి తనలో) ఏమి! ఈ వయోవిలాసము.

సీ॥ శరణాగతత్రాణ బిరుద మొప్పారంగ
మెంచుకడాని నెమ్మోమునందు
క్షత్రియోచితములౌ శౌర్యచిహ్నములొప్పఁ
గలువరాయనిఁ బోల్మోగంబునందు
రాజులవెంటాఁడు రాజసంబొప్పార
సూనాస్త్రములఁబోలు చూడ్కులందు
జనులఁబాలించెడు శాసనంబులుమీఱ
నమృతతుల్యంపు వాక్యంబులందు
చేతఖడ్గంబు వట్టిన చెలువుదోఁప
సాముఁజేసినరీతి వక్షంబుబిగియ
భూసురుండనినేఁ దలపోయునట్లు
కపటవర్తనమూనిన క్షత్రియుండె,

ఈతం డెవరిపాలిటి మన్మథుండోగదా? అడిగి తెలిసికొందునా? ఛీ! మగువలకెట్టి తత్తరపాటుచెల్లునే, నెమ్మదిమీఁద నెఱుంగరాకుండునా, బళిరా! ఎంతైన నిట్టివర్ణనాతీతంబగు చక్కఁదనంబుగలదా? (చిత్రఫలకముం జూచుచు రాజవాహనుఁ బరిశీలించును)

రాజ — (తనలో) వారెవా! ఏమి యీ రాజపుత్రిబుద్ధి కౌశల్యము. ఫలకంబుననున్న నన్నెఱింగినటులన్నది. (ప్రకాశముగా) కాంతారత్నమా! నాప్రశ్నంబునకుత్తరమేమి?

అవం — (తనలో) ఈతని వాగ్వైచిత్రియెంత యొప్పుచున్నది. నన్ను లోఁబఱచుకొననెటులు సంభాషించుచున్నవాఁడు. ఈతఁడెంతటి మాయకాఁడు. భూసురవేషంబుననున్న మాత్రంబున నీతని నెఱుంగఁజాలనా? ఈతని యాకృతికిఁ దీటుగ లిఖించిన చిత్రకారుని నైపుణ్యమేమనవచ్చును. చిత్రకారునికన్నఁ జిత్రముగ సృష్టించిన పద్మభవునేమననగు, హృదయమా! నీకింక సందియ మనవసరము నిక్కముగ నీ మనోహరమూర్తి

యాలనిదే? ఇంక నిందున్న చరిత్రాంశమును వీక్షించెద. (ఫలకముం ద్రిప్పి తనలో) మగధదేశంబునుండి మజ్జనకునిచేఁ దఱుమంబడిన రాజహంసుని కుమారుండగు రాజవాహనుఁ డీతఁడా? అయ్యో! అట్లైన మజ్జనకునిచే నెట్టికీడు సంభవించునో? (ఆలోచించి) మున్నెందఱు సుందరీమణులు శత్రురాజకుమారుల వరింపలేదు. నేనును వారి చరిత్రాంశము ననుసరించెదఁగాక. జనకునితో వైరంబు రాఁగలదని మనోహరుండగు నీతనిఁ జేఁబట్టక విడనాడఁగలనా? (చిఱులజ్జతోఁ బ్రకాశముగా) రాజకుమారా! ఇట్టి కపటవేషంబుల నంతఃపురకాంతామణులు విహరించు నుద్యానవనంబులకు రాఁదగునా? నన్ను మోసపుచ్చఁదగునా?

రాజ — (తనలో) భళీ! ఇట్టి సుందరినిఁ జేఁబట్టనివాని జన్మయేల? (ప్రకాశముగా) తరుణీ! నిన్నిందు మోసపుచ్చిన దేమికలదు. నేను కార్యార్థినై రాఁగ నాది కపటవేషంబని దూషింపఁజెల్లునా? ఇది మీ స్త్రీజాతికి నైజమా?

అవం — లేనిచో భూసురవేషం బేల ధరించితిరి?

రాజ — ఇది కృత్రిమవేషమా?

అవం — ఈచిత్రపటము వీక్షింపుము. ఇది నీయది కాదా?

రాజ — (తనలో) ఈమె నిప్పట్టున మోసపుచ్చవలయును. (ప్రకాశముగ) బేలా నన్నే రాజకుమారునిగాఁ దలంచితివా? ఏమి నీయజ్ఞానము.

అవం — రాజకుమార! నన్నేల యింక మోసపుచ్చఁజూచెదవు? నీవు నిక్కంబుగ క్షత్రియుండవనియేఁ దలంచెదను. లేనిచో క్షత్రియోచితంబులగు లక్షణంబు లెటులు రాఁగలవు?

రాజ — (తనలో) ఇప్పుడుగదా ధన్యుఁడనైతిని. ఇంక నీమెతో నన్నృతంబులాడిన విరిగినపుల్ల నతికించుటవోలె నీమె హృదయంబు

మరలింపఁ గష్టతమంబగు. (ప్రకాశముగ) మనోహారిణీ! న
న్నింకను బాధపెట్టనేల వినుము,

మ॥ పొలఁతీ! నీదు వివేకముం గనుగొనక మూఢుఁడనై యింత వ్యా
కులమొందించితి, వైరులంచుమది సంకోచంబునన్ మీననీ
తలముం జేరఁగనైతి భూసురుఁడ, త్వత్సౌందర్యముం జూచి క
న్నుల మోహాబ్ధిని గ్రుంకులాడితి, ననుం బ్రోవంగదే! కోమలీ!

అవం—ఇదియా నీవనుపడి భూసురుఁడవని మోసపోయితిని. చెలీ! బాలచంద్రికా (చెట్లచాటున కేగును.)

రాజ—సఖీ! ఏలచాటున కేగెదు.

మ॥ చెలులాలేరు సమీపమందెచట నీసిగ్గేలనే? రాచక
న్యలు గాంధర్వవివాహమాడఁ దలపోయరా లేదె? పూవిల్తుకో
లల పాలంబడి మ్రగ్గనెంచితివె? నీలావణ్యభాగ్యంబు ని
ష్ఫలముం జేతువె? జ్ఞానశూన్యవయి పోవంజూడకే? సుందరీ!

అవం—చెలీ! బాలచంద్రికా! (చెట్లచాటున కేగును.)

రాజ—సుదతీ! ముందు రాఁబోవు నిక్కట్టులూహింపుము. పోఁబోకుము.

[తెరలో.]

అమ్మా! అవంతీసుందరీ! ఎచటనుంటివమ్మా! మీతల్లిగారు నిన్నన్వేషించుచున్నారు.

బాల—(ప్రవేశించి తనలో) మహాదేవి వచ్చుచున్నటులున్నది వారి కంటఁబడిన నపాయము రాఁగలదు. వీరిరువుర కెడఁబాటుఁ గూర్పవలయు. (ప్రకాశముగ) దేవా! మీహితుఁడు మీకై వేచియున్నాఁడు. దయచేయుఁడు. అమ్మా! రాజపుత్త్రీ! మీయమ్మగారు మీకై యిటే వచ్చుచున్నారు. ఎదురుగాఁబోయి కలిసికొందము రమ్ము. ఆపటమిటు తెమ్ము. ఎవరెఱుంగకుండఁ దాచియుంచెద (పటముఁదీసికొని పొదవచాటునఁ దాయును.)

(మహాదేవీ కేతకులు ప్రవేశింతురు. రాజవాహనుఁడుఁ దరువులమధ్యఁ దాగును.)

కేత—అమ్మా! ఇటురమ్ము. అమ్మాయిగారు బాలచంద్రికతో నిటనే దో చెప్పుచున్నారు.

అవం—అమ్మా! వందనము.

మహా—చిరంజీవ. అమ్మాయీ! అవంతీసుందరీ! చెలికత్తియల నం దఱివీడి యిటనేమి చేయుచుంటివమ్మ.

అవం—దేవతాపూజార్థము కుసుమంబులఁగొనిరమ్మని పంపిన చెలు లింకను రాలేదు. అందుచే మేమిరువురము నీసరోవరంబునంగల ఖగసంతానంబుల వీక్షించుచున్నారము.

కేత—నవయౌవనంబున నిట్టిచేష్టలతోడనే కదా కాలఁబుచ్చుట.

అవం—(తనలో) ఈపె మాసంభాషణంబును వినియుండునా! కాదు కాదు. ఈపెచిన్నతనంబునుండియు నిట్టులనే హాస్యంబులాడు చుండును. ఇప్పుడు నంతియే (ప్రకాశముగ) బాలచంద్రి కా! హంసనుఁబట్టుకొని రాలేదేమి!

మహా—హంసయేమి? ఎచ్చటనుండివచ్చెను.

బాల—ఏమియును లేదు. మేమిరువురము నిచట నాడుకొనుచుండ నొక రాయంచ మందగమనంబున నేతెంచె. దానిఁబట్టెదనని పంతంబులఁబలికి వెన్నాడితి కాని యది చిక్కక యెగసిపో యె. (స్వగతము) బాల్యచాపల్యంబున గుట్టంతయుఁబైటఁ బెట్టుకొనునటులున్నది.

అవం—అమ్మా! ఇటులే తెంచు నీపెంపుటంచం జూతుము.

మ॥ పదునార్వన్నెకడాని సోయగములో పత్రంబులందల్కులిం
పొదవన్, నీడలు దేలమైజిగిని, నత్యుత్సాహముం గొంచు, న
మ్మదిం గాలూనుచు, విద్యలం గొనిన సామర్థ్యంబునుం జూపి, య
య్యది యే మమ్ములం డాయవచ్చెడివి విద్యాధిక్యము స్నేర్వగన్॥

మహా—తిర్యగ్జంతువులయినం బెంచిన విశ్వాసము మానవుగదా.

కేత—అమ్మా! సూర్యాస్తమానంబగుచున్నది. పోదమురండు.

మహా—అవును. అమ్మాయి! పోదమురమ్ము.

అవం—(నడచుచుం దనలో) అయ్యో నాచెల్మిం గోరి యేతెంచిన జీవితేశ్వరుం డొంటరిగానుండ విడచిపోవలసివచ్చెం గదిగదా! ఇందులకాయన యేమనుకొనునో? జనవియానతిమీరిన నీకేమైన ననుమాన మొందక పోరు. కావున మ్మదీయాభిప్రాయంబుం దేటపడునటుల నీహంసనుం గూర్చి వచియించిపోయెదం గాక. (ప్రకాశముగా) ఓ! రాజహంసమా!

చ॥ చెలిమినొనర్పం జూసి వనసీమవిహారముసల్పం గోరు ని
న్నలమట నొందం జేయుచు గృహంబున కమ్మయనుజ్ఞనేగంగా
వలసెతమింపుమీవు వన భాగములందు నిరంతరంబు మ
మ్ములం గనుచుందువేకద? యపూర్వపువైత్రి నొనర్తువే కదా॥

(అందఱు నిష్క్రమింతురు.)

రాజ—(చాటుననుండి బైటకువచ్చి.) ఆహా! సుధారసంబులం గ్రిందు సేయు నీపెవాక్యంబు లెంత సంస్తవనీయంబులు. బుద్ధివైచిత్ర్యింబన్న నిటులుగదా యుండవలయు. అన్యజనాగోచరంబగునట్లు రాజహంసనుం గూర్చి పలికిన వాక్యంబు లెంత విశ్వసనీయంబులు. వాక్యంబులే యననేల.

ఉ॥ ఆమృదువాక్యపుఁ సొగసు, ఆసుకుమారశరీర సౌష్ఠవం
బా, మహనీయధీవిభవమా, భువనైకవిలాసమట్టి, భా
షా మహిమంబ, నన్యజనసామ్య దయాగరిమంబుఁగల్గు యో
షామణిఁ గాంచనేర్తుమె రసాతలమందున నెందు నేనియుఁ,

కావున నే,

మ॥ మునుబీజంబయి, మిత్రవాక్యముల నప్పూబోడి సౌందర్య ద
ర్శనకాలంబున నంకురంబయి, సతీసంభాషణాభ్రష్ట నూ
తన కారుణ్యరసంబునం బెరిగి, యత్యంతంబు వ్యాపించె, నిం
కనుఁబుష్పించునొ లేదొ మోహలతయక్కంజాక్షిలభ్యంబునన్॥

అదుగో పుష్పోద్భవుఁడచ్చటనే యున్నవాఁడు పోయి కలిసికొనియెద

(నిష్క్రమించును.)

ప్రథమాంకము సంపూర్ణము.

శ్రీ

రాజవాహనవిజయము.

ద్వితీయాంకము.

(రంగము—అంతఃపురము. కుసుమశయ్యపై నవంతీసుందరి పరుండి యుండఁ బరిచర్యనొనర్చుచుఁ బాలచంద్రిక ప్రవేశించును.)

అవం—(విషాదముతో) సఖీ! బాలచంద్రికా! మదీయహస్తలిఖితం బగు నీలేఖం గొనిపోయి యమ్మహాసీయున కర్పింపఁగలవా? (ఉత్తరమిచ్చును).

బాల—(ఉత్తరమందుకొని). అట్లాలనే యొసంగెదను. నేనచియుం వలసిన వాక్యంబు లింకేమైననున్నవా?

అవం—నాదురవస్థనంతయుఁ గన్నులారఁ గాంచుచున్న నీకింకేమి చెప్ప వలయును. అయిన నావాక్యంబుగా నామహాసీయునితో నిట్టులవచింపుము.

సీ॥ శరణాగతులఁ బ్రోవ బిరుదముం జేకొన్న
యవనీంద్రునకివె జోహారులనుము
వనవిహారమునాటి తనవాక్యముల నెల్ల
జ్ఞప్తియందుంపఁగాఁ గలుగుమనుము
క్రూరుఁడౌ మారుని నారాచములకోడి
యబల నాటను శరణంటిననుము
భావజునుండి సన్నావఁగా రానిచోఁ
బ్రాణములీడువఁ బాల్పడుదుననుము

తే॥గీ॥ నిక్కువము నేను నీచేతఁ జిక్కితనుము
కాచినను మాని నను నీదు కాంతయనుము
తోడ తేవచ్చి నాతోడఁ గూడుమనుము
చూడ నేరి కాలస్యంబు గూడదనుము ॥

బాల — నా వాక్చాతుర్యంబెల్లఁ జూపి యాతనినిటకుఁ గొనివచ్చెదను. నేనేతెంచువరకు నుద్యానవనంబున కేగి నీయాయాసంబు నిర్వర్తించుకొనుచుండుము.

అనం — ఓసి వెఱ్ఱిబాగులదాన! అచ్చటివింతలన్నియు మండుచున్న స్మరదవానలంబున వేయు సమిధలుగావా

సీ॥ పాంథులనేచు టుపనిగాఁ గదిలకించు
పెనుమూకలైన కోవెలలుఁ గలుగ
విరహుల వగముంప విఱ్ఱవీగెడు బ్రహ్మ
రాక్షసులౌ మయూరములుఁ గలుగ
మకరందములఁ గ్రోలి మత్తిల్లి ఝుంకార
ములు సేయు మధుకరంబులును గలుగ
వగనొంపువారిఁ బెల్వగను నొందఁగఁ జేయు
స్వనములూను శుకరాజములుఁ గలుగ
తే॥గీ॥ మారునకు సాయమ్మాచును మేరమీరి
బలవిరోధముఁ గొనుగంధ వాహుఁడుండ
వైరిభూస్థలియైన యావనము నెటులఁ
జేరఁగాఁ గల దానవచింపు సకియ॥

బాల — అటులైన యిట నేయుండుము. పోయివచ్చెద. (పోఁబోవును).

అనం — చెలీ! ఈ విడెంబునుఁ గూడఁ గొనిపోయి యమ్మహానీయున కొసంగుము. (బాలచంద్రిక విడెముంగొని నిష్క్రమించును).

అనం — అయ్యో! యీ మన్మథదవానలంబు నన్నెంత దహించుచున్నది.

క॥ చందన గంధపుఁబూతల
నందినఁ గదుపానకంబునానిన విరిసె
జ్జందనువుం జేర్చిన నే
మందును తాపంబుహోక యధికంబాయెౕ॥

స్త్రీలజన్మం బెంత నిరర్థకమైనది.

మ॥ అకటా! నూత్నవయో విలాసమును, విద్యాధిక్య భాగ్యంబు, పై
సకలైశ్వర్యములుౕ, మహాసుగుణసత్సంపత్తియుౕ, గల్గి, వే
డుకఁ గాలంబునుఁబుచ్చుచున్న జనకుండుం దల్లియవ్వారి కో
రికలందీర్పమి నిష్ఫలంబుగద యుర్వీౕ వారిజన్మంబులే॥

హా! విధి నీకుఁగూడ నబలలమగు మాపైననేవైరమా?

ఉ॥ సుందరినందహీనునకు సోయగవంతునకుౕ విలాస శ్రూ
న్యం దగఁ జేర్తువా యిరువురందమునందు సమానులైన చో
నెందును వైరమొందువిధియుంచెద వక్కట, నీవు చేతలే
మందును. నీవునీసతియె యందఱిమించఁగనిట్లు చేసెదో॥

ఉ॥ సారములేనిభూమి, ఘనసారములేనివిడెంబుడంబు, కా
సారములేనిగ్రామము, ప్రసారములేనిసుమంపుతావి, సం
సారముస్త్రీలకెందు మనసారముదంబునుఁ గూర్పకున్న, ని
స్సారముఁగావె, భాసురవిసారవిదూర సరోవరంబులుౕ॥

(ఆలోచించుచు) అయ్యో! అవివేకురాలనయి జాబునేలనం
పితిని. ఇందుల కాతఁడనిష్టంబుఁజూపినఁ బదుగురలోనగుఁబా
టుకదా! అతండటులొనరించునా! నాఁడుపుష్పారామ మధ్యం
బున నన్నెంతగాఁ బ్రతిమాలియుండెను. అందులకు వ్యతిరే
కించివెడలితినని యేమైనఁగోపగించి నిరసించునేమో! (ఆలో
చించి) జనని యాజ్ఞానుసారంబ యేగుచుంటిననియు నీస్నే
హంబువిడఁజాలననియు నమ్మరాళంబునుద్బోధించి పలికితినిఁ
గదా? ఇంతమాత్రంబునఁ గోపంబేల చెందును. ఏమోనర్మ
గర్భంబులగు మదీయవాక్యంబుల నంతగాఁబరిశీలించియుండ

డేమో? ఇంతమాత్రము వివేకముండదా? అబలనై మన్మథ
శరానల దహ్యమాన కోమలగాత్రినయి తన్ను శరణాగత
త్రాణబిరుదాంకుఁడని శరణుఁజొచ్చినఁగాదని నిరసించునా!
పుష్పసాయకు బాణంబులకు గుఱిఁజేయునా! ఆహా! అమ్మ
హానీయుని మూర్తిపుంజంబెంత యొప్పియున్నది.

సీ॥ గంగానదీజాత కనకాబ్జమునుఁబోలు
మోమునఁజిరునవ్వు మొలకలెత్త
వజ్రంబులన్నగుఁ బాటునొందగఁజేయుఁ
దళుకుఁదంతములు వెన్నెలనుఁగాయ
భ్రమరకులంబులఁ బరిహాసింపఁజాలు
మేలుమీసంబు లుయ్యాలలూఁగ
పాదపశాఖలం బరిహాసమాడు భు
జములు వీరుల నెకసక్కెమాడ
తే॥గీ॥ మంజువాక్య సుధారస పుంజములను
బలుకుమగధదేశంపు భూపాలసుతుని
కనిముగ్రహింపఁ గవిసింపఁదరమె నిష్ఫ
లంబుగాదె మదీయజన్మంబుఁగూడ

ఇందు వసంత, జయంత కంతుసన్నిభుండగు నీనవలావణ్యాబ్ధిందమి
మీఱ నాలింగనమొనర్చి సుఖింపనిసుందరాంగి జన్మంబేల. అతఁడు

శా॥ ఆనాఁడావనమధ్యమందు ననునత్యాసక్తి వీక్షించుచో
సూనాస్త్రుండిడ సాయకంబుల మహాశూరత్వమేపార, న
న్నావిందాళిఁగలేక దీనుఁడయి నన్నార్థించువాక్యంబు లా
హా నేనేవిధిమర్వఁగాఁగలను దేహంబిట్టులేయుండఁగన్

(పటముఁజూచుచు) భళిరా! సుందరుఁడన్న నీతఁడుగదా. చతుర్దశ భువ
నంబుల సురాసుర సిద్ధసాధ్య గరుడయక్ష కిన్నరకింపురుష పన్నగు
లందు నిందైననిట్టి రూపవంతుంజూడఁగలనా! దైవమా! ఇమ్మహానీ

యుని చెట్టఁబట్టుటెట్లు సిరిరామోహకాలడ్డినటుల నవివేకురాలనయి యెంతఁగావించితిని. ఎన్నిసారులు మఱతుమన్నను మకరంద మాధుర్యంబున దలించునాతని వాక్యంబులు మఱపురావుకదా! జన్మాంతమందైన మఱువఁగలనా! హా! నవమదనా! రాజవాహనా!

చ॥ త్రికరణశుద్ధిగా మదివరించితినిన్ను, హిమాకరార్కతా
రకులెమదీయసాక్షికులు, క్రౌర్యమునందలి దండ్రులేన్నృపా
లకునయినన్ వరింపగఁదలంపుమటన్నను, బాధఁబెట్టినన్
సకలవిధాల, నిన్నువిడఁజాలను, తథ్యముతథ్యమియ్యదే

మ॥ జననంబెత్తిన సుందరాంగి స్మరసత్క్షేత్రలంబోలు నూ
తనసౌందర్య విభాసురుంగలిసి మోదంబందుచుం గాలమె
ల్లనుఁబోఁబుచ్చఁగలేనిచో విభవమేలా? జవ్వనంబేల? త
ద్ఘనలావణ్యమునేల కాంచనవికాంతార ప్రసూనంబుహో

కావున నీతని కరగ్రహణంబొనరింపవలయును. సౌఖ్యపారావారంబున నోలలాడవలయును. (అంతఁగేతకి చెంపకులు ప్రవేశింతురు.)

కేత—రాజపుత్రీ! ఏమిచేయుచుంటివమ్మా!

అవం—(వినుపించుకొనక యే) అయ్యో నన్నీమన్మథుండెంత బాధించుచున్నాఁడు.

కేత—(రహస్యముగ) చంపకీ! నాలుగైదుగినంబులనుండి యీపె శరీరము శుష్కించుచున్నది. కారణంబేమైయుండునోయని యోచించుచుండ నేఁటికినన్ను మన్మథుండెంత బాధించుచున్నాఁడనిన వాక్యంబునుఁబట్టి కారణంబూహింపనగుచున్నది. నూత్నయవ్వనంబున నూగులాడు వారిపై కీమర్మార్గుఁడొంటికాలుతో నేతెంచునుఁగదా! ఈపె యెవ్వరిని వరించినదో కనుఁగొనవలయును. నీవిటనుండుము. ఈపె విషయంబింకనుఁ గన్పెట్టెదను (సమీపించి) రాజపుత్రీ! ఇటులుంటివేమమ్మా.

అవం. **ఉ॥** పంచశరుండనంగ **సుమ**బాణుఁడనంగ నిజంబె**యై**నఁ జా
పంచములైనకోలల నవంధ్యముగా నెటు వేయఁజాలునో
యుంచుక గాని మేన సహియింపఁగ రాకెటులుండు పూల్కరా
లంచన, వీనికౌశరముల తీయలిప్తకముల్నిజంబుగన్

కుసుమసాయకా! మాయుసురేలపోసికొనియెదవు

ఉ॥ తాపమహాబ్ధియందు సతతంబును పాంథులవుంచినీవు సం
తాపముగూర్చుటంగని మనంబున రోషమునందిశూలి, త
న్నేపునఁదాకవచ్చుట నశింపగఁజేసెను కాని, యక్కటా!
"పాపిచిరాయువ" న్నటుల వర్ధిలుచుంటివి **మాయ**భాగ్యతన్

అయ్యో! మేనల్లునకుఁదోడై యీపాతకినన్నెంత బాధించుచున్నవాఁడు ఛీ! రాజా! నామమున **మాత్ర**ము రాజువుగాని నీమమునఁ గావు**సుమీ!**

సీ॥ కాలకూటముతోడఁ గలిసిపుట్టినవాఁడ
రాత్రించరులవృత్తిఁ బ్రబలువాఁడ
చెలియలిగ్రహమ్ములఁ గలతవెట్టెడివాఁడ
విరహులపైఁ దాడివెడలువాఁడ
కన్నతండ్రికిని భంగంబుఁగూర్చెడివాఁడ
విషధరంబులనోట వెడలువాఁడ
స్నేహితుసిరిఁగాంచి చింతనొందెడివాఁడ
చక్రమ్ములకుఁగీడు సలుపువాఁడ
తే॥గీ॥ తామరలకుఁగీడు నొనర్పదలచువాఁడ
పాండురోగాననెప్పుడు బ్రతుకువాఁడ
నేనుసత్కులోద్ధారుఁడ నేయటంచుఁ
గర్వమందగఁబోకురా కలువరేఁడ

కట్టా! ఈ గంధవాహుఁడుగూడ వారికే తోడుగావలయునా! అవును లోకంబున దుర్మార్గులందఱొక్కటై సాధులనేచుట నైజమేకదా? ఓరీ! మారుతా!

ఆ॥వె॥ పన్నగముల చేతఁ బన్నగహారు చేత
భాధనొందునీవు, పద్మవైరి
కంతులొక్కఁజూచుఁ గంటిరేఖఁ దీర్ప
భుజగవేణినన్ను బోరిగెలిచి

చంప—అబ్బా! ఈపె విరహతాపంబెంత హెచ్చుగనున్నదే చల్లా
రవీవనతో వీచుదమురమ్మా (అట్లు చేయుదురు.)

అవం—ఔరా! యజమాను నందఁగొని మొరిగెడు శ్వానంబులట్లీ
విహగంబులెంత వదరుచున్నవి.

సీ॥ కోకిలా! నీయిల్లు గూలిపోవుటఁగాని
నీముందులోకంబు నిలువఁగలదె
కీరమా! నిన్ను సంకెలల నుంచుటఁగాదె
పాంథులునీముందు బ్రతుకఁగలరె
బరిహా! నీకుఁగఠినస్వనము గల్గుటఁగాని
యున్నాళ్లుమేము వసింపఁగలమె
హంసరాజంబ! నీకంగపాండుతఁగాని
విరహులపైఁదాడి విడువఁగలవె
తే॥గీ॥ భృంగమా! నీకువైరిసంపెంగగలుగఁ
గాని భూమిపై మేము గాలూనఁగలమె
శారికా! నిన్నుఁజిన్ని పంజరమునందుఁ
బెట్టుటనుగాని మేముజీవింపఁగలమె

అబ్బబ్బా! నిప్పులపైనఁ జల్లుచున్నారేలనే? మీరుఁగూడ నాతులు
వలకే తోడగుచుంటిరా?

కేత—అమ్మా! రాజపుత్రీ! యేమియునెఱుఁగని పసిగోలవు నీవెట్లు
మారశరంబులకుఁ గురియైతివమ్మా!

అవం—హా! రాజవాహనా! ఈదుర్మార్గులు నన్నిటుల బాధఁబెట్టు
చుండ మిన్నకుండుట పాడియా? వీరిందరుమ లేవా! దయరాదా!

చంప—(జనాంతికముగ) ఓసీ! రాజవాహనుఁడెవఁడే.

కేత—అది యేనాకును సందియము. ఎవఁడోయొక రాజశ్రేష్ఠుఁడై యుండును.

చంప—మన్మథబాణంబుల కోర్వఁగలేక రాజభూషణు వేయుచున్నదా యేమి?

కేత—అమ్మా! రాజపుత్త్రి! ఉపచారంబొనరింతుమా? (ఉపచారము సల్పుదురు).

అవం—(కన్నులవిచ్చిచూచి) అయ్యో! నెచ్చెలులారా! మీకు నేనేమి యపకారంబొనరించితినే.

చంప—ఇటులనియెదవు. మేమేమిచేసితిమమ్మా!

అవం—ఏమిసేయొనరించితిమనుచున్నారా?

సీ॥ వీవనచేసుంత వీచెదమంచునుఁ
జంద్రనిప్పులమేనఁ జల్లనేల
కుసుమశయ్యను నొనఁగూర్చెదమంచును
కలికుటమ్ములనింపఁ గడఁగనేల
చల్లనౌపన్నీరుఁ జల్లెదమంచును
వేడినీళ్ళనుమేన విడువనేల
కడుమంచిచందన గంధమటంచునుఁ
గసుగందమొయునిట్టు గలఁచనేల

తే॥గీ॥ ప్రాణసఖులయ్యు నీరీతివైరమున్ వ
హించి కఠినవాక్యముల నిందింపనేల
చెనటిమరునకు సాయంబుసేయనేల
చింతతోవేడనన్ను రక్షింపకేల

చంప — కేతకీ! ఈపె విరహమెంత దుస్సహముగనున్నదే? మనము నిటులనుభవించినవారమే కాని యిట్టిబేలతనంబు నొందలేదు సుమా!

కేత — ఎవరకు వాఁటులే యనుకొనదరే?

చంప — ఇపుడేమిచేయుదమే.

కేత — ఎట్టియుపచారంబు లొనరించుచున్నను దద్వ్యతిరేకములగు చున్నవి మనవల్లనేమగును.

అవం — చెలులారా! దుర్మార్గుండగు నిశాకరుండింకనరుఁగలేదా!

చంప — (ప్రక్కకుఁజూచి) అమ్మా! ఇటుచూడుము.

తే॥గీ॥ పద్మముఖివిరహంబుఁ బాల్పడినదాని
కనుఁడో భాగినేయునిఁగలిసి బాధఁ
బెట్టురాత్రిచరు నిద్రుంపవెడలెనసఁగ
నినుఁడునెట్టనో మోమునసేగుదెంచె

అవం — ఏమేమి! మాయినుఁడేతెంచెనా? హా! రాజవాహనా! (లేచును).

కేత — రాజపుత్రీ! ఎంతటి యమాయికురాలవమ్మా! ఇరుండన మీ రాజనుకొంటివా.

అవం — (సూర్యునిఁజూచి.) హా! చెలులారా! ఈనిశాకరుండెంత క్రోధుఁడయి నాపయి కురుకఁజూచుచున్నాఁడో చూడుఁడు హా (మూర్ఛిల్లును).

కేత — అమ్మా! ఈతఁడు చంద్రుఁడుగాఁడు. తద్విరోధియయిన సూర్యుఁడే.

అవం—అయ్యో! కమలబాంధవుఁడే తెంచినను మా బాలచంద్రిక యింకను రాలేదా? ఇంక నేనెట్లు జీవింతును. నాహృదయేశ్వరునిజాడఁ దెలుపువారెవరు.

చంప—(జనాంతికము) కేతకీ! రాజవాహనున కీపెయవస్థ నెఱింగింపఁ బాలచంద్రిక యేగియుండునా?

కేత—ఏమో నాకుమాత్రమేమి తెలియును. నీవేగి బాలచంద్రికనుఁ దీసుకొనివత్తువా?

చంప—ఎచ్చటనుండునని తీసికొనిరాఁగలను.

కేత—అట్లనకుము. నోట నాలుకయుండిన నెట్టిచోటైనఁగనుఁగొనవచ్చును.

చంప—సరియే తీసికొనివచ్చెదను. (నిష్క్రమించును.)

అవం—(ఆతురతతో) నెచ్చెలీ! ఆవినవచ్చు మంజీరకలకలస్వనంబులెవ్వరివి?

కేత—(చూచి) బాలచంద్రికవే!

అవం—(ఆతురతతో లేచి కూర్చుండి) ఏదీ మా నెచ్చెలి?

బాల—(ప్రవేశించును.)

అవం—సఖీ! వచ్చితివా?

బాల—వచ్చుటయే కాదు. తెచ్చితిని

అవం—మన్మథునిఁ గొనివచ్చితివా? ఏరీ! ఎచటనున్నారు.

బాల—సందేశమును మాత్రమే.

అవం—(నిర్వేరగంది) ఏమని.

బాల—వినుము.

[తెరలో కేతకీ కేతకీ అమ్మగారి సెలవగుచున్నది.]

కేత—(తనలో) శనివలె నాకిప్పుడే దాపరించినదా? (ప్రకాశముగా) ఇదుగో వచ్చుచున్నాను. (నిష్క్రమించును.)

బాల—రాజపుత్త్రి! వినుము. నేనటులఁ ద్వదీయవార్తాహారిణినై యేగి నీవలె మన్మథతాపంబున నుసురుసురనుచు సోలియున్న నీప్రియునిఁగాంచితిని.

అనం—ఏమీ! నావలెనే విరహదవానలంబున గ్రమ్గుచుండెనా? అక్కటా! యెంతపాపిష్ఠురాలనై యమ్మహనీయునిఁ దిరస్కరించి బాధఁబెట్టితిని. ఇందులకు నన్నేమని దూషించెనో కదా? చెలీ! నవకుసుమ సుకుమారంబగు నాతని శరీరంబెటులున్న యది.

బాల—ఎటులుండవలయునో యటులున్నయది వినుము.

తే॥గీ॥ ప్రబల గ్రీష్మాతపంబున వన్నెఁబాసి
యున్నలతవోలె మదనశరోగ్రకీల
లందుఁ గృశియించి కళఁబాసి యాతఁడుండె
నాత్మలోనిన్నె పలుమారు లఱసికొనుచు॥

అనంతరమున నన్నుఁగాంచి యంకురించిన చిరునవ్వు మొగంబున సీకు శలంబడిగె. అంతనే నీవొసంగిన విడెంబొసంగి దేవా! ఆపె కెక్కడి కుశలము. నిన్నామెలమావి తోటంగాంచినదాది నీవలెనే యన్నపానాదుల విసర్జించి నానాఁటికిఁ గృశించుచుఁ బ్రేతాకారంబగుచున్నయది చూడుఁ.

మ॥ కనులంజూడదు చిత్రవస్తువులనుఁ గాంక్షింపదాహారమై
నను,(బొత్తంబులఁజూడఁబోదెపుడు చింతాక్రాంతయైయుండు, శ
య్యనెవాంఛించును, చేతఁబుష్పములఁగోయంబోదు, చేలంబునన్
గనుదోయింగతునొత్తు, మారశరముల్గ్రాచ్చుఁగా మేనికిన్॥

ఎన్నిచలువులనేనిఁ బోనితాపంబునఁ గృశించుచున్నయది. ఇవ్వియేల వినుము.

తే॥గీ॥ దినము విరహదుఃఖాబ్ధిని మునుఁగుచుండు
చక్రవాకియైన మఱియేజంతువైన
నింతవగనొందఁగాఁ బోవదెందుకింత
మున్ను వనినీవుఁ గన్న పూఁబోఁడిగాదు॥

ఇంకఁ గొంత కాలంబటులేయున్న మన్మథధనుర్విముక్తనారాచ శిఖిశిఖలంబడి జీవించునని మాత్రము నేనునమ్మనని గట్టిగ వక్కాణించితిని.

అవం—అయ్యో! బాలచంద్రికా! ఆయనకు మఱింత విచారమునుఁ గూర్చితివా? నేనివ్వియన్నియు వచింపుమంటినా?

బాల—సరియే బాగుగనున్నది. చెప్పుమనుటయు మరలనిప్పుడు వలదనుటయు నీవేనా?

అవం—సరియే కానిమ్ము. అయిన దానికేమిచేయఁగలము. అందుల కాతఁడేమనియెను.

బాల—"ఆమెనాతో నేమైనవచింపుమనియెనా" యని యడిగెను.

అవం—అందులకు నీవేమంటివి.

బాల—"ఆమెస్వహస్తలిఖిత పత్త్రింబొకదానినొసంగియున్నయదిదిగో" యని నీలేఖ నొసంగితిని. అంత నద్దాని నాద్యంతముఁబఠించి నుస్సురని యూరకొనియె. అంత నేను నీవువచియించిన వాక్యములఁగూడ నుడివితిని.

అవం—అందుల కేమనియెను

బాల—అంతనాతండు "బాలచంద్రికా! నాజీవితంబెల్ల నామెచేతినుండఁ దాసటులేలనుమనవలయును. నేనీపురంబునుఁ జొచ్చుటకుఁ గూడఁదానేగదా కారణము వనవిహారమునాఁడు గాంచినప్పుడే మదీయహృదయంబామెగైకొని చనియె. నట్టిచోనికఁ

జెప్పెడిదేమికలదు. అంగీకారం బైనను దద్వ్యతిరేకంబయినను నాపెయేగదా చూపవలయును" అనుచు నాలోచించి "పోతుటీగకైనఁ జొరరాని యక్కాంతామణ్యంతఃపురంబునుఁ బ్రవేశించుటెటులు? దీనికేదియైన నుపాయంబుఁగావలయుఁ గావున రెండు మూఁడు దినంబులలోఁ దగునుపాయం బాలోచించి మనోరథం బీడేర్పఁగలననుము. మఱియు"

సీ॥ మారపుష్పశరాగ్ని మ్రగ్గుచుఁబంపిన
సందేశమునువినఁ జాలితనుము
నామూలమునఁదాను ననవింటఁజిక్కుట
నెంతేనిమది గణియించితనుము
వనిలోననిన్నుఁ గాంచినదాది నేఁటికి
నొంటిప్రాణముతోడ నుంటిననుము
తలఁజూచి వేగనంతఃపురంబునఁజొచ్చి
పంచాస్త్రగర్వంబుఁ బాపుదనుము
తే॥గీ॥ దీననేమైన నాలస్యమైనఁగాని
పూని ప్రాణంబు విడువఁగాఁ బోకుమనుము
శరణువేఁడువారిని వీడఁజాలఁడనుము
నిజము నీమాటయేమది నిలిపితనుము॥

అనివచించి నాతోనిట్లనియె.

అవం—ఏమనియెను.

బాల—"బాలచంద్రికా! అక్కాంతకుబహిఃప్రాణంబవగు నీవాపెనెవ్విధంబుననైన నోదార్చుచుండుము. సుకుమారంబైన యాపెమేను విషమశరాగ్ని వన్నెఁదొరఁగకయుండఁ గాపాడుము"నియనియె. అంతనేను దేవా! నేనెంతనీ యాపెనుఁగాపాడఁగలను. ఆమెయవస్థవినుము.

చ॥ కిసలయతల్పమందును నొకించుక మేనునుఁ జేర్ప స్నిగ్ధసా
రసములఁ బోలు నంగములు రక్తిమ నందగఁ జొచ్చె మారుఁడా
కుసుమశరాగ్నినందుల నె కూర్చెను మానిని నేఁచ నాపె దా
వ్యసనము గాంచువారి హృదయంబు వకావకలౌ నిజంబుగన్॥

అబ్బబ్బా! ఇట్టి విరహంబుల నొందినవారిఁ జాలమందినిఁ గంటిని గాని యీపెవలె నగచాట్లకుఁ బాల్పడువారినిఁ జూడలేదం"టిని.

అనం—ఓహో! నీచేదస్తమున కంతులేకున్నయదే.

బాల—అంత నైంద్రజాలికుఁడట వారి స్నేహితుఁ డొకఁడు మేనఁబలు వన్నియల యుత్తరీయము మెఱయఁ జెవుల గుండలంబులు నిగనిగమని ప్రకాశింపఁ జతురవేషంబున బోడిశలతో నేతెంచె. ఆతఁడు విద్యేశ్వరుఁడను నొక్క బ్రాహ్మణపుంగవుండట.

అనం—అతనితో నేమైనఁ బ్రయోజనమున్నయదియా?

బాల—ఉండుటఁ బట్టియే చెప్పవలసివచ్చె. అటులే తెంచి నీప్రియునితో "దేవా! త్వదీయ సుందరవదనారవిందం బిటులు గందింప నేల! ఐంద్రజాలికా ప్రభావుండనగు నేను నీకు గారాబు నెచ్చెలినై యుండ నేల విచారించెదు. నీకాపె సంగమం బబ్బునటులొనరించెద విచారింపకుమ" నియె.

అనం—దైవంబున కీతని నొకనిఁ బ్రాప్తింపఁ జేసెనా?

బాల—అంత నీప్రియుఁ డేటు లొనరింపఁగలవన నాతఁడు

ఉ॥ మాళవకాంతుఁ డిట్టి యనుమానము నొందఁ బ్రీతి నెల్లపౌ
రాళిగనుంగొనన్ పృథుసభాంగణమందును గొంత నాదువా
గ్జాలముచేత మోసమును సల్పి వివాహము సేయువాఁడ భూ
పాలక నీకుఁ దత్సతికి స్వాంతమునందును మోద మొప్పఁగన్॥

అనియె

అవం—దుర్ఘటము. ఇందఱిమోసపుచ్చి కార్యం బెటులొనరింపఁగలఁడు. ఎవరైన నెఱింగిన నపాయంబుగాదా!

శాల—నేను నటులే యంటిని. అంతనాతఁడు రోషకషాయితనేత్రుఁడయి "అవివేకురాల! నేనంతయజ్ఞానినిఁగాను. అటులొనరింపకపోయిన నేను బ్రాహ్మణుఁడనుఁగాన"ని ప్రతిజ్ఞనొనర్చి యీవిషయం బెవ్వరికినిఁ దెలియనీయక నాకన్యారత్నంబునకు మాత్రము దెలుపుము. నేఁడే శుభముహూర్తమున్నయది. తత్ప్రయత్నంబునుఁ జేయ వెడలుచున్నాఁడనని యటనుండి వెడలిపోయెను.

అవం—తరువాత.

శాల—నీప్రియుఁడీవిషయంబు నీకెఱింగింపుమనినన్నంపె. మఱియు నిట్లనియె

*మ॥ అతివా! నెచ్చెలియైంద్రజాలికుని మాయన్ యుష్మదంతఃపుర
స్థితశయ్యాంతరిఁ జేరి మన్మథమహాధీరత్వముం బాపి నీ
కతిమోదంబునుఁ గూర్చువాఁడనిఁక నీయాత్మన్ ముదంబంది స
ద్గతులంగాలముఁ బుచ్చుచుండు మిటుదుఃఖంబొందఁగాలాభమే॥

అవం—చెలీ! ఇప్పుడైంద్రజాలికుఁడెచటనున్నవాఁడు.

శాల—మీవివాహంబునకుఁ బురోహితుఁడుగానున్నాఁడు.

అవం—చెలీ! అంతభాగ్యములభింపవలదా?

శాల—లభింపకేమి. లభింపనున్నది. ఇంకనైన నీయలంకారంబు నిర్వర్తింతువా?

అవం—నీవంటినెచ్చెలియుండ నాయలంకారమొనరించుట కేమి.

శాల—రాజపుత్త్రి! అటులైన నీయలంకారమతిత్వరితముగా ముగింపుము. వివాహోచితలగ్నంబు రాఁబోవుచున్నది.

అవం—(ఆభరణంబులధరించి) చెలీ! ఇప్పుడు నీకు సంతృప్తియైనదా?

బాల—ఒకగడియమాత్రంబున సంతృప్తినొందఁగల సుందరాకారుఁడు రానుండ నేసంతృప్తినొందిననేమి నొందకున్న నేమి?

అవం—నీమాటలకే నామేనంతయు గగ్గురుపాటునొంద నమ్మహానీయుఁడు ప్రత్యక్షముగా నెటులుండునో.

బాల—ఎటులుండునో వేఱ చెప్పవలయునా?

అవం—చెలీ! ఆవినవచ్చునాదం బేమి?

బాల—(ఆలించి) అదియే జరుగఁబోవు నవంతీసుందరీ పరిణయంబునందలి మంగళ తూర్యారావంబు

అవం—అదియేమి.

బాల—ఆతఁడైంద్రజాలికుండుగదా? మీజనకునాజ్ఞ విచిత్రంబులఁ జూప మొదలు పెట్టియుండును.

అవం—సఖీ! మదీయానూన సౌందర్యవిలాసంబున కమ్మహాత్ముఁడు సంతసించునా?

బాల—సంతసించునాయని వేఱయడుగవలయునా? స్త్రీనగునేనే నీ సౌందర్యంబునుఁగాంచి పులకాంకితురాలనగుచుండ నాతఁడు నీపదదాసుఁడుగాకుండునా.

అవం—చాలు. నీవాక్చాతుర్యము. నేభర్తచే దాస్యమొనరించు కొనిడిదాననా?

చాప—(ప్రవేశించి) అమ్మా! రాజపుత్త్రీ! నేఁడొకయైంద్రజాలికుఁడు మీతండ్రిగారియనుమతిఁ దదీయ విద్యాప్రభావంబెల్లఁ జూపుచున్నవాఁడు. కావున మిమ్ము నలంకారసహితంబుగఁగొని తెమ్మని దేవిగారి యాజ్ఞయైనది. రండు. పోదము.

అవం—బాలచంద్రికా! ఇంద్రజాలముఁ జూడనేతెంతువా?

బాల—నేనిప్పుడు నీకు జ్ఞప్తియుంటినా?

అవం—అదియేమి.

బాల—ఏమియును లేదు. ముందుగలుగఁబోవు సంతోషమున నన్ను మఱచితివేమో యనుకొంటిని.

అవం—సఖీ నిన్నట్లు నేను మఱతునా?

బాల—మన్మథజరానలజనిత దుఃఖంబును మఱువనుండ నన్ను మఱచుటకేమి.

అవం—చాలు నీసరసము రమ్ము (చేయిఁబట్టుకొనును.)

చంప—అమ్మా! మీజననిగారిటనున్నారు.

అవం—సఖీ! బాలచంద్రికా! ఈయైంద్రజాలికుని విచిత్రముఁజూడుము.

మ॥ తరుణీరత్నము కర్తృపాదములనొత్తన్, బాల్యమందుండి క
ప్పురతాంబూలమొసంగఁగా నొకతె, సమ్మోదంబుగానొర్తుదా
సురటిన్ వీవఁగ, ముందఱన్ ముకురముం జూపింపఁగా నొండు, సౌ
ఖ్యరసైకస్థితి నోలలాడు హరినక్కాంతా విటుంజూచితే॥

బాల—ఏమీ! వీనివిద్యానైపుణ్యము.

అవం—(భయముతో) అయ్యో! ఎంతమనోహరంబగు నావిగ్రహమును మార్చి దుష్టదానవునిగా నొనర్చెదను.

మ॥ కనులన్ రక్తిమ జేవురింపఁ, దనయాకారంబు మిన్ముట్ట, మే
నునవాభ్రస్థలి నీలకాంతులఁ దెగన్ జూపింప, దంతద్యుతుల్
ఘనజ్యోత్స్నంబు నుగ్రింపు సేయ, కరయుగ్మాసంగృపాణంబులం
గొని నాట్యంబును సల్పునీదితసుత క్రోధంబు వీక్షించితే॥

చెలీ! కాంచినకొలది నాకు భయోత్పాదంబగుచున్నది.

బాల—భయం బానందముగా మారఁగలదు. ఇటురమ్ము (నిష్క్రమింతురు.)

ద్వితీయాంకము సంపూర్ణము.

శ్రీ

రాజవాహన విజయము.

తృతీయాంకము

[ప్రథమ రంగము—రాజభవనప్రాంతము. వీరశేఖరుఁడను విద్యాధరుఁడు వెండిసంకెలఁగొని ప్రవేశించును.]

వీర—కామమెట్టి కార్యంబులఁ జేయింపదు. కామునకులోఁబడని వార లెవరుగలరు.

సీ॥ అలయహల్యామధురాధరం బాసించి
జంభారి కుక్కుటస్వామిగాఁడె
భారతీసతి చెట్టఁ బట్టఁగా నూహించి
బమ్మదేవర వావిఁ బాయలేదె
మేనకాపరిరంభ మూనఁగా నూహించి
గాధేయుఁడు దపంబు గాల్పలేదె
తారావధూకుచ కోరకమాసించి
శశిదేశికున కెగ్గు సలుపలేదె

తే॥గీ॥ ఆసుభద్రాసతి వివాహమాడ నెంచి
హరిహయసుతుండు యతివేషమందలేదె
యట్టివారె కామునకు లోనౌచునిట్టి
చర్యలొనరింప మనమెంత సన్యసింప॥

నేను మన్మథశరానల దహ్యమానమానసుండనై దర్పసారుఁడు దనసోదరియగు నవంతీసుందరిని నాకొసంగి వివాహంబు గావింతునన్నమా

త్రింబున మనసు నిలుపలేక నాపెయొయ్యారంబువీక్షింప నవ్విద్యాధరచక్రవర్తిపయిఁ బగసాధింపనెంచియు నేటికాకిషయంబునుఁ గప్పిపుచ్చి యిటువచ్చితిని. ఔరా! పంచశరా నీయాటలు సాఁగుచున్నవని మేరమీఱుచుంటివా? ముక్కంటి కంటిమంటఁగాలినను సిగ్గులేదు గదా! (సంకెలఁజూచుచు) ఆహా! శరత్కాలచంద్రికా ధవళవర్ణంబు నిరాకరించి యీరజిత శృంఖలంబెంత మనోహరముగానున్నది. ఇయ్యది యద్ధరాధరమునను౦డుటకుఁ గతమేమియైయుండును. (ప్రక్కకుఁజూచి) ఓహో నేనప్పుడే రాజభవనప్రాంతంబునకే వచ్చితిని. ఇందక్కన్యారత్నంబుండు నంతఃపురంబెయ్యదియో? తెలియనిదెట్లు ప్రవేశింపఁగలను. ఎవరినైన నడుగవలయును. అజ్జారే! ఏమిది? ఈ పురమునం దెయ్యెడఁగన్నను జనులకోలాహలంబులు మిన్నుముట్టుచున్నవి కారణమేమైయుండును. ఇప్పుడెంత ప్రొద్దు పోయియుండును. (ఆకసమువంకఁజూచి) ఒకయామము మాత్రము గడచినట్లున్నది. ఆహా! సకలజనానందకరమై పిండియారఁబోసినటుల వెన్నెలయెంత మనోహరముగానున్నది. (చెవియొగ్గివిని) ఇదిగో! ఇటువెవ్వరో పోవుచున్నటులున్నారు. పిలిచి మదీయసంశయ నివారణముఁగావించుకొనియెదను (బిగ్గరగా). ఆపోవువారెవ్వరు.

స్వర్ణ—(ప్రవేశించి). ఎవరైననేమికాని రాత్రి తొమ్మిదిగంటలైన నీభవన ప్రాంతమును వీడకుండుటకుఁగారణము ముందుగఁ జెప్పుము. చూడఁగఁ జోరునివలెఁ గన్పట్టుచున్నావే?

వీర—కోమలీ! నేపరదేశీయుఁడను. ఇప్పుడే యీపురములోనఁ బ్రవేశించితిని. చేరవలసిన గమ్యస్థానము చిక్కలేదు. ఇచట సమీపమందెచటనైన సత్రమున్నదా?

స్వర్ణ—ఆ. ఈబాటననుసరించిపొమ్ము. నీవేఁగువఱకు నేనిట నుండుటకు వీలులేదు. తొందఱగాఁబోవలయును.

వీర—అంతతొందఱగాఁ బోవలసినకార్యమేమి?

స్వర్ణ—ఎఱుఁగరా! అంతఃపుర కాంతామణుల కార్యములు. ఎప్పుడు నిట్టివే. మెడలమీఁదఁ గత్తులవలెనుండును. అవంతీసుందరి కీకుందకుట్మల*మాలికలం గొనిపోవలయును. ఇప్పటికే యాలస్యమైనది. ఇంక నాలస్యమైనఁ దత్సఖియగు బాలచంద్రిక యెంతయో కోపపడును.

వీర—(తనలో) అవంతీసుందరీమణికా? పూదండలా? దంపతులకుఁగాని యుపయోగింపని పూదండలు గన్యకకీయర్ధరాత్రంబున నేలఁగావలయును (ప్రకాశముగ) సుదతీ! కన్యకకీ యర్ధరాత్రంబునఁ బూదండ లేల.

స్వర్ణ—కన్యకగనుక నే. అదియంతయు నొకచిత్రము. అదియెఱింగింపవీలు లేదు (పోఁబోవును.)

వీర—కారణమేమైయుండును. అంత చెప్పరాని విషయమా! (కొంగుఁ బట్టుకొనును.)

స్వర్ణ—(రోషముతో) ఎవరవయ్యా నీవు? ఆఁడుదానిఁబట్టెద వేమి. రాజుగారితోఁ జెప్పి నిన్నేమిచేయింతునో చూతుము.

వీర—(రెండు నాణెములఁదీసి) సుందరీ! కోపపడకుము. నీకీరూప్యంబుల బహుమతిగానిచ్చుచున్నాను. కైకొనుము.

స్వర్ణ—(సంకోచించుచున్నటులు నటించుచుఁదనలో) వీడెవ్వరిమోముఁజూచితినో నాకన్నియు శుభములేకలుగుచున్నవి. విటగాండ్రచే సరసజ్ఞురాలఁగానని నిరసింపఁబడిననాకుఁ గూటికే కటకటపడుచుండ నీదినంబున ననాయాసముగాలభించు నీధనమేల విడువవలయును. రతి నెలఁదేలక పోవలయును. (రూప్యములఁగైకొని) (ప్రకాశముగా) బావగారూ! మాగృహమునకు దయచేయుదురా?

వీర—అట్లుదయచేయుటకు వీలులేదు. నాప్రశ్నంబులకు సరిగ సమాధానం బొసంగుమంతియుఛాలును.

స్వర్ణ—(తనలో) వృద్ధమర్కటమువలెనున్న నామోముఁగాంచి యందఱిటులనే నిరసించెదరు. అదినాపూర్వజన్మసుకృతము. ఇఁకసమాధానముఁజెప్పి పోయెదను. (ప్రకాశముగా) చిత్తము నాకుఁదెలిసినవఱకు వచించెదను సెలవిండు.

వీర—సుందరీ! ఈయర్థనిశీథమున మల్లెపూవు లవంతసుందరికేలఁ గావలయును.

స్వర్ణ—(తనలో) అయ్యో! వీఁడీవిషయంబునే ప్రశ్నించుచున్నవాఁడు. సుమమంజరుల కనుపునపుడు బాలచంద్రిక నేఁటివిషయంబెల్ల నెఱింగించి యెవరికినిఁ దెలుపవలదని శాసించె. ఈతఁడీవిషయమునే నొక్కి యడుగుచున్నవాఁడు. ఈపాపిష్టి ధనం బెంతఁజేయును. (ఆలోచించి) నేనెఱింగింపకున్న మాత్రమున నీవిషయము గప్పిపడునా? అంతఃపురపుఁగోడలకుఁ జెవులుండునను వాక్యమురిక్తమౌనా? ఈద్రవ్యమేలఁబోఁ గొట్టుకొనవలయును. జరిగినదంతయు వచించినంతమాత్రమున నేనేచెప్పితినని నెడివారెవరు? (ప్రకాశముగ) అయ్యా! మీరీదినంబుననే వచ్చినటులున్నారు. అందుచేతనే ఈవిషయంబంతగాఁదెలియదు. నేఁటియుదయంబున నెవరికిఁదెలియకుండ నవంతసుందరీ పరిణయముజరుపఁబడినది.

వీర—(ఆతురతతో) ఎట్లెట్లు! ఎవరికిఁదెలియకుండనా? గాంధర్వవివాహంబై యుండునా? ఆమెను వరించినవాఁడెవఁడు?

స్వర్ణ—గాంధర్వవివాహము కాదు. అగ్నిసాక్షికంబుగ నందఱియెదుట కే వివాహము సలుపఁబడినదికాని యదినిజము నెవ్వరును గ్రహింపరైరి.

వీర—అదియెట్లు.

స్వర్ణ — నేఁటిదినంబున విద్యేశ్వరుండను నైంద్రజాలికుఁడొకఁడేతెంచి తన ప్రభావంబునుఁ జూపింతునని రాజుగారి యనుమతి నుద్యోగీయులాది పౌరజనులందఱు పరివేష్టించియుండ నంతఃపుర కాంతామణులందఱుఁ జూచుచుండ రాజుగారి సభాప్రాంగణమున తన నెచ్చెలులంగూడి వింతలంజూపుచుఁ బ్రథమంబున కృష్ణలీలలఁ గొన్నింటిఁజూపె.

వీర — తరువాత.

స్వర్ణ — తరువాత హిరణ్యాకశిపు వధంజూపింప నాక్రూరదైత్యునిఁ బ్రవేశఁబెట్టెను.

వీర — పిమ్మట.

స్వర్ణ — నాలుగైదు దినంబులనుండి మన్మథశరానలంబున ప్రగ్గుచు నిద్రాహారంబుల విసర్జించియున్న యవంతీసుందరి జననియాజ్ఞ బాలచంద్రికతోఁగూడ నట కేతెంచె.

వీర — ఆపె విరహాబ్ధిఁజిక్కుట కెవరినిమోహించెను.

స్వర్ణ — ఈ గ్రామంబున సకలకళారహస్యవేదియను భూసురుఁడొక్కఁడు బంధుపాలుఁడనుమణిజునింట నొకమాసమునుండి వసించుచుండెనాతని.

వీర — (తనలో) ఔరా! నాకొసంగనున్న కాంతామణి నొకతుచ్ఛుండు పరిగ్రహించెననివిని యూరకొనుటెట్లు. వానికిందగిన పరాభవముఁ జేసితీరవలయును. (ప్రకాశముగ) బిత్తరీ! తరువాత నేమిజరిగినది?

స్వర్ణ — ఆ యైంద్రజాలికుఁడును భూసురుఁడును నొకతెగవారట. బంధుపాలునల్లుండును బాలచంద్రికాధవుఁడునగు పుష్పోద్భవుని స్నేహమవలంబించి బాలచంద్రికను వలవైచికొని యవంతీసుందరి

యభ్భూసురువరించునటులొనరించి వివాహమాడఁ దమకృ
త్యంబులకుఁ దోడ్పడమున్నయొనరించిరి. అంత బాలచంద్రిక
యటనుండివెడలి తన ప్రియునింగూడి యేదియోయాలోచించి
మరల నవంతసుందరినిడాసి యావిషయమంతయు రహస్య
ముగా నెఱింగించె.

వీర — అనంతర మేమైనది?

స్వర్ణ — ఆయైంద్రజాలికుఁడు మాయాసురు, నృసింహమూర్తి వధించు
నప్పటియాకృతింజూపింప నందఱు భీతిల్లిరి. ఆఘోరాకృ
తింజూడలేనని యవంతసుందరి బాలచంద్రికతోడఁగూడ నేఁగె.
పిమ్మట నాతఁడా యాకృతుల నుపసంహరించి రాజుగారితో
"నయ్యా! ఈ వింతలఁజూచి విచారమగ్నులమైన మీకు
సంతోషంబుగలుగ మీకుమార్తెవంటి యొకకన్యారత్నంబును
సృష్టించి యక్కన్యకకుఁదగిన వరునిఁదెచ్చి వివాహంబొనరి
తుననియె. దానికందఱు సంతుష్టులైరి.

వీర — అటులొనరించెనా?

స్వర్ణ — చెప్పెద నాలింపుఁడు. అంత మంగళతూర్యారావంబులు
మ్రోగించె. బాలచంద్రిక దీనికిమున్నె జరుగఁబోవు విషయ
మెల్ల నవంతసుందరికిఁదెలిపియుంచె కావున నాయైంద్రజాలి
కుఁడు దనశిష్యులనంపి రహస్యమార్గంబున నవంతసుందరి
భూసురునిరప్పించి యందఱుజూడ నగ్నిసాక్షికంబుగ వివాహ
బొనరించి యందఱును వెడలవలయునని యాజ్ఞాపింప మున్నె
తగునటుల సిద్ధపఱచుకొన్న భూసురుఁడు జెలికత్తియ వేషంబు
ధరించి పత్నితోఁగూడ నంతఃపురంబునుఁజొచ్చె.

వీర — (తనలో) ఔరా! యేమి? ఈతని కండకావరము. నాకిప్పు
నిశ్చయముగఁ గోపముజనించినది. నేనే యాభూసురునకు

దగిన పరిభవముఁ గావింపకున్న వీరశేఖరుఁడనా? (ప్రకాశముగ) కాంతామణీ! ఈవిచిత్రముం గాంచి రాజదంపతులే మనుకొనిరి.

స్వర్ణ — అది విచిత్రముగా భావించి యందఱు సంతసించిరి. రాజుగా రా యైంద్రజాలికుని సకలవాహన భూషణాంబరముల సత్కరించి సాఁగనంపె.

వీర — నీవు మాత్రమిది నిజమని యెటులెఱింగితివి.

స్వర్ణ — బాలచంద్రిక నేఁటి సాయంసమయమున శయ్యాగృహంబు నలంకరించుచు నన్ను పూదండలకంప సమకట్ట నేనీవిషయం బెఱింగించిన కాని పూవులఁ దేనని విసిగింప నొరుల కెఱింగింపకుండ నాచే ప్రమాణముం గొని యీవిషయంబెల్ల నెఱింగించె.

వీర — ఉదయమునుండి యాభూసురుఁడంతఃపురంబుననుండ నెవ్వరును గుర్తుపట్టలేదా?

స్వర్ణ — వానినెచటఁ దాచిరో నాకు సహితముఁ దెలియదు.

వీర — సరియే బాగుగనేయున్నది. అక్కాంతామణి శయ్యాగృహం బెటనున్నది.

స్వర్ణ — ఆ కనవచ్చు భవనంబున నీవలిగది.

వీర — సరియే నీవేఁగుము.

స్వర్ణ — ఈయాలస్యంబునకు బాలచంద్రిక యెంతకోపించునో (నిష్క్రమించును)

వీర — ఔరా! ఎట్టివిచిత్రము జరిగినది. అక్కాంతామణీ సౌందర్యంబును గాంచనే తెంచిన నాకిట్టియవమానంబుగలిగె. దైవమా!

నీచేష్టలెంతయు విచిత్రములుగదా? సరియే నేనింక నిందుండ ఫలమేమి. నేనిప్పుడే కళింగాచలంబునకేఁగి తపోనిష్ఠనున్న యిక్కాంతామణీ సోదరుఁడగు దర్పసారునకీ వృత్తాంతమెల్ల నెఱింగించెద. ఛీ! ఈవృత్తాంత మే మొగంబున నెఱింగింపఁ గలను. ఈ భూసురునకుఁ దగినటుల్లొనరించి పోవుటయే యుత్తమము. గాంధర్వవిద్యావిశారదుండనగు నాకే కార్యము సాధ్యముగాదు. పరులకుఁ గనఁబడకుండ నవంతీసుందరీ శయ్యాగృహంబునఁజొచ్చి నిరువురివధించెద. ఛీ! మానసమా! యిట్టి తుచ్ఛకార్యంబునుఁ గావించినఁ బాపమురాదా? నాచే నీక్రూరకృత్యముఁ గావింపకుండ నీఫలమాతనికిం గావలయును. (ఆలోచించి) నేనిప్పుడేఁగి నీశృంఖలంబుల నాతనికరంబులబాధించెద. అంతనల్లరి కాకమానదు. ఇక్కృతంబున నీరహస్యంబెఱింగి యంతఃపుర ద్రోహియగు నితనిఁబట్టి మార్పకమానరు. కావున నియ్యదియే యుత్తమమార్గము. తాను వరించినవాని గలించుటచే యీపెనన్నే పరిగ్రహింపఁగలదు. నేఁదలచిన కార్యమొనర్చితీరెద. పైని దైవమున్నాఁడు.

(నిష్క్రమణము.)

ఇది విష్కంభము.

ద్వితీయ రంగము—అంతఃపురమునందలి శయ్యాగృహము.

[రజతశృంఖలబద్ధుండగు రాజవాహనుఁడు, విచారముతో నవంతసుందరియుఁ బ్రవేశింతురు.]

అవం—హా! నాథా! (విషాదముతో.)

మ॥ కలలో వృద్ధమరాళమొండు పదయుగ్మంబెల్ల నాళాంకురం
బులఁగట్టంబడి కానవచ్చుట భయంబుం జెంది యల్లంతఁగ
న్నులవిప్పన్ భవదీయహస్తయుగమందున్ గానఁగా నాయెశృం
ఖలబంధంబిది దుష్టులెవ్వరిటులన్ గావించిరో నిర్దయన్ ॥

(నలువైపులఁబరికించి) అయ్యో! ఇదియేమి విచిత్రము. శయ్యాగృహప్రవేశంబున నాచేఁబంధింపఁబడిన కవాటంబు దెఱువఁబడఁగారణంబేమి? లోఁగడవేయఁబడెఁగదా? కవాటంబు దెఱువసాధ్యమెటులయ్యె! ఇట్టిక్రూరకృత్యంబుఁ గావింపవారికిఁగలలాభమేమి? మన్నాథుబంధించి నన్ను దుఃఖపెట్టినవారికి నిండుసంతసంబా? ఇందెచటనునడచిన పాదచిహ్నంబులేనియుఁగానఁబడకయున్నవి. అక్కటా! నాకిందేమియుఁగారణము స్ఫురింపకున్నది. మాయయో స్వప్నావస్థనుంటినో కూడ నిర్ణయింపలేకున్నాను. హా! దైవమా! ఎట్టియిక్కట్టులఁగలిపించుచున్నావు. ఇది స్వప్నావస్థయని నమ్మఁజాల. హా! గుండెలెంత వడిగా నదరుచున్నవి. నాథా! నాథా! (క్రిందపడును.)

రాజ— ప్రేయసీ! ఏలదుఃఖించెదవు.

శా॥ ఏకాలంబున కేడియూను మదినూహింపన్వశంబౌనె, యా
యాకర్మంబులఁదప్పనేర్తుమె, యసాధ్యంబున్నదే చేయఁగా
నేకార్యంబునఁగాని శ్రీశునకు నీవేడ్కంగనిట్టుల్ ఫలం
బే! కష్టంబులు గాపురంబగుచు నెందేనిత్యమున్ నిల్చునే॥

నాకునట్టి స్వప్నంబే సంభవించినది. స్వప్నంబున మృణాళతంతుబద్ధంబగు మరాళంబు గాన్పించుటయు నాకస్మికంబుగ నిర్జనప్రదేశంబున నిటుల మదీయకరంబులు బంధింపఁబడుటయుఁజూడఁ బూర్వఫల బుచేఁ గలిగిన యనర్థయని దోఁచెడిని లేక గాంధర్వమాయయని గావలయును. హా! ప్రేయసీ!

మ॥ స్మరబాణానలమందుడస్సియు, స్థిరాత్మన్నన్నుమోహించి "స
త్వరమే శ్రీసుతునుండిబోవమిని మత్ప్రాణంబులీమేనిలో
ధరియింపన్ నిజమంచు" నీసఖినిఁబంపన్ నీయభీష్టంబౌన
స్థిరసైకస్థితిఁగూర్చి వెండియువగంజేకూర్చితిన్ దీనిచే॥

నేనిందులకెంతయు విచారించుచున్నాఁడ.

అవం— అందుచేతనే నీకంటె నేనెనుమడుంగులు దుఃఖింపవలసినదాననైతిని. ఏలయన నేనికార్యంబునకునిన్నుఁ బురికొల్పకున్న

నీకిట్టియవస్థసిద్ధింపదుకదా! అక్కటా! అంతఃపురంబున నెరులకంటఁబడకుండ రక్షింపఁగలదని పెక్కుకష్టంబులనంది యైంద్రజాలిక విద్యాప్రభావంబున నన్నిందుఁజేర్చిన విద్యేశ్వరుఁడును నీమహితులును బాలచంద్రికయు నన్నెంతనిందింతురో కదా? ఈసంకెలనూడఁబెఱుకుటకైన నసమర్థురాల నిన్నెటులరక్షింపఁగలను. నాకింగు సాయమొనర్చువారెవరు?

సీ॥ విరులార! మన్నాథుకరముల నెవ్వారు
శృంఖలంబిడిరొ వీక్షింపలేరె?
కీరశారికలార! కృపఁజూచెమాకునా
చెనటినామంబు వచింపలేరె?
హంసరాజములార! యతిక్రూరుఁడౌవాని
వేగమాకెందుఁ జూపింపలేరె?
చిత్రపటములార! శీఘ్రమేయవ్వాని
బాధించిమాకుఁ గన్పరపలేరె?
తే॥గీ॥ సరసమతులార! యనుజీవిజన్ములార!
శృంఖలవిసారకునిఁ జాడఁజెప్పలేరె
అకట! యీదీనురాలిమొరాలకింపఁ
దయవహింపరె? వైరంబుఁదలఁచినారె?

రజితశృంఖలమా! నీవుమాపాలికే నిర్మింపఁబడితివా? నీకు మేమేమియపకృతిఁగావించితిమి నిన్నుఁజేకొనివచ్చినవారెవరు. ఇట్టి నిశీథసమయంబున నీవు రాఁగతమేమి?

రాజ.—మనోహారిణీ! దుఃఖింపకుము విధివిధానంబిట్టులుండ వగచి మనమేమి యొనరింపఁగలము. నేనిందులకు వగవను కాని కుహనాభూసురుఁడనై యైంద్రజాలిక మాయనీయంతఃపురంబునఁజొచ్చి యొఱులెఱుంగకుండఁ ద్వదీయాలింగన సౌఖ్యమాద్యంతముఁదేలుచు సుఖముందునని యెంచి నేఁటికిటులందఱినోటంబడి నిందనొందవలసి వచ్చినందుల కెంతయుఁజింతిల్లెద.

స్మరబాణానలపీడితురాలనిన్నుఁబోవ నెంచియిందుఁబ్రవేశించి పొందిన యీబాములంజూడ నుపకారంబునకుఁబోయిన నపకారంబెదురగుననుట నిజంబాయెను మఱియు

ఉ॥ మానవులెల్లఁ బద్మభవుమాయ నెఱుంగఁగలేక కార్యమే
దైన నొనర్తుమంచునుఁ బ్రయత్నములం బచరింతు రేటికో
తా నొకటిందలంచు నెడఁ దైవ మొకండు దలంచు నన్న వి
జ్ఞానివచోనిగుంభనము గల్లయె డంబమె మాననీయమో ?

నావలన నీవుఁగూడ జననీజనకులచే దండన నొందవలసినదానవైతివి. ఏలయనఁ! బసిడిమాదిఁ బెంచి పెద్దవానిఁ జేసి స్వయంవరసభాంతరంబున నొకనికి వివాహంబుఁ జేసి ముద్దుమురిపెంబులు తీర్చుకొన నెంచిన నీ తలిదండ్రులీ దుర్మార్గురాలెంత చెందదగో దిగంతవిశ్రాంత యశోధను లగు చతుస్సముద్రముద్రిత భూవలయపాలకులును కంతు వసంత జయంత నిశాకాంత జత్సౌందర్యవంతులునగు ధరారమణులుండ నిరసించి యీతనిఁగూడెనని నిందించి దండింతురు. ప్రేయసీ! నిశ్చయముగ నేను నీకుఁ బ్రాణాపహారుఁడనుఁగాని ప్రాణేశ్వరుఁడనుఁగాను. ఏలయన భార్యను భరించెడివాఁడె భర్తగాని నిష్కారణ నిందాన్వితం జేసి దండన నొందించెడివాఁడా భర్త.

అవం—నాథా! మీయాపదకే విచారించుచున్న నన్ను మీరిట్టివాక్యంబులచే మఱింత బాధించుచున్నారు. మగని కష్టసుఖంబుల నర్ధభాగ మనుభవించునది యర్ధాంగిగాని తన సౌఖ్యములనే తలంచునదియా యర్ధాంగి. ఇది పతివ్రతాలక్షణమా? వైరిరాజకుమారుఁడవని యెఱింగి నిన్నింకనేమైన దండింతురేమోయని భయంబగుచున్నది. ఆనాఁడా పుష్పారామంబున మదీయ సౌఖ్యమపేక్షించి బ్రతిమాలిన నిన్ను విడనాడి స్వీయముగ నేఁడు నేనపేక్షించుట యుట్టి యిక్కట్టులఁగూర్చుటకే కాబోలును.

రాజ — దేవీ! ఊరడిల్లుము భూసురవేషధారినైయున్న నన్నన్యథా భావించుట దుస్తరము. కావున వైరిరాజకుమారుండనని యెంతయెన్నివిధంబుల బాధించినను నీవు మాత్రము నన్నెఱుంగింపకుము. తదుపరి కానున్నది కాకమానదు.

అవం — హా! దైవమా! నీకంటికి మేమే కానుపించితిమా? ప్రాణేశ్వరా! మనమొండొరులమిటు దుఃఖనిమగ్నులమై కర్తవ్యాంశంబు విచారింపకున్న లాభమేమి. నాచెలికత్తియలంబిలచెద వారివలన నేమైన నిజముఁగనవగునేమో.

రాజ — వారివలనమాత్ర మేమగును. అయినఁబిలచిచూడుము.

అవం సీ॥ మగనిభాములఁగాంచి వగనొందునన్నోవ
చంపకీ! నీవు రాఁజాలవేమి?
చెలికోర్కెఁ జేసి భాములనంది పతిఁగూర్చి
బాలచంద్రిక! రావదేలనిపుడు?
అనుగునెచ్చెలివాచు నపహాసహంబు మెలఁగి
కేతకీ! యెచ్చోటఁ గెరలినావు?
నాయార్తివినరాగొ యీయెట నేలేవొ?
స్వర్ణలతా! జాగుసల్పనేల?
తే॥గీ॥ అఖిలభృత్యాళులార! మీరైనఁగాని
వరుని కరబంధనంబూడఁ బెరుకలేరె?
పక్షిసంతతులార! మత్ప్రాణనాథు
చెలులతోమాదుగతిని వచింపలేరె?

ఇవి యెచ్చటిమాటలు సుఖముగనున్నయెడ నందఱు హితులుగాని విపన్నులైనప్పుడు హితులగుదురా? హా! నాథా? (ఏడ్చును.)

[తెరలో]

నాథా! ముద్దుకూతురేలకో విలపించుచున్నది. దాసీజనంబులెవ్వరు లేనటులున్నారు. చూచివత్తమురండు.

రాజ—ప్రాణనాయికా! మీ యమ్మ మీ నాయనగారితోఁగూడ నిటే వచ్చుచున్నది. కష్టాతప శుష్కములౌ మన్మనోభీష్ట సస్యముల నుద్ధరింప వారియాగమము వర్షాగమమగునో లేక క్రోధతీవ్రాత పాగమమగునో మనయదృష్టమెటులున్నదియో కదా!

అవం.

—♦ మానినీవృత్తము. ♦—

మానిజనావన మానిని ద్రోవది
మానముఁగాచిన మాన్యుఁడవే
యైన కృపామతి నాకరినాథుని
యాపదఁ బాపుట యంతనిజం
బేనసురాత్మజు నీవపుడేలితి
వేనియు నాహృదయేశుదయా
ధీనసమంజసదృష్టిని వేగమె
దేల్పు విపజ్జలధి స్థగితున్ ॥

(అంతమహాదేవీ మానసారులు గొందఱు సేవకులు ప్రవేశింతురు.)

మహా—నాథా! ఏమిది. ఈ సుందరాకారుఁడెవ్వఁడు. ఇందు రాఁగత మేమి. కుమారిబాధఁబెట్టు దురాత్ముఁడితఁడై యుండఁడా?

మాన—ప్రేయసీ! నేటియుదయంబున నయ్యైంద్రజాలికుఁడు కుమార్తెకు వివాహమొనరించినదీతని నేకదా?

మహా—ఇది నిశ్చయమేనా? ఇంద్రజాలమనుకొంటినే.

మాన—అవును నేను నటులనే భావించితిని. అమ్మాయి! ఈతఁడెవండు? నివిలాపమునకుఁగారణమేమి?

అవం—నాయనా! ఎఱుఁగనటు లేలనటించెదరు.

మ॥ భవదీయాజ్ఞ సభాంగణంబున బృహద్భానుండె సాక్ష్యంబుగా
నవనీనాయకులాది భూజనములత్యాసక్తి వీక్షించు వే
ళ వివాహంబుమహేంద్రజాలికుఁడుసల్పన్ లేదొ మామా, కప్పుడే
స్తవముం జేయరొ మీరలెల్లఁటిక నీసందేహమెట్లయ్యెనో?

అమ్మా! మీకును సందేహమేయయ్యెనా?

మాన—అమ్మాయి? ఇదియంతయుఁ జిత్రముగానున్నది. (జనాంతికముగ) ప్రేయసీ! యుక్తవయసుననున్న కుమార్తెకు వరాన్వేషణశ్రమం బక్కఱలేకయే మనకీ సుందరాకారుఁడల్లుఁడయ్యె. ఈతని వేషధారణము భూసురునివోలెనున్నను ముఖచిహ్నంబులు క్షత్రియునివోలెనున్నవి. అట్టిటుండగినవాఁడు సర్వజన సమక్షంబుననే వివాహము జరిగినదిగావున నీవికసంగియమువీకి వీరిమేలుఁగోరుము (ప్రకాశముగా) అమ్మా! నీకిప్పుడు సంభవించిన యాపదయేమి?

అవం—నాయనా! కనఁబడుటలేదా? మేమిరువురము నేటినిశీథముఁ

తే॥గీ॥ శయ్యఁబవళించి నిద్రదుస్స్వప్నమొండు
గాంచిమేల్కాని చూడనాకాంతుహస్త
జలజములుగట్టఁబడియె శృంఖలమునందు
దైవయోగమొ మనుజకృత్యంబొ యేమొ॥

మహా—(ముక్కుపై వ్రేలిడుకొని) ఓరా! ఈయంతఃపురంబున కెవరు రాగలిగిరి ఇందెవ్వరుమానవులుఁ దిరిగినటులు లేదే? నాథా. ఇంక నేలమిన్నకుందురు తక్షణమే సంకెలనూడఁబెఱికింపుఁడు.

రాజ—(తనలో) అమ్మయ్యా! ఇప్పటికి నాహృదయమున కొకింత శాంతికలిగినది.

మాన—నాయనా! జామాతా! నీవింకవగవంబోకుము. ఇపుడే త్వదీయ కరబాధనంబుల నూడఁబెఱికించెద. ఓరీ! సేవకా

నీవేగి కారాగృహాధికారితో నీవిషయం బెఱింగించి శృంఖల విమోచన సాధనంబులతోడ నాతనిఁగొనిరమ్ము.

సేవ—చిత్తము. (నిష్క్రమించును.)

చండవర్మ—(ప్రవేశించి.)

—♦ పంచచామరము. ♦—

మదంబునం బ్రచండమైన మామశౌర్యమింతనీ
మదిందలంచకే చలానదస్మభృతీశుకన్యకన్
దదీయశయ్యయందుఁగూడి దాగినావె క్రూరని
న్నిదే వధించువాఁడఁ గావ నెవ్వరడ్డువచ్చినన్ ॥

శా॥ ఔరా! మొండునఁడాగినో వెలుపుఁ డాయంతఃపురద్రోహి, నా
క్రూరాత్మున్, జము, నావివేకరహితున్, ఘోరాసిఖండించి భూ
భారంబున్ సడలింతు, నీఖలుని నెవ్వారడ్డమైనన్ రణ
ప్రారంభమ్మునఁగూల్తు భాస్కరుఁడుఁ ద్రోవ ల్దప్పివర్తించినన్॥

రాజ—(తనలో) హా! దైవమా! ఈదుర్మార్గుఁడేమిగావించునో కదా?

మహా—(జనాంతికముగ) నాథా! ఈప్రచండక్రోధుఁడీ సౌమ్యుఁ బ్రతుకనిచ్చునా!

మాన—(జనాంతికముగ) ఏనాఁడు మదీయరాజ్యం బీతని హస్తగతమాయెనో యానాఁడే మనమేలులన్నియు నశించినవి.

చండ—(క్రోధముతో) మామా! అద్దురాత్ముఁడేడీ? (రాజవాహనుఁ జూచి) ఓరీ! భూసురాధమా?

మ॥ నిగమంబుల్ పఠియించినానని, కళాసీకాదివిజ్ఞాని నం
చుఁ, గడున్ మాంత్రికవేత్తనాదు, సుకలంజూపింతునంచున్ బ్రజ
దగవంచించి ధరాసురాకృతిఁ దురాత్మా! రాచకన్యామణిన్,
సొగసుంబ్రాయఁపుబింతి, రూపరినటంచు న్నాచికొన్నాఁడవో॥

ఓసీ! రాకాసీ! నీనిమోసకృత్యంబుల భ్రమించి పౌరులొక్కుమ్మడిఁ బొగడినంతమాత్రంబున సింహంబులవలెనున్న మమ్మవమానించి యీతనికిఁ గాపుకత్తెవైతివి. కకుబంతవిశ్రాంత యశోధవళమామాళవ రాజవంశంబున కెంతయు నపకీర్తిఁ దెచ్చిన నిందితురాలవు నిన్నేమిచేసినఁ బాపంబున్నయది. నీవివేకమంతయు నేమంటఁగలిపితివి. ఎన్నిదినంబులనుండియో సకలసామంతధరాధిప మకుటనీరాజితపాదకమలుండును గంగాతరంగస్వచ్ఛద్యశోధనుండును నీమేనత్తకుమారుండును సింహపరాక్రముండును జాడవర్మాభిధానుండునగు నేను నిన్నెన్నివిధంబులఁ బ్రార్థించినఁ బెడచెవిఁ బెట్టి యీరాజన్నిగట్టును వరించితివిగా. ఔరా! ఏమి నీపొగరు. ఇదిగో మదీయకృపాణ సంఘట్టనంబున నీవలపుగానితోడఁగూడ నిన్ను యమాలయంబునకుం బుత్తెంచెదఁ జూడుము.

మాన—అల్లుఁడా! నీవింతయాగ్రహమొందవలసిన యవసరము లేదు. ఏలయన నేఁటియుదయంబున సర్వవసుధారాధిపులాది భూజనములెల్ల వీక్షింప నగ్నిసాక్షికంబుగఁ జఱిగిన వివాహంబు నీవిటులేల నిందించెదు. ఈతని మత్కుమారికారత్నము నాచికొనిన దేమికలదు.

చండ—ఏమేమి! అగ్నిసాక్ష్యంబుగా వివాహమొనరించితివిగా. ఈ మాయోపాయంబు లెటనేర్చుకొంటివి. కుమార్తె నీనీచునకుఁ దార్చి మానాభిమానంబులు లేక సంతసించుచు నేమొగంబున నగ్నిసాక్ష్యంబుగా వివాహంబొనరించితివని యుపన్యసించుచుంటివి. ఓను నీకు మానాభిమానము లెక్కడివి.

మ॥ అసిలోనోడియు రాజహంసునకు నీవానాఁడుగో లక్ష్మణా!
యనుచుంగానలకైనఁ నేగక, స్వమర్యాదన్ విసర్జించుచున్

నను బ్రోవన్ వలె రాజ! యంచు శిరముం బ్రత్యర్థి పాదద్వయం
బున వేవ్రాల్చిన యట్టినీచుడవు కావో నేఁడు మాన్యుండవో ॥

మహా—ఓరీ! మూర్ఖా మానవంతుఁడుగావున నే పరిపంథిఁ గాననభూమి కంపఁగలిగెను లేకున్న నీవలెఁ బొట్టకూటికై పెంపుడుఁగుక్కవలె మేనమామ పంచఁబడియుండవలసినదే ?

రాజ—(తనలో) ఏమీ వీరి కండకావరము మజ్జనకుఁ దెప్పుచున్నారే?

చండ—ఏమేమి పొట్టకొఱకై పడియున్న పెంపుడుకుక్కనా? ఎవరైనదియుఁ దెలియుచునే యున్నది. రాజ్యభ్రష్టులైనను సిగ్గు లేదుగా? మీ జోలి నాకేల? మదీయానుజమారణహేతుభూతుండయిన బాలచంద్రికాధవుని సచివుండగు నీతని వధియించి వెడలెద.

అవం—ఓరీ! దుర్మార్గా! పరసతీమానభంగాభిలాషీ!

మ॥ పరసాధ్వీమణి మానభంగమును సల్పంజూచి యా రావణా
సుర దుశ్శాసన కీచకాది ధరణీశుల్ వోలె నే నీదు సో
దరుడుం బ్రాణము వాసె నీవటులె చింతావార్ధి నిన్ మున్గి దు
ర్మరణప్రాప్తిఁ జెందఁగాఁగలవు దుర్మార్గంబు క్షంతవ్యమే

దుర్ణయంబున కేల యొడిఁగట్టెదవు. ఆ బాలచంద్రికాధవుఁ డొనరించిన దేమున్నది. వాని పాపంబున వాఁడే నశియించె.

చండ—ఓసీ! గయ్యాళీ!

ఆ॥ వె॥—వర్ణభేధమైన శాపనిం గూడి
సిగ్గులగులేకఁ దెక్కులాన
నాకు నీతిఁ గరుపనే కరణి మొగంబు
నెత్తి గాఁదలంచితీవు కులట

నన్నే యెదిరింతువుగా (నఱుకంబోవును.)

మాన—(అడ్డమువెళ్లి) అల్లుఁడా యేమినీయాగడము. ఏమియు నెఱుఁగని పసికూనపైననా నీకోపము.

చండ—(రోషముతో) ఏమియు నెఱుఁగదుగా? మదీయ భుజశౌర్యంబునుఁజూచిన నన్నియుం దెలియును.

రాజ—ఓయీ! ప్రలాపీ! ఉన్నతోద్యోగివై నంతమాత్రంబున రాజకుటుంబమును వధింపనగునా?

చండ—ఛీ! నోరుమూయుము.

చ॥ తగుదునటంచు రాచవనితామణి మోసము సేసి తత్కరం
బుఁగొని సుఖించి యీ పెకులముం జెడఁ జేసితివో దురాత్మ! నీ
పొగరునుఁ గర్వముం దుదముట్టెడు కాలము దాపరించె నే
వగఁగొనఁ బోను భూసురుఁడ వధ్యుఁడటంచును సూతయేనియున్

ఇదిగో మదీయ కఠోరాసి ప్రహారంబులఁ జవిఁజూడుము.

రాజ—ఓరీ! దుర్మతీ! వివేకవిహీనా!

శా॥ సర్వక్ష్మాతలనాథ సన్మకుట వజ్రస్తోమ నీరాజితో
ద్గర్వాంఘ్రిద్వయుఁడైన పార్థివమహాగర్భోద్భవుండన్ ధరా
గీర్వాణుండనుఁగాను శృంఖలితము క్లిన్ ఖడ్గమొండిచ్చెదో
గ్గర్వంబుం జవిఁజూపు మీ సమరశౌర్యప్రక్రియల్ గల్గుచో॥

మహా—(జనాంతికముగా) నాథా! ఈతఁడు క్షత్రియుఁడేనా?

చండ—(రాజవాహనునిఁ జేఁబట్టుకొని లాఁగి) ఏమీ! నీతోరణ మొనర్పవలయునుఁగా మదీయకృపాణపాతంబున నిల్చినఁగదా (నఱుకఁబోవును.)

మాన—(అడ్డువెళ్లి) చండవర్మా! వేయేల యొక్కటి వినుము.

మ॥ కపటోపాయమొ; నిక్కమో; ద్విజుఁడో ఇంకన్ క్షత్రియుండో
ధరాధిపులెల్లం గన నగ్నిసాక్ష్యముగ ధాత్రీపేరణంబుంట ని

ట్టిపతింజేకొననామెం బుత్రియిటుదండింపన్ ఫలంబున్న దే
యపనోదింపంగశక్యమే విధికృతవ్యాపారమెవ్వారికిన్ ॥

చండ—నీనీతులింకంజాలును కట్టిపెట్టుము. ఓరీ! క్షత్రియవంశజల
ధిబడబానలా! కూళా.

—॥ మ త్త కో కి ల ॥—

క్ష్మాతలేశసుతుండనై యిటు క్షత్రియానుచితంబుగా
భూతలాధిపు పుత్రిఁగైకొనఁ బూనినాఁడ వెకూ్రర! నా
చేతఁజిక్కితి వెందుఁబోయెదు శీఘ్రమే నిన్నుఁద్రుంచి మా
జాతికైనకళంకముందుది సల్పువాఁడను దుర్మతీ!

రాజ—వృథాప్రగల్భపారాయణా! క్షత్రియానర్హంబైన కార్యం
బిందేదియును లేదు. ఎందఱెందఱు వైరి రాజకుమార్తెల
మాయోపాయంబులఁ బెండ్లియాడ లేదు. లోకజ్ఞానశూ
న్యుండవగు నీకన్నియు నధర్మములుఁగా నేగానుపించును.

చండ—ఏమీ! నేలోకజ్ఞానశూన్యుండనా? ఋణశేషంబును శత్రు
శేషంబును నుంచరాదని పెద్దలు వక్కాణింప నిన్నింతేదనుక
బ్రతుకనిచ్చుటచే నట్టివాఁడనే యిప్పుడాకళంకమునుఁ బాపు
కొనియెద (కత్తియెత్తును.)

మాన—(అడ్డువచ్చి) ఓయీ!

తే॥గీ॥ సుతయుజామాతయును లేని బ్రతుకుమాకు
మాత్ర మేటికి దుర్వారమణ్డలాగ్ర
ధారఁదొలిమమ్ము పదఁపడివారిఁద్రుంచి
కడకుఁగల్గెడి పుణ్యమ్ముఁ గట్టుకొనుము ॥

మహా—ఇందులకుందప్పినఁ తలిదండ్రులగతికిఁ దప్పినవాఁడ వే.

చండ—ఏమేమీ! ముందు మిమ్ములనే త్రుంపవలయునా? సరి యే
సిద్ధముగానుండుము.

మాన— అమ్మా! అవంతీసుందరీ!

శా॥ ఏజన్మంబున నాత్మదంపతుల మేమీక్షింపఁగా లేదొ, యీ
పూజాప్రక్రియ నెప్డు సల్పితిమొ సద్భోగాఢ్యవై ముద్దు పు
త్రీ జీవింపఁగఁ జూడనైతి నిటులెంతే స్వర్గమందేనియున్
మీ దాంపత్యముఁ జూతు నేమొ సెలవిమ్మా పోవుదున్ వెసన్॥

మహా— (దుఃఖముతో) తల్లీ! యెట్టి పాపిష్ఠి కాలంబున నిన్నుఁ గాంచితినో కాని నీ కన్నియు నిక్కట్టులే సంభవించుచున్నవి. నేవలదని యెంత మొఱవెట్టినను వినక నీ తండ్రి యీ దురాత్మునిఁ దల్లి లేని చెలియలపిల్లఁడని యీతని తమ్మునితోఁ గూడ నిందుఁ దెచ్చి పోషించె పాలుఁబోసి పెంచిన సర్పమాత్రంబున విషోరగంబునకుఁ దంష్ట్రాంచిత విషంబు నశించునా? పరకాంతామానభంగాభిలాషియగు దారువర్మ మృతినందుట కెంతయు సంతసించితిని కాని యీ దుర్మార్గుఁడు జీవించి నీకిట్టి యిక్కట్టుఁ గలిగించునని తలంచనైతి. హా! నాయనా! దర్పసారా! ఇట్టి దుర్మార్గున కేల రాజ్య మొప్పగించితివోయీ! నిజజననీజనకులఁ గోలుపోవుట కా? నీకిట్టి బుద్ధిపుట్టినది. నాయనా! కీర్తిసారా! తల్లిదండ్రులులేని కొమరుండవుగా నుంటివా? యీ దుర్మార్గుఁడు నిన్ను మాత్రముఁ బ్రతుకనిచ్చునా? ఇంకెక్కడి యాశ.

అవం— (తల్లినిఁ గౌగలించుకొని) అమ్మా!

మ॥ కలుషాత్ముల్ భువి నెందఱేని మును దుష్కార్యంబులం జేసి వ
ర్ధిలిరే? వీఁడు సుఖించునే? జగతి నెందేఁ గాంచియున్నావె? కాం
తల బాధించిన యట్టి దుర్నయుఁడు వ్యర్థంబై చనన్ సాధ్వి పు
ల్కులు నిక్కంబుగ నెమ్మా తానిటుల్ దుఃఖింపఁగా నేలకో!

మహా— హా! తల్లీ! సుగుణకల్పవల్లీ.

తే॥గీ॥ కనకపంజరమందున నునిచి పెంచి
పిల్లివాతనుఁ గీరంబుఁ బెట్టినటులఁ
జిన్నవయసుననుండి పోషించి నిన్నుఁ
జెనటివానికి నేఁ డెఱఁ జేసినాము ॥

అవం — అమ్మా! అశ్లీలంబు లేల నాడెదరు.

మాన — అల్లుఁడా సిద్ధముగా నుంటిమి నీకృపాణపాతంబునకింక నడ్డు లేదు.

చండ — (తనలో) వీరి నిప్పుడు వధించితి మా దర్పసారుఁడు రాజ్యమునుఁ బాలించుమనునది జననీజనకుల వధియించుటకా యని మండిపడి నన్ను ద్రుంపక మానఁడు క్రోధావేశంబునఁ బలికిన పలుకుల నేపాటిఁ గొని యీముదుసలి మేర మీరుచున్నాఁడు. అక్కటా! నేనీరాచకన్యను వరించుట చేతనే కదా? నేఁడిట్టి పాపిష్ఠి కార్యంబునకు లోఁబడవలసివచ్చినది. (ఆలోచించుచు) నాకీకుర్రాసునిఁ గాంచినకొలఁది శరీరము దహించుచున్నది. ఓసీ! గయ్యాళీ! నాకేఁ తయవమానమొనరించితివే? వీని వధించుటకన్నఁ గారాగృహమందుంచి దర్పసారునకీ వర్తమానమునుఁ బంపి తదాజ్ఞానుసారము గావించిన మేలగునో చెడెనే. ఇక్కాంతామణి నేనేమి చేయుదును దీనిఁ గూడ బాధనాలయంబున నుంచెద? కలదు వలదు. ఇక్కార్యంబున నీవృద్ధదంపతులిరువురు గట్టిపట్టుపట్టియున్నవారు. ఈపెఁ గూడ బంధించిన వీరాత్మహత్య గావించుకొనక మానరు. దాన నాకుఁ గీడు రాఁగలదు. ఏమి చేయుదును.

మాన — ఏమీ! మమ్ము వధింప నీకుఁ గరవాలము రాడుట లేదా? సుతులకన్న మాజీవంబులే తీపియా? నీకరవాలంబిటు తెమ్ము నేనే వధించుకొనియెద (కత్తిఁ దీసికొనఁబోవును)

చండ — ఓరీ! క్రూరిరా! ఎట్టి గయ్యాళితనంబునకొడిఁగట్టితివిరా? ఈ నక్కజిత్తులెచట నేర్చితివి. ఇంతమాత్రంబునఁ గరుణింతు ననియా? (కాలిఁ బడఁదన్నును.)

మాన——(క్రిందఁబడి) ఛీ! మానసారుఁడా! నీవింక నేల జీవింప నెంచెదవు,
సకలసామంతనరాధిపులుఁ గొలువ నిండుపేరోలగంబుండి యా
శాంతసద్యశోవిరాజితుండవయి యెల్లవారిచేఁ బరిచర్యలొందు
నీవు నేఁడొకయల్పునకు లోఁబడి తత్పాదఘట్టనంబునఁ గ్రిందఁ
బడి జీవించితివా? హా! నీకెంతగతి సంభవించినది. ఇట్టి చెట్టలఁ
గలనైనఁ దలంచితివా? మానమా? ప్రాణవిముక్తికిఁదగు
వస్తుమాత్రము నీకూరదని జీవించెదవా?

మ॥ కరవాలంబులు లేవొ, రజ్జులు ఘనంగా నుప్పింపవో, వజ్రముల్
దొఱుకంబోవో, శిలల్గలుంగవొకొ, లేదో కాలకూటంబు, దు
ర్మరణంబుం దెడి వారికేమిటికొ ఱాతల్ మానంబువో ప్రాణముల్
స్థిరమే నిల్వఁగ మృత్యువెప్పుడయినన్ జీవాళికిందప్పునే॥

సేవకా! నీవేగి కరవాలంబుఁ గొనిరమ్ము

కారాగృహాధికారి——(ప్రవేశించి) ఇది యేమి? శృంఖలవిమోచన
సాధనంబులఁ గొనిరమ్మని నాకు వర్తమానంబునుఁ బుచ్చి
శృంఖలబద్ధుని ఖండింప నుద్యుక్తులగుచున్నారేలకో? (ఆలో
చించి) వృద్ధ నాకు వర్తమానమంపినది. నఱుకఁదలంచునది
చండవర్మ. ఈతండిట్టి కార్యంబుల కెప్పుడుఁ దిట్టయే. ఇదిఁగా
తయు నాకేల లోనికేగి నారాక నెఱింగించెద. (ప్రకాశ
ముగ) దేవా!

చండ——(తనలో) నేనింకనిచట నున్న నపాయంబు రాఁగలదు ముందీక
హానాభూసురుఁ గారాగృహంబున బంధింపవలయును. ఈత
హితుఁడును మదీయానుజమారణ హేతుభూతుఁడునగు
పుష్పోద్భవునిఁగూడ తద్భార్యాకుటుంబ సహితముగ కారా
గృహమున నంపవలయు నప్పుడుగాని నాయొడలు మంటలా
రదు. (ప్రకాశముగ) ఓరీ! కారాగృహాధికారీ! ఈమహా
త్మునిఁ గొనిపోయి కారాగృహమున బంధింపుము (జనాంతి
కముగ) మఱియు బంధుపాల పుష్పోద్భవులనుఁ దత్కుటుంబ
సహితంబుగ బంధనాలయమున కంపుము.

కారా—చిత్తము.

చండ—తత్క్షణమే నాయానతిని నిర్వర్తింపవలయును సుమా?

కారా—నిరంకుశాధికారులగు మీకుఁగూడవ్యతిరిక్తంబులుండునా? (రాజవాహనునితో) అయ్యా! నావెంటఁదయచేయుఁడు (చండవర్మ నిష్క్రమించును.)

రాజ—హా! విధీ! ఎట్టివానికెట్టిగతి సంభవింపఁజేసితివి.

సీ॥ స్వైరవిహారంబు సల్పెడువానికి
శృంఖలబాధంబుఁ జీకటిల్లు
ప్రసవతల్పంబులఁ బవళించువానికి
పాషాణవితతియే భవ్యశయ్య
సచివాళి గొలువ స్వేచ్ఛవసించువానికి
నిర్జనస్థానమే నిలుచుతావు
వీణాస్వనంబుల వినెడువానికి నేఁడు
కౌశికస్వనమె రాగములగములు
తే॥గీ॥ చలువపుట్టంబులంగట్టవలచువాని
కెట్టిమలినపుట్టంబౌను కట్టుబట్ట
పూవులమ్మినచోటనే పుడకలమ్మఁ
జేయఁబాడియే ధర్మమీక్షింపలేవె॥

అవం—హా! నాథా! మీరాయంధకార బంధురంబగు కారాగృహంబున నిడుమలొందుచు నెటులుండఁగలరు. అద్దురాత్ముఁడు నన్నుఁగూడఁ గారాగృహమందుంచిన సుఖపడుదునుగదా! అయ్యో! ఈవియోగ మనుభవించుటెటులు.

సీ॥ సఖుల చేతనుఁ బరిచర్య నే నెటుఁగొందుఁ
బరుల సేవకుఁ బాలుపడఁగ నీవు
చంద్రశిలాంచిత సౌధమం దెటులుందు
బంధనాలయమందుఁ బడల నీవు
అతిరుచ్యభోజన మారగించెద నెట్లు
కొఱ్ఱగంజియు నుప్పుఁ గుడువ నీవు
వల్లకీకలకలస్వనములే నెటువిందు
క్రూరార్భటుల వినఁ గోర నీవు
తే॥గీ॥ ఇడుములొందుచు నెపు డుపవసింప నీవు
సౌఖ్యరాశి నేవసియింపఁ జాలు నెటులు
కాంతుఁ డిడుమల నంద సౌఖ్యంబు నొందు
సతికి మునుజన్మ కేసి సద్గతులు గలవె॥

రాజ—ప్రేయసీ! ఏజన్మంబున దంపతుల నిరువుర నెడఁ బాపితిమో మనకీజన్మంబున నదియే సంభవించెను. చేసినదనుభవింపక తప్పునా? వరసుకుమారివి స్మరశరానలంబు నెటులు సైపఁగలవు.

చ॥ స్మరుఁడు నితాంత వేగశరజాలములన్ విడ, రేవెలుంగు దు
ర్భరమునుఁ దుల్యభాస్కరకరప్రకరంబునుఁ జన్మ వాయువ
బ్బురముగ వీవ, మాధవుఁడ పూర్వవిలాసముఁ జూప, శంబరా
సుర పరిపంథి సైనికులు శూరులు పైఁబడ నెట్లు సైతువో?

ప్రథమంబున నీ వారితీక్ష్ణంబునకుఁ దాళలేక నన్ను శరణుఁ జొచ్చినదాన వింకెటులఁ దాళఁగలవు. నిన్నుఁ గూడ నిష్కారణపుం దాస్యతం జేసి మీ కుటుంబమునకుఁ గూడ నగ్గుసలిపినవాఁడ నైతిని. అయ్యో! శృంఖలబద్ధుండ నగుటచే వ్రేలైనఁ జూపించుకొనని నేను నేఁడిట్టి దూషణఁగొంద వలసివచ్చినది లేకున్న మదీయశౌర్యమెల్ల వెల్లవడియుండునుఁగదా!

మాన—అల్లుఁడా! సహజశౌర్యుఁడవగు నీప్రవేరు భుజబలమునుఁ జూప వలయునా? సూర్యుఁడు మబ్బుచేఁ గప్పఁబడినమాత్రంబునఁ బ్రకాశహీనుండగునా?

రాజ—మామా! నేనిందులకు విచారింపనుగాని యీ క్రూరుఁడు,

ఉ॥ రాజకుటుంబమైనఁ దనప్రాణముఁగాచినవారలైన ని
ర్వ్యాజకృపాప్రమేయమున నందఱిఁద్రుంపఁగఁ బూనెనెట్లు పృ
థ్వీజనులం బ్రజల్ దయను వీక్షనుసేయఁగలాఁడువీరికే
రోజునఁగాని గండము, పరుఁగృపఁజూచునె చేయమిమ్మిటుల్॥

కారా—ఆహా! ఏమీ? ఈతని భూతదయ.

అనం—నాథా మనయవస్థకుం దోడువారి సౌఖ్యంబుల విచారించుటయా?

కారా—అయ్యో! ఇప్పటికే యాలస్యమైనది. ఇంక నాలస్యమైన నాజీవనంబులకుఁగూడఁ జెడవలసినవాఁడనగుదును.

మహా—ఓయీ! నేఁటివరకు నిమ్మహానీయుని భృత్యంబునఁజీవించి నేఁడు వీరికే యపకృతిఁగావింతువా.

కారా—అమ్మా!

తే॥గీ॥ నీరుగింజల పోట్టకాసించి క్రూర
కార్యములఁ జేయఁగా నొడిఁగట్టవలసెఁ
గాని పెంచువిశ్వాసమ్ము మానఁగలనె
నే నెయ్యన నేల మానదు శ్వానమైన॥

మాన—విధివిధానమెంత దుస్తరము. ఏకాతపత్రంబుగ సర్వంసహాతలంబెల్ల నేలిన నేనొక్కనీచునకుఁలోఁబడి నాసుతులు బాధింపఁజూడవలసివచ్చినదిగదా! దైవమా! ఎట్టి క్రూరకృత్యంబు లొనరించుచుంటివి?

రాజ—మామా!

తే॥గీ॥ పత్రఫలపుష్పముల శతవత్సరములు
పెఁగి నిలుచునీడనొసంగి నరులకెల్ల
కట్టెడివాఁడొకండు దనశాఖఁ గొట్టుచుండ
మిన్నకుండక భూజమేమిటి యొనర్చు॥

అవం — మనోహరా!

మ॥ జననంబొందితి క్షాత్రవంశమున, నే సౌందర్యపుం రాశినం
చునుఁ బేరొందితి, నాకుఁ జోడగుపతిం జూపింపు మా యంచు న
వ్వనజాక్షుం స్తుతియించి చేకొనితి మద్భాగ్యంబుచే నిన్నుఁ, గా
ని నిన్నుం జూడఁగ లేఁడు దైవమనుచున్నె నెంచనైతిన్గదా?

మరియు నమ్మానసారుని తనూజ యెట్టిదుష్కర్మకూర్తంబున జనియించినదోకాని వరించిన పతితోఁడ నొక్కదినంబైన సుఖింపలేక పతిబాధనాలయవాసునిఁ గావించెనని నన్నెందఱు దూషింతురో గదా? అకటా! యీయపవాదమెటుల సైతును. సర్వంసహాతలంబెల్ల నేకఛత్రంబుగా నేలిన మానసారునిపుత్రినై యాగర్భశ్రీమంతురాలనని పలువురిచేఁ గొనియాడఁబడిన నన్నుఁ గాచువాఁడొక్కరును లేరా?

రాజ — దేవీ! ఆవనజోదరుఁడు మననుదుట నిటుల లిఖింపఁజేయున దేమున్నది. ఊరడిల్లుము.

అవం — దైవమా,

సీ॥ కోరినవానిఁ జేకొంటినంటయె కాని
యేసౌఖ్యమును ఘటియింపలేను
ధవునికొక్కింత పాదముల నొత్తుటె కాని
యుత్తమాసుల నుతులందలేను
సిగ్గుచే క్రింద వీక్షించుచుంటయె కాని
కలువుదీరఁగ నాథుఁ గాంచలేను
తలపోసి యాత్మసంతసమందుటే కాని
యింపుమీరఁగఁ గౌఁగిలింపలేను
తే॥గీ॥ గడియయేని సుఖింప నన్గాంచలేక
విరహదుఃఖంబుఁ గూర్ప భావించినావు
అకట! నన్ను నాకారాగృహంబునందుఁ
జేర్పలేవా నీకెగ్గేమి చేసినాను!

కారాగృహంబున నాథుఁడష్టకష్టములనంద నంతఃపుర సౌధోపరిభా(గ)ంబుల విరహానలంబున వర్ధిల్లుమని నానొసట నేల వ్రాసితివి. ఇట్టి ...ంద్యమగు జీవనంబేల! నాథా!

శా॥ ఆరామంబుననాటి సాంధ్యను మదీయాలింగనోత్సాహివై
గోరంగానిరసించి యేగితనుచున్ గోపింపకీవిప్పుడర్
గారాబమ్మునఁజూచి దోసములుఁగల్గన్ బ్రోచి యస్మన్మన
స్సారంబుల్గొని ప్రాణముల్విడ ననుజ్ఞన్ వేగ నాకీయుమా?

సీ॥ కన్నదాది...ఁ గనకంపుఁదొట్లలోనూపి
దయఁగన్న నాతలిదండ్రులార!
పక్షినయపుఁదెల్ల నెలమిఁజోలలఁబాడి
దయఁబ్రోచినట్టి మోదాంగులార!
పసితనమాది నన్నాయఁగాలకి వెంటఁ
జరియించు స్నేహితజనములార!
జనవిడలేక విశ్వాసంబుచేవిద్య
గఱపిన పక్షివర్గంబులార!
తే॥గీ॥ అస్మదీయనాథుఁడు బాధనాలయంపు
కష్టములనొందఁ గన్నులఁ గాంచలేక
ప్రాణములవీడిపోవగాఁ బూనితింక
నెల...నొసఁగుఁడీ దయనువీక్షించిమీరు॥

నాథా! ఇదియే నాకడసారి ప్రార్థనము. (పైట చెఱఁగున నురివెట్టు కొనఁబోవును.)

...— (చెఱఁగునుఁదీసి.) అమ్మా! వృద్ధులమగుమాకుఁ బుత్రికా శోకమునుఁగూడఁ గల్పింతువా?

...— హా! కూతురా! నీకెట్టి దురవస్థసంభవించినది.

రాజ—ప్రేయసీ! ఏమీ! నీయవివేకము.

తే॥గీ॥ తమకుఁదాను యత్నమునఁ బ్రాణములువిడువ
భ్రూణహత్యాఘఘోరమునఁ బోదురంచు
వేదజాలంబు ఘోషింపవినుటలేదొ
కానిపనిఁజేయగాఁ బాడియగునె ప్రజకు॥

మరియు నీవు ప్రాణములు బాసిన,

తే॥గీ॥ దైవయత్నంబుచేత బంధములఁబాసి
వెండియునురాఁగలుగు దీనివెలఁదిమిన్న
యేఁగాంచియు నేసుఖియించువాఁడ
స్వర్గపురమునకేను రావలయుఁగాదె?

కావున మన్మనోహారిణీ! నాయందలి వాత్సల్యంబునఁ బ్రాణంబులెట్టు లో కారాగార విముక్తుఁడనగువరకు ధరింపుము. తదుపరి నీనై ప్రాణాపహారుఁడనై నీకు సంతోషంబుఁ గలిగించువాఁడ.

అవం—నాథా! ఇవి యెక్కడిమాటలు మార్జాలంబుచేఁజిక్కి కీరమె
దైనఁ బ్రతుకుటకలదా!

రాజ—ప్రాణమున్న నొకానొకప్పుడు జీవించుటనూహింపఁగలను.

అవం—నాథా! మీరెట్టి యమాయికులు.

కారా—మీ వేదాంతములతోడనే కాలమంతయుఁ బోవుచున్నది
ఈ విషయ మెఱింగిన నమ్మహానీయుఁడు నన్నుఁగూడ
మీకు సహవాసిఁగావింపఁగలఁడు. అదియుఁగాక కుటుంబ
సహితంబుగ బంధుపాలపుష్పోద్భవులఁ జెఱనుంపవలయునని
యాజ్ఞయైనది. ఇంక నాలస్యమైన నీవిషయంబెఱింగి వారెట్లు
కైనఁ బారిపోఁగలరు. దాననాకు కీడుమూడును.

రాజ—ఏమీ! నాస్నేహంబుకతమునఁ బుష్పోద్భవునకును వణిజులకు
గూడ కారాగృహవాసమా! హావిధీ!

తే॥గీ॥ ఇనుముకతమున హవ్యవాహనుఁడుగూడ
సమ్మెటల దెబ్బలందిను చందమునను
రాజవాహనుమైత్రి కారణముచేత
నీవణిజుల బందిగమందునిడితె యకట!

హా! పుష్పోద్భవా?

సీ॥ జననమాదిగనాకు సహవాసివై యుండి
సోదరురీతిన న్జూచినావు
చెడుకార్యముల దెస నడువకుండఁగఁజేసి
మంత్రిధర్మంబును మనిపినావు
దిగ్విజయంబుసాధింపఁ బ్రోత్సాహంబుఁ
గలిపించిమమ్ము దేఁగలిగినావు
మాళవాధీశునాత్మజ రూపసియటంచుఁ
గొనివచ్చి యాపెఁజేకూర్చినావు

ఆ॥వె॥ కడకునాకుచెల్మి కతననీచెఱలోన
పత్నితోడనుండ వచ్చినావు
శాముఁగొందఁ జాలుపడినాఁడ వెన్నొనీ
మైత్రిమహిమనెంత మాన్యమయ్య!

ఓ సాధ్వీలలామా! బాలచంద్రికా!

చ॥ అతిసుకుమారివైనిజ హితార్థముబాములఁజెంది చెల్మిగా
క్షితినృపకన్యతోడ వనసీమ, సుమాస్త్రకఠోర బాణపీ
డితుఁడనుఁగాఁగ సౌధమునడించియు నీసతితోసుఖంపఁజే
సితివి బళారె, దుర్గతినిఁజెందితి నాదగుచెల్మినమ్మరో!

హా! సుగుణావతంసులార! బంధుపాలాదులారా! పురప్రవేశమాది
కన్న కుమారునికన్న నెక్కువగారవమునఁ బోషించిన మీకుఁగూడ
నపకృతినొనరించితిఁగదా! నన్నెంతగానిందించుచుంటిరో?

కారా— చనుప్రొనుసంగిన నెత్తినెక్కినట్లున్నారే! రండు. రండు.
(రాజవాహనునిలాగును.)

రాజ—ఓయీ! నాప్రేయసి కొక్కవాక్యమునుఁ జెప్పివచ్చెద క్షణ మోర్వుము.

ప్రేయసీ!

సీ॥ ప్రార్థింపుమీ! యంతరంగంబునం దెప్డు
కేల్మోడ్చి హరినామ కీర్తనముల
భావించి మ్రొక్కుమీ! పరమదైవములంచు
జననీజనక పాదజలజములకు
కరుణతోఁ దిలకింపఁగదఁగుమీ! సుతులుగాఁ
జంతించి దాసదాసీజనంబుఁ
గాంచుమీ! మునుపటికన్న కారుణ్యాధి
కంబునఁ బక్షివర్గంబునెల్ల
తే॥గీ॥ తనరుమీ! సాధుపోషణంబున సతంబు
విసిగికొనకుమీయాత్మ! జీవింప నెపుడు
గడపుమీ! మెల్లగాఁగల కాలమెల్ల
నొసఁగుమీ! పోయివచ్చెదఁ జెలియ!

అవం—హా! నాథా! కడసారి కౌగిలించుకొననిండు (కౌగిలించుకొనఁబోవును)

కారా—అటులవీలు లేదుదూరముగానుండుఁడు (ఇరువురిమధ్యనిలచును)

అవం—హా! దైవమా!

తే॥గీ॥ ఎట్టి కట్టిడికృత్యంబులేనిఁ జేయ
నించుకేనియు వెనుకంజనిడవదేల
నామభాగ్యంపు రాశియా నాథుఁగాఁగ
లింపనుంతయునోచఁగా లేదె నేను॥

ఎట్టి క్రూరకర్ములకేని దయయుండును కాని నీకుండదాగదా!

రా—హా! మన్మదనసామ్రాజ్యలక్ష్మి! నీకెట్టి దురవస్థకలిగినది.

చ॥ అడలఁగఁబోకుమింక, హృదయంబున నేనియు నీయవస్థనీ
శుఁడెవిధియించె మాకుననుచున్ విధినిందనుఁ జేయఁబోకుమె,
ప్పుడు పెరవారిపై విసుగఁబోకుము, మేనుకృశించుభోజ్యమున్
విడువఁగఁబోకు, కాలమును నెమ్మదిఁబుచ్చు మవంతిసుందరీ?

కారా—నీ యొప్పగింతలతోఁడనే సూర్యోదయమగునటులున్నది.
(చేతిలో ముందునకుఁద్రోయును.)

రాజ—దేవీ! గుండె రాయిఁజేసుకొని పోవుచున్నాను.
(కారాగృహాధికారి రాజవాహనుఁడు నిష్క్రమింతురు.)

అవం—హా! నాథా! (మూర్ఛిల్లును.)

మహా—అయ్యో! ఎంతగతి సంభవించినది. (ఉపచారముఁ జేయును.)

మాన—ఛీ! మానసారుఁడా! నీవెంతటి యసమర్థుఁడవైతివి. కన్నకుమార్తె విచారసాగరంబునఁద్రోచి జామాత నొక్కనిచుఁడుఁ గొనిపోవుచుండఁ జూచుచుంటివి. ఓ వాణీమనోహరా! నే నీకేమియెగ్గొనరించితిని. ఇంతకు నీయాటలుసాగుచున్నవి.

మ॥ నగజాతన్ గ్రహియించు వేళను మదోన్మాదుండవౌట దల
దెగఁగోసెన్ శివుడంత కావి యసురుల్ పీయాడటుల్ జేయు మ
జ్జగమందేరినిట్టి కష్టముల చే సాధింపఁగా నేర్తువే!
తగునే చేతికివచ్చినట్లు నొసటన్ దామిట్టులన్ వ్రాయగన్?

అవం—(మూర్ఛ మునిఁగి లేచి) హా! నవశిరీషకుసుమపేశల సుకుమారశరీరా! మనోహరా!

ఉ॥ పున్నమచంద్రుఁబోలు మొగమున్వికసింపఁగఁజేసి కన్నుల
భ్యున్నతినంద, నవ్వుచెలువొందగమోవినినన్నుఁగాంచి "యో
యన్నులమిన్న! బోటులువనాంగనమందునలేరు కౌగిటం
బున్నముగొమ్మ" టంచనవొపూర్వాకృతిన్ మఱువంగశక్యమే

నేనెంత దురదృష్టవంతురాలను. మనోనాయికా!

చ॥ ఉడుపతిలేసివేళ మదనోగ్రశరంబులఁ డస్సిపత్రముల్
ముడిచెడికైగవ ప్రసవమున్బలె నాహృదయంబునేఁడు నీ
విడినవియోగబాధఁ బ్రసవింపదు దుర్ఘటమాయెజీవనం
బడఁలకయుండుటెట్లు హృదయంబు వకావకలౌచునుండగన్

జీవంబులైనవిడఁతకుండ దుస్సహమగు నెట్టుఁగూడఁబెట్టితివా? ఎం
కాలంబిటులు వియోగానలంబునఁ గుందుచునుండఁగలను ఓతల్లీ
భవానీ! నీకైన నామీఁద దయరాదా! నీవెందఱి యనాథలఁబో
చుటలేదు. నన్నుఁబోచిన నీకు భారమా!

సీ॥ సురలార! సిద్ధభూసురులార! మన్నాథు
బంధనంబులనెడఁ బాపరయ్య
నరులార! యక్షకిన్నరులార! నాకువై
ధవ్యంబులేకుండఁ దలఁపరయ్య
మునులార! గరుడకింపురుషులార! జననీ
జనకులదుఃఖంబుఁ జదుమరయ్య
హరులార! శార్దూలకరులార! దుర్మార్గు
చండవర్మాహ్వయుఁ జంపరయ్య
తే॥గీ॥ సకలదిక్పాలులార! యోసరసులార!
బంధనాలయవాసులౌ వణిజవరుల
బంధనంబులఁబాపి కాపాడరయ్య!
యిదెనమస్కారముం జేతు నేలుఁడయ్య!

ఎన్నివిధంబుల నూఱడిల్లుదమన్నను సాధ్యంబుగాకున్నది హా! ప్రా
నాయకా!

ఉ॥ ఎన్నిదినాలకుంగనుదు నింకఁద్వదాననపంకజంబు, నా
కన్నులకర్వుదీర నినుఁగౌఁగిటఁజేర్చియు ముద్దులాడుటిం
కెన్నఁడు, మంజులధ్వనివచించుచు సంతతమందఁ జేయుటిం
కెన్నఁడు, వెఱ్ఱిగాని యివియెల్లను హా కలలోనియేనుగుల్॥

చ॥ కలువలఱేఁడులేమిఁ బాడఁగట్టదుచంద్రిక, నూత్నమేఘ పం
క్తులుగనరామిఁతళ్కులొనఁగూడవ, వెంతటిపుణ్యకార్యముల్
సలిపెనొపత్నినయ్యు విడఁజాలితి నాచెలిలోననిన్ను బా
ములఁగుడువంగ, నింక నెటుబొందెనునిల్పుదు ప్రాణవాయువుల్

(మూర్ఛిల్లును.)

మహా—అమ్మా! ఊరడిల్లుము.

(అవనిక జాఱును.)

తృతీయాంకము సంపూర్ణము.

శ్రీ

రాజవాహనవిజయము.

చతుర్థాంకము.

[రంగము—అంగదేశమునందలి చంపానగర ప్రాంతయుద్ధభూమియందలి శిబిరము చండవర్మ, కృతవర్మ, సైనికులు శృంఖలబద్ధుఁడైన సింహవర్మయుఁ బ్రవేశింతురు.]

చండ — ఓరీ! దుర్నయధురీణా! సింహవర్మాభిధానా!

చ॥ నలువదివేలసైనికుల నంతరణస్థలిఁ గూలఁదన్కఁ బ
మ్ములవిసిగించినాఁడ వెటుఁబోయెదవో యిపుడింక మీఁదనో
తులువ! మదీయహేతి నినుఁ ద్రుంచెద నద్ధముగాఁ దలంచు వా
రలపసఁ జూతు నీతనిదురంత బలాఢ్యుఁగా నెఱుంగుమీ॥

సింహ — కూళ! దుష్టభూపాల! ప్రాణంబులకన్న మానంబుల నెక్కువ పాటించు క్షాత్రకులవతంసులుఁ దమకూతుల నీవంటినీచుల కర్పింతురా? వ్యర్థాభిలాషల నింకఁ జాలింపుము. మదీయ తనయాపాదరజంబునైనఁ బోలని నీవా మె నామమైన నుచ్చరింపఁ దగవు శృంఖలబద్ధుఁడనగుటచే నీ యాక్రోశన వలసివచ్చినది కాని లేకున్న నీ రాయబారికి సంభవించిన దురవస్థయే నాచే నీకును సంభవించెడిది. మితిమీఱి దుర్గతులఁ జెందకుము వీరసతీ మానభంగముఁ బొనరింపసమకట్టి మడిసిననీయనుజుం దలంపుము. నిప్పు నాప్రాణంబులఁ గొనెదనని బెదరించినమాత్రంబున నీవలె తుచ్ఛజీవంబులకు భయపడువాఁడను గాను మఱియు నిన్నె

మని దలంచెదనంటివా? తనయునిత్తువా! లేదా! లేకున్న నీతోడరణమొనరింతునని రాయభారమంపి నిరాశ జెంది కోట ముట్టడించు క్షత్రియకుల పాంసనుండవయిన తుచ్ఛుండవని తలంచెదను. నాకు సాయమెవరంటివా సాయమునీకుఁగాని సహజశౌర్యవంతుండనగు నాకేలవినుము.

సీ॥ చండమదోద్దండ శుండాలకుంభస్థ
లవిభేది భిండివాలంబులుండ
జనజతసారంగ సైంధవవ్రాతసం
హారప్రయుక్తాసి ధారలుండ
సంగరరంగదుత్తుంగ శతాంగఖం
డనసముత్సాహ కుఠారముండ
వైరిసంహార విహార మహోత్సాహ
సైనికాంతిక శరాసనములుండ

తే॥గీ॥ వంగదేశాధినాథ బాహాబలంబ
రాతిధీకరఘోర పరాక్రమంబు
శృంఖలవిమోచనంబున్నఁ జీరదెవరి
స్వప్నమాత్రైన సాయంబుసలుపుడంచు॥

చండ—ఏమీ! నీవంతటి పరాక్రమవంతుఁడవా! కావుననే చండవర్మ పరిఘూసమాన బాహాయుగ బంధీకృతుండవయి దప్పుకొనలేక యబలవై తివి. ఛీ! ఏమొగంబున పౌరుషవంతుండనని యుపన్యసించెదు. అంతటి మానవంతుండవేయైన పరిపంథిహస్తగతుండవెట్లయితివి. ప్రాణమునకన్న మానమునే పాటించు నటులు క్షత్రియోచితంబైన వీరమరణంబేల చెందవైతివి.

సింహ—ఓరీ! మూర్ఖుఁడా! వినుము. జయాపజయంబులు దైవాధీనములు ఇందు నీప్రయోజకత్వమేమియును లేదు పదుగురే కక్షై చుట్టుముట్ట నిదంతావళంబభ్రమించి రణంబొనర్చుతఱిఁ

గరవాలంబూడి ధరణీతలంబునఁబడియె. అక్కతంబున నిరాయుధుండనగు నన్ను పదుగురంగూడి నీవు బంధింపఁగలిగితివి. కాని లేకున్ననప్పుడే మదీయవీరోచిత శౌర్యంబునుఁజూఁ యుందువు.

చండ — జంఘాబలంబునుఁజూపింతువా! ఆత్మహత్యాదోషంబున నేఁదువా? ఈరెంట దేని నొనరింతువు.

సింహ — దేని నొనరింతునా! వైరి శిరశ్ఛేదనం బొనరించెడివాఁడను.

చండ — ఓరీ! వాగ్ప్రగల్భంబుల నేలచూపించెదవు. ఓటునందితివి యబలవలె మూలముసుఁగువై చికొని కూర్చుండక మాకేలకు నేల తెప్పించెదవు.

సింహ — అబలవు నీవుగాని నేనుగాను. ఏలయన మానాభిమానంబులు లేక మేనమామ పంచఁబడి యుండువాఁడబలగాక మగవాఁడగునా? శృంఖల విముక్తిఁగావించిన వాగ్ప్రగల్భములు నావియో నీవియో తేలఁగలవు.

చండ — మూఢా నీవాగ్ప్రగల్భములు మేరమీరుచున్నవే? నీవెన్నివాగినను శృంఖలవిమోచనమనుమాటకల్ల మాచేవిముక్తినొంది నీ రాజ్యంబేలఁదలంచెదవేని నాయుపదేశంబుఁబాటించి నీకుమార్తె నాకొసంగి వివాహముఁగావింపుము. మామన్నించెదను. సకలసామంతనరాధిపులచే నూడిగంబుఁ జేయించెద. అటులొనరింపవేని నీవొందనున్న బాధలు గుక్కలైన నొందవు.

సింహ — మూఢా! వేయేల నాకడసారి ప్రతిజ్ఞ వినుము.

మ॥ ఘనశైలంబులుఁగూలినన్, దపనక్షుత్తేజులల్లాడినన్
వినువీధింగలతారలూడిన, మహావిధ్వంసమేమైన కుం
భిని, రత్నాకరమింకినన్, సరియె విన్మీ! ప్రాణమేయున్న నా
తనయన్ నీకిడి పెండ్లిసేయనుమి, పోదా! యాశలింకేటికిన్॥

చండ— అటులైన నీయెదుటనే నీకుమార్తెను బలాత్కృతిఁ జేపట్టు వాఁడ. అప్పుడేమి యొనరింపఁగలవు.

సింహ— ఏమి యొనరింపఁగలనా?

తే॥గీ॥ చేతఁగరవాలమూని నిర్జింపఁగలుగుఁ
దేనిత్వత్సైన్యములతోఁ వధింతునిన్ను
అనిని శృంఖలమూను తనంతఁదానె
యదనునన్ శృంఖలం బేమియడ్డఁగలదు॥

ఇంతియేకాని మదీయ నయనేంద్రియముల నీదుర్మార్గంబునుఁ జూతు ననుమాట కల్ల. ఇదియంతయు నేల.

తే॥గీ॥ రవికులాన్వయసంజాత ప్రవిమలగుణ
రాశి నాముద్దుపట్టి వరసుకుమారి
ప్రాణముల నేని విడువఁ జాల్పునుఁగాని
పరమనీచుని నిన్నుఁ జేపట్టఁగలదె॥

చండ— మీరంతి పౌరుషవంతులా! కావుననే యిట్టి నీచంబునకుఁ జొరఁబడితిరి.

సింహ— పౌరుషవంతులమో కామో నీవన్నమాత్రమున నేమగును. నీచంబునకుఁ జొరఁబడినది నీవు కాని మేము కాము. వినుము.

సీ॥ త్రిమ్మఁగనేమియు లేక మేనమామనుఁ జేరి
కొంగుఁ గప్పుచు నొక్క కొన్నినాళ్లు
పండియుండిన మామ పాదంబులొత్తెడి
కొలువు సేయుచు నొక్క కొన్నినాళ్లు
అత్తయానతి భయమంది వంటిలుదూరి
కూడు నెత్తుక పోయి కొన్నినాళ్లు
సిగ్గులగ్గును లేక స్త్రీలపైఁ బడఁగొల్ల
కొంపలలోఁ దూరి కొన్నినాళ్లు

తే॥గీ॥ ఎల్లవారిచే ఛీవాట్లు నెన్నొ చెంది
తమ్ముకుజ్జనితోఁ గూర్చిరఁ దర్పసారుఁ
గాడి కొంటెపనులఁ జేసి కొన్నినాళ్లఁ
గాలముంబుచ్చు జడుఁడవుఁగావె నీవు॥

నీదోషంబులఁ గప్పిపుచ్చుకొని మమ్మేలయధిక్షేపించెదవు. నోరుమూసికొనుము. రాజ్యోన్నతాధికారినైనంతమాత్రమున నేల నుబ్బితబ్బిబ్బయ్యెదవు.

చండ—జలప్రవాహమున కడ్డుఁగలదు కాని నీవాగ్ప్రవాహమున కడ్డు లేకున్నదే దురాత్మా! సింహంబులనైనఁ జెవిఁబట్టి యాడింపఁగల మమ్ములనే యధిక్షేపించెడివాఁడవైతివిగా! ఔను. చూచుచు నూఱకున్న మేయుచుఁబోవునుఁగదా? నిన్నిప్పుడే మదీయకఠోరాసిధారల నుఱుమాడెద నిలుపుము. (సింహాసనమునుండి దుముకును.)

సింహ—ఓరీ! పాపకర్మా! చండవర్మా! నిరాయుధుండనై చేఁజిక్కినవానిఁ జంపెదనని యేల బెదరించెదవు. రోటఁ దలఁదూర్చి రోకటి పోటునకు వెనుదీయువారుగలరా? నీబెదరింపులకేమియుఁ జడియువాఁడనుగాను. నీయిష్టానుసారంబ కానిమ్ము. ఇంక మితిమీరి మాటలాడకుము.

చండ—ఓరీ! దుర్మార్గా! చచ్చితివిరా! (నఱుకఁబోవును.)

కృత—(అడ్డువచ్చి చేయిఁబట్టుకొని జనాంతికముగా) దేవా! తాము తొందఱపడి యీకార్య మొనరించినచో మీ ప్రేయసిగానున్న యంబాలిక జనకమారణహేతుండవగు నిన్ను వరింప ననిష్టంబుఁ జూపుటయేకాక నీబలవంతంబునఁ బ్రాణంబుల సహితము వీడఁగలదు. కావున యుక్తాయుక్తముల విచారించి కార్యము సాధింపుఁడు.

చండ—(నిదానించి జనాంతికముగ.) ఔను! మంత్రివర్యా! ఆలోచనానన్యసామాన్యుండవగు నీవుండుటచేతనే మత్కార్యంబులు సానుకూలమగుచున్నవి. ఇప్పుడేమి చేయవలయును.

కృత—(జనాంతికముగ) వీని సజీవిగనేయుండనిచ్చి కట్టెదుటఁ దత్కుమారిఁ బరిణయమాడుటయే యుక్తము. దాన వీని పౌరుషమంతయు నడఁగంటఁగలదు.

చండ—ఔను. దైవజ్ఞులేక వింశతిదోషరహితంబైన తారాచంద్రబలంబులందనరిన సుముహూర్తంబు నేటి నిశాంతంబునరాఁగలదని వచియించియున్నవారు. కావున నాపె నీదినంబుననే వివాహమాడవలయును ఓరీ! దుర్మతీ! భ్రష్టాంగరాజ్యాధిపతీ! నీకట్టెదుటనే నీకన్యారత్నంబును నేటి నిశాంతంబున వివాహమాడుచున్నాను. నీప్రతిజ్ఞానిర్వహణం బెంతవఱకు జరుగునోచూచెద.

సింహ—మదీయ వధప్రయత్నం బింతవఱకు సాఫల్యమైనది. ఇంకఁ గుమారికా వివాహప్రయత్నం బెంతవఱకు సాఫల్యమగునో చూడవలయు. ఓరీ! దుర్మతీ నీవివాహప్రయత్నమే నిజమైన మదీయ శాపాక్షరంబులు నిజంబుగాఁగలవాలింపుము.

మ॥ పరసాధ్వీమణి బాలచంద్రిక గ్రహింపంజూచి తత్పాపపుం
బరిపాకంబుననాపె నాధుకరయుగ్మంబందునన్ నీసహో
దరుఁడున్ క్రూరుఁడుఁదారువర్మమృతినందంగన్నటుల్ నాదుదు
ర్మరణంబున్ గనువారులోకులు దురాత్మా! మిట్టిపాటేటికిన్

మ॥ పరనారీమణులందు సోదరులభావంబుంచి యెవ్వేళ ని
ల్లనువీక్షింపుఁడటంచు వేదములువల్కన్ లేదెయారీతిగాఁ
జరుపంబోవనీచులెల్ల సుదతీ శాపానలజ్వాలలన్
మరణంబందరో, యేటికీవిటుల దుర్మార్గంబుఁగావించెదో?

కావున నావాక్యంబులఁ బాటించి దుర్నయమువీడుము.

చండ—తమవాక్యంబులఁ బాటింపవలయునా! చిత్తము. తాము శాపాక్షరంబులొసంగఁ శక్తిఁగలవారా? తమ శాపాక్షరంబులెంతయో తమ ప్రతిజ్ఞా నిర్వాహణం బెంతయో తామెంతయో చూచెదఁగాక ఓరీ! సేవకులారా! వీనింగొనిపోయి కారాగృహంబున బంధింపుఁడు.

సేవ—చిత్తము. (సింహవర్మంతో నిష్క్రమించిరి.)

చండ—మంత్రిసత్తమా! ఆబాలికపయింగల పేరాసచే నిద్దురాత్ముని విడువవలసివచ్చినది కాని లేకున్న మదీయ కఠోరకరవాలధార నప్పుడే నుఱుమాడియుండును.

కృత—ఔను. ఇద్దురాత్ముఁ దప్పక వధింపవలసినదే కాని ప్రస్తుతముఁ దొందరఁ జెందరాదు.

(తెరలో)

దేవా! ఏకపింగాచలంబుననుండి దర్పసారమహారాజుగారు పుత్తెంచిన సేవకుఁ డేణజంఘుఁ డేతెంచి హజారంబున వేచియున్నవాఁడు.

చండ—(తనలో) అంతఃపురద్రోహియగు నాకుహనాభాసుకుని విషయమై యుండవలయును. వానివధించినఁగాని నాయొడలు మంటతీఱదు. ఏమని వర్తమానమంపెనో కనుఁగొందును. (ప్రకాశముగా) ఓరీ! ఆతని సత్వరమే లోనికిఁ బ్రవేశపెట్టుము.

(తెరలో)

చిత్తము.

ఏణజంఘుడు—(ప్రవేశించి) నిరంకుశరాజ్యాధిపా! జోహారు.

చండ—అచ్చటి వర్తమానము లేమిరా?

ఏణ—దేవా! అంతఃపురద్రోహి విషయమయి తామంపిన సందేశమెల్ల దర్పసారమహారాజుగారాలించి యీవార్తాహారి ముఖంబునఁ బ్రతిసందేశమంపియున్నారు. చిత్తగింపుడు.

చండ—తపోనిష్ఠాగరిష్ఠుండైన దర్పసారునకు క్షేమంబే కదా.

ఏణ—ఆ! క్షేమంబుగ నే యున్నారు.

చండ—తదీయతపం బవిఘ్నముగాఁ జరుగుచున్నదా?

ఏణ—అటులనే జరుగుచున్నది.

చండ—ఇంక నీవర్తమానం బెఱింగింపుము.

ఏణ—మహారాజా! నేనిప్పుడు వచియింపఁబోవు పలుకులెల్ల సరిగ నమ్మహానీయుని నోటనుండి వెలువడినవే కానఁ దాము నా యందుఁ గినియక సావధానులరై సందేశంబెల్ల నాలింపుడు.

ఏణ—"ఓయీ! చండవర్మా! నీవు లేఖ పూర్వకంబుగా పంపిన విషయంబెల్ల నాద్యంతము వీక్షించితిని. ఇదివఱకే గంధర్వుఁడగు వీరశేఖరుఁడీ విషయం బెఱింగియుండుటచే మండుచున్న యనలంబున ఘృతంబు వోయుచందంబై మదీయ డెందంబును భేదించి క్రోధజ్వాలలు మిన్నుముట్టుచున్నవి ఓరీ! అవివేకీ! ఎంతటి పరమశాంతుండైనను కన్యాంతఃపుర ద్రోహియెడల నిట్టి యక్కటికంబుఁ జూపునే? నీవంటిపరమనీచు నెందునుఁ గనలేను".

చండ—అవివేకినై వృద్ధదంపతుల వాక్యములాలించి యామురాత్ము బంధనాలయంబున నుంచినందులకు నాకుఁ దగిన ప్రాయశ్చిత్తము జరిగినది. తరువాత.

ఏణ—"వృద్ధులై జ్ఞానవిహీనులై కన్నకడుపుగావున దుష్టదుహితృపక్షపాతంబున నాహంతకునిపై మహాదేవీమానసారు లేమి వచించిన వచింతురుగాక నీవు దానికేటుల సమ్మతించి యిట్టి కార్యమొనర్చితివి. నీవును జ్ఞానవిహీనుఁడవా? మానాభిమానములు లేవా? నిష్కళంకా శాంతవిశ్రాంత ధవళయ

శోవిరాజితమై సామంత ధరణీపాల మకుటమణిస్తోమ నీరాజిత పాదకమలంబై విరాజిల్లు మాళవవంశమున కింతయపకీర్తిఁదేఁజెల్లునే?

చండ—నేనును బ్రథమంబున నిటులనే భావించితిని కాని దుహితుపతుంబున మేనుఁగొఱఁగెదమని యుపన్యసించు ముదుసళులఁ గాంచి మిన్నకుండవలసివచ్చినది. తరువాత.

ఏణ—ఇట్టిదుర్యశంబు రానీ చక్షురింద్రియంబులకెటులానందమాయె మూఢా! ఇఁకనైన వేగంబ కామోన్మత్తుండయి భూసుర వేషధారియయి ప్రజలవంచించి కన్యాదూషణంబునుఁగావించిన యప్పాపాత్ము కుత్సితుమేను ఖండఖండములుఁగావించి యా పలలంబెల్ల పతగతతులకెగురవైచి తదార్తమాకెల్లి రెండుయామములకే శ్రవణానందముఁ గావింపనలయును".

చండ—సెబాస్! మంత్రివర్యా! దర్పసారుని సందేశంబువింటివా! నేఁడట్టుల నేవానివధియించి మదీయ కోపానలంబుఁ జల్లార్చుకొనవలయు ఓరీ! భృత్యులారా!

తే॥గీ॥ కపటి, నంతఃపురద్రోహిఁ, గసనకర్ము
మాళవాన్వయసత్కీర్తి మాపినట్టి
పాపి, హంతకు నెల్లి కోపంబుదీఱఁ
ద్రుంచి పక్షులకెఱవైతుఁ దోడితెండు॥

ఓరీ! వార్తాహారీ! అప్పాపాత్మురాలి విషయమే మాజ్ఞాపించెను.

ఏణ—దేవా! ఆలింపుడు "పుచ్ఛడీకతనంబులిడి మమ్ములనైన మా వంశమైనఁదలంపక నిచ్చవచ్చినటు లభ్భాసురునితో విహరించిన యద్దురాత్మురాలినిఁ దదీయసోదరుఁడగు కీర్తిసారునితోఁ గూడ నిగళబద్ధఁగావించి బందిగంబుననుంపు" మని వక్కాణించిరి.

చండ — (తనలో) అమ్మయ్యా! ఇప్పటికి నాకోపానలంబు సల్లారినది. ప్రచండశౌర్యుఁడనగు నన్నవమానించి యాచెనటిఁగూడిన యారాకాసి, నింక నెన్నెన్నికష్టంబులఁ బెట్టెద. (ప్రకాశముగ) ఓరీ! నీవింక నేగి దర్పసారునితో నీసందేశము ప్రకారముఁ గావించుచుంటినని విన్నవింపుము.

సేన — చిత్తము. అటులేకాని యాద్రోహివధఁగాంచి రావలయునని యమ్మహానీయుఁ డాజ్ఞాపించుటచే మీయాజ్ఞ మీఱవలసి వచ్చుచున్నది.

చండ — సరియే. వధానంతరమే యేగుము. ఓయీ! సచివాగ్రణీ! నీవిప్పుడావంతనగరమునకరిగి యవంతీసుందరిఁ దదీయసోదరునితోఁగూడ బలవంతముగా నీడ్చుకొనిపోయి నిగళబద్ధనుఁ గావించి కారాగృహంబునఁ బెట్టుము. మఱియు నాపాపపుఁ బాపని జేపటియుదయంబున నిటకుఁ దెప్పింపుము. తదీయ వధార్థంబయి చండపోతకాహ్వయశుండాలంబు నలంకరించి ఘుచ్చోటనుంపవలయును.

కృత — చిత్తము.

చండ — ఇంకొక్కటి. నేనీనిశీథిని వైవాహిక కృత్యంబుల నిర్వర్తించి దంతావళం బధిష్టించి యాజన్నిగట్టుఁదునుమాడి సింహవర్మకు సాయంబేతెంచిన తేండ్లగమినెల్లఁ బాఱందోలి తత్కోశవాహనంబులఁగొనియెదఁ. గావున సైన్యంబులతో నీవుఁగూడ సిద్ధముగానుండుము.

కృతి — చిత్తము.

చండ — ఓహోరి! సైనికులార! నాయాజ్ఞ శిరసావహింపుఁడు.

సీ॥ చండవేదండ ప్రకాండములంబట్టి
నఱికివేయుండు తొండంబులల్ల
సైంధవాజానేయ సంఘంబులంబట్టి
గూల్చివేయుఁడువాని గొంతులెల్లఁ
దుర్వారసైన్య సందోహములంగన్న
డింపుఁడీ బల్లెముద్దేహములను
అంబర చుంబితస్యందనంబులఁబట్టి
కాల్చివేయుఁడు తదంగములగముల

తే॥గీ॥ సకలధరణీశ మకుటభూషణక్షపాణ
సారములసంగ్రహించి యవ్వారిఁద్రుంచి
రక్తవాహినిఁగావించి రంగభూమి
వైరినిర్భీతిఁ జరియింపవలయుమీరు॥

మఱియు నేఁటి మదీయ వివాహంబుఁగాంచి సంతసిల్లుఁడు.

(నిష్క్రమించెను.)

చతుర్థాంకము సంపూర్ణము.

శ్రీ

రాజవాహనవిజయము.

పంచమాంకము.

[రంగము—చంపాపురమునందలి కారాగృహము. శృంఖలబద్ధుఁడైన రాజవాహనుఁడు ప్రవేశించును.]

రాజ—ఆహా! నాజీవితమెంత దుర్భరమైనది. అవంతీసుందరీ దృఢాలింగనపూర్వమే?

సీ॥ శ్రమఁదీఱ వనవిహారము సల్పుమనటన్న
        పుష్పమంజరులటుఁ బోవనీవు
చల్లారమెయిరాత్రిఁ జరియింతుననుకొన్న
        చంద్రికలారీతి సలుపనీవు
జలకేళిసలిపిన సంతసంబగునన్న
        నంబుజంబులటు జేయంగనీవు
ఖగరాజములఁగన్న వగపుఁబాయునటన్న
        నిస్వనంబులటుఁ బోనీయవాయె

తే॥గీ॥ సుందరీమణీ కుచయుగ్మమందహాస
        వదనమధురవాక్యంబులు స్వాంతమందు
        నెపుడునూగులాడఁ జేసి యిప్పుడెట్లు
        బ్రతుకువాఁడ వియోగాగ్నివార్ధిమునిఁగి॥

హా! సతీ! శరత్కాల రాకాసుధాకరబింబంబుఁ దిరస్కరించు నీవదనంబును వెండియుఁ గనుఁగొని దీర ముద్దులాడు భాగ్యంబింక నెన్నినాళ్లకుఁ గలుగునోకదా!

మ॥ నగుమోమందము నిందుకన్నఁగవ చంద్రంబొప్పఁ జేర్పుక్క జా
రగనొయ్యారమునొందఁ జన్నుఁగవహారస్తోమ మల్లాడఁ బై
టఁగ రానన్నవరించి లజ్జవడి చెట్లంజాటుగానుండి, న
న్నుఁగనుంగొన్న నృపాలకన్య మఱువన్నన్నాటికిన్ శక్యమే॥

సీ॥ కఁదియుఁగృశియించి కాంతిదొఱంగెడి
తమ్మికే వెల్గునద్దంబుసరియె
నిశలుండినలఁజిక్కి నిర్గోచరములైన
కుముదమత్స్య సుమబాణములుసరియె
కడుమెత్తనై వియోగముఁజెంది కఠినమౌ
వల్లరీకోక గాత్రములుసరియె
గాలికివంగి గగనమంటి చలియించు
మిసిమితీవయుఁ జుక్కమెఱుపుసరియె

తే॥గీ॥ సారసాంగి సద్వదనలోచన కుచయుగ
గాత్రవిభవంబులకుఁ బోల్పగాఁగవీంద్రు
లెల్లఁదలఁచుచుందురుగాని యోదాక్షి
సుందరాంగిని నిందాకఁజూచియెఱుఁగి॥

ఎన్నెన్నివిధంబుల నూఱటఁబొందుదమన్నను తదీయ చరితాంశములు
జ్ఞప్తికివచ్చుట నాప్రయత్నమంతయు నిష్ఫలమగుచున్నది. ఔను
యేటులూఱటకలుఁగును.

తే॥గీ॥ నరునియౌవనంబును భూతవరుఁడుపట్టె
నేని యటవికారము లెన్నియైనఁబుట్టు
నందుస్త్రీవిలోకన మనునట్టి గుగ్గి
లంపుఁబొగవైవ నెన్నేనిపెంపుఁగాదె॥

హామన్మనోహారిణీ! నీమధురవాక్యంబుల మఱతునన్నను మఱపురా
వుకదా! నాఁడు వనమధ్యంబున మనమిరువురము సంభాషించుఁదరి
నీతల్లికతంబున నెడఁబాటుఁజెంది జననితో నింటికేగుచు నన్ను నిరసి చి
యేగుచున్నదని యనుమానమునొందుదునని రాయంచనుద్దేశించి

చ॥ చెలిమి నొనర్చఁ జూసి వనసీమవిహారము సల్పఁగోరు ని
న్నలమట నొందఁ జేయుచు గృహంబున కమ్మయనుజ్ఞ నేగఁగా
వలసె, క్షమింపుమీవు వనభాగములందు నిరంతరంబు మ
మ్ములఁగనుచుందువే గద ? యపూర్వపు మైత్రి నొనర్తువే కదా !

అని యీపలికిన వాక్యంబులెంతయు విశ్వసనీయములు దేవీ! నీసుందరాననాలత నెట్లుమరతును. అమిత వియోగానలంబునఁ గృశించు నాఁడీ లేఖనంప నీకరమృణాళంబులెటు నొచ్చలేదు. (లేఖనువిప్పి.)

మ॥ మృదులంబై, యతసీసుమంబుకరణిన్ శృంగారమై, మోదసం
ప్రదమై, యన్యజనాతిదుస్తరమునై, త్వద్రూపముంగాంచనా
మది వాంఛించెడు నిన్ను నీహృదయమున్ దెల్పె నాథ! పూర్వంబ లెన్
మృగయుప్రం జేసి రమాతనూజ విశిఖాగ్నిం జాపి కాపాడుమా?

(కన్నుల లేఖనద్దుకొని) సఖీ! నీలేఖను నీవాక్యంబులను నిన్ను నాట పాటలనేని, యెన్నాళ్ళకేని మఱవఁగలనా ?

శా॥ దేహంబంతనువార్పిలఁ గీటకములెందేఁగందుచో నట్టి వ్యా
మోహాంభోధిమునింగిమించు జ్వాలనంబున్ బోలుసూనాస్త్రముల్
బాహాటోపము మీఱఁగంతుఁడు విడంబల్మారు ప్రాణంబు లీ
వాహానిల్వఁగలింగి చెల్లబల! గాఢాంబోధిలో మున్గవో॥

మనదాంపత్యంబునుఁ జూడలేక దుర్మార్గులెవ్వరో మదీయ కరంబుల శృంఖలంబిడ నిద్రమేల్కాని యెంతగానడలితివి! నీవగపుందలంచిన నిప్పటికి సహితము నాహృదయము వకావకలగుచున్నది. సఖీ!

ఉ॥ కేలఁగృపాణమూని తిలకింపగ లేకనునన్ను దుష్టభూ
పాలుమఱందిభూషణలఁ బల్కుచు ద్రుంపగఁ బూనదుర్వచో
జాలములన్వచించుచు విచారవిహీనుప్రయత్నమెల్ల ని
ర్మూలముఁ జేసినట్టి నినుపొల్తుకరో! మఱువంగ శక్యమే ?

ప్రేయసీ!

మ॥ కనుదోయిన్ స్రవియించి బాష్పములు త్వద్గండద్వయిం జొచ్చివే
చనుదోయింబడి చిట్టిముత్తెపుసరుల్ చందంబుఁ జూపింపఁగా
స్తనభారంబునఁ గాను నల్దిశలకున్ జవ్వాడనన్గాగిలిం
చి నిరూపించి వచింపలేక నెదియుంజింతించు నిన్నెంచెదన్॥

సతీలలామా! నాకతంబున నీవుగూడ కష్టముల పాల్పడితివిగదా? ఈ వియోగంబును సహించుటెట్లు. ఛీ! నేనొక్క కాంతామణిఁ గూర్చి సంసార పారావారంబునఁ జిక్కి యబలవోలె దుఃఖింపఁ బాడియా? ప్రపంచానుభవజ్ఞులగు మానులెల్లరు మోహంబతినీచమనియు నందు జిక్కఁదగదనియు ఘంటాపథంబుగ వక్కాణించుచుండ నేనందుఁ జిక్కఁ బాడియా (ఆలోచించి) నోటికి వచ్చినటులఁ బలుకు వాక్యంబు లాచరణమందుంచుట కష్టముగదా? మావంటి వియోగుల నూఱటఁ బొందించుటకై యిటుల మోహమతినీచమని భట్టులచందంబున నుపన్యసింతురే కాని మానులు దాముసహితము కాంతల వలలం జిక్కి వియోగానలంబునఁ గృశించుటలేదా? అయ్యో! ఈ చలువఱేఁడు తన వేఁడి కిరణంబుల వెలువడి నామేను నెంతగా దహింపుచున్నవాఁడు. ఓరీ! పాంథద్రోహీ.

చ॥ గురుసతి మానముం గొనిన కూళవు, శంభుశిరంబు నెక్కు పా
మఱుఁడవు, కల్వరాసుతులమారుఁడవు స్గరుణావిహీన దు
శ్చరిత తురుష్క దైవమవు, శాతభుజంగవిరోధివి, న్నిశా
చరుఁడవునైన రేవెలుఁగ! సౌమ్యుల నేచుట నీకు వింతయే?

సీ॥ శిష్యుండవని చెంతఁ జేర్ప విద్యను నేర్పి
గురువు భార్యనుఁ గేళిఁ గూడినావు
తోఁబుట్టితంచు గారాబమునం జూడ
చెలియలింటికి నెగ్గు సేసినావు
చలువఱేఁడంచునుఁ దలఁచి నెత్తినిఁ జేర్ప

హాళునిఁదాకఁగ నల్లునంపినావు
తన్నుఁగనినయట్టి తండ్రినాఁడలఁపక
జలధికి భంగముల్గొలిపినావు
తే॥గీ॥ జారచోరులకుంగడు సాయమౌచు
సత్కులంబుల కెగ్గును సలిపినాఁడ
విట్టినీకు సద్గుణమింక నెట్టులబ్బు
శమితదిక్పాలధామ! యోచందమామ!

మేనమామ నండఁగొని యీ పూవిల్తుఁడెంత మేరమీరు చున్నాఁడు ఓరీ! పరసతీ మానాపహారా!

చ॥ జగతికిఁదల్లిదండ్రులగు శౌరికిలచ్చికిఁబుట్టి వారివౌ
సుగుణములన్ని బాపఁగనుఁజూచుటపాడియె నీచ మమ్ములం
దగునె నిజంబుగాఁ జెఱుకునన్గనియించెదు వెన్నవోలె న
మ్మగువకుఁబుట్టినాడవుసుమా! యిటులెంతయునిర్దయుండవై॥

(తెరలో కో. కో! యని కోయిలగూయును.)

యజమానునండఁగొని యీకోకిల మూకలు నన్నెంత యాగడమొన రించుచున్నవి. ఔను తమనాయకుఁడె క్రూరకృత్యంబులకొడిఁగట్ట వీటికి జ్ఞానముండునా? ఓసీ! పరభృతమా.

క॥ పలుగాకి మూకలందున
నొలఁగుచుఁజిననాఁటినుండి మెక్కుచుఁ జివురా
కులవిలు లేకనుఁ దిరుగుచుఁ
దులఁవననవిల్తుఁ గూడితో మము నేచన్॥

హా! అవంతసుందరీ! (మూర్ఛిలి కొంత సేపటికిఁదెప్పరిలి.) అబ్బా! నేటికి రెండుమాసములైన నద్దురాత్ముఁడు చండవర్మ యాహారపానీయంబుల నిసుమంతయేని యొసఁగమి నెరులనడంగిన యీ మాతంగద త్తరత్నమణి ప్రభావంబునఁగదా యాకలి దప్పియు లేక జీవించియుంటిని. (ప్రక్కకుఁజూచి) అప్పుడే తెల్లవారినటులున్నది. నేటిరేయి

వియోగంబున నేటికేయియేయననేల! ఎల్లప్పుడు నొకనిముసమైన నిద్రించియెఱుంగని నాకన్నులెంత మంటగనున్నవి. ఈ సహస్రకిరణుఁడు నానయనంబులవలెనే యెఱ్ఱగాఁ బ్రకాశించుచున్నాఁడు. ఎట్టి సువంశమున నుద్భవించిన నెట్టిసత్ప్రవర్తనంబున వర్తించినను విధివ్రాఁత తప్పదుకదా!

సీ॥ కడునీచమాకాటి కావలిఁగాయఁడే
సత్యహరిశ్చంద్ర చక్రవర్తి
సాటిభూపాలకు సరసవంటలుసల్పి
బ్రతుకఁడే నలమహారాజమౌళి
వానరావళి సహవాసంబుసేయఁడే
శ్రీరఘురామ రాట్ఛేఖరుండు,
కొన్నాళ్ళుమత్స్యదేశు కొలువుసేయఁగలేదె
పాండురాజ తనూజపంచకంబు

తే॥గీ॥ అటులె యీనాఁడు రాజవాహనుఁడుగూడ
పరనృపాల కారాగృహవాసియాచుఁ
గాలమెల్లనుఁ జింతతోఁగడుపవలసె
విధివిధానమెవ్వారుఁ దప్పింపలేమి॥

లేకలేక వరప్రభావంబునఁ గలిగిన ముద్దుబిడ్డఁడని క్రిందద్రింపక నెపుడు నల్లారు ముద్దుగాననుఁబెంచిన నాతలిదండ్రులు నాయీయవంతవిన్న నెంతఁ గుందుదురోకదా! పరిపంథియగు మాళవరాజుం గెలిచి మన రాజ్యంబునుఁజేకొని రావలసినదని నాహితులఁ బదుగురతో సైన్యంబొసఁగి సాగనంపిన మాళవరాజ సుతనవంతీసుందరిని మోహించి తదీయకారాగృహంబునఁజిక్కిన నాజీవితంబును విని తలిదండ్రులు దుఃఖితులటయే గాక శత్రురాజులచేజిక్కితినని నన్ను దూషించుచు నెంతచిన్నబుచ్చుకొందురో? అయ్యో! నాకతంబున మంత్రిసుతుఁడగు పుష్పోద్భవుండునుఁ దత్సతియు బంధపాలాది వణిజులును బంధనాలయ కష్టంబులొందుచు నెటులుండిరో? వారిందవిమీార నొక్కసారైనఁగాంచుటకు

నోచుకొననైతి నే? ఏజన్మంబున దంపతులఁ బాడలేక మగని కారాగృహమందుంచితినో నేఁడు నాకాయవస్థయే సిద్ధించినది. హా! అవంత సుందరీ! నీకెట్టి దుఃఖంబును సంభవింపఁజేసితిని. నీతలిదండ్రులకు సహితము హృదయభేద్యమౌ దుఃఖదవానలంబిడితినిగదా. నాయట్టి నీచుఁడెందైనఁగలడా? హితుల గూడి నిద్రించుచు నర్ధనిశీథిని మాతంగసహాయార్థమై పాతాళంబునకుఁజని పోఁడియు నేతెంచునటికిఁ జెల్లాచెదరైన నామిత్రులెప్పటికైన నాదుర్గతివిన్న నెంతఁగుందుదురో? నా సైన్యంబేమయ్యెనో? హా! మిత్రులారా! మీదర్శనంబింకదుస్తరము. జనయిత్రీజనకులారా! మీవగపుఁ బాపువారెవరు. ప్రేయసీ! నీవదనంబింకనేఁజూతునా? ఎండకన్నెఱుఁగని యతిసుకుమారియయ్యు నాకొఱకై పలుబాములంది యవంతీసుందరీ పాణిగ్రహణంబొనర్చి తుట్టతుది మాసుఖంబులనైనఁగాంచలేక బందిగంబునఁజిక్కిన యాసాధ్వీలలామ బాలచంద్రిక యెంతదురపిల్లుచున్నదో? నన్నేమనిదూఱుచున్నదో? నన్నేలదూఱును అతివివేకురాలైన యమ్మానిని విధివిధానంబని యెఱుంగదా? దూఱిన మాత్రంబున నాకుఁగలిగెడునష్టమేమి? వినరాని కర్ణకఠోరవాక్యంబులుచ్చరించిన చండవర్మ పలుకులకన్న నాపె పలుకులు ములుకులగునా. ఛీ! రాజవాహనా! ఎట్టిదుస్థితికిఁ బాలొచుంటివి ఇట్టి విపన్నులు లోకంబున నెందఱేనియుండిరి కాని నీవంటి యభాగ్యుఁడెందునునుండఁబోఁడు.

మ॥ జననంబొందితివీవు క్రూరమృగవాసంబైన కాంతారసీ
మను, జీవించితి కందమూలములతో, మైవార్చితిగడ్డిమె
త్తను, కారాగృహవాసివై సకలబాధల్ జెందితీనాటికో
తనువా ఇంకను నెట్టి కష్టములఁ జెందన్ ప్రాణముల్ నిల్పెదో?

జననీజనకుల వీడుట కష్టమై పదుగురహితుల నెడఁబాయుట కష్టతరమై, యవంతీసుందరీ వియోగము కష్టతమమై, నాయెడలెంత దహించుచున్నది! కన్యాంతఃపుర ద్రోహినగు నన్ను

ఖండింపక యీ చెఱసాలనుంచుట కిప్పటికైన నవంతీసుందరీ దృఢాలింగనా బాధీకృతుండనాదునేమోయని యించుక ప్రాణములపై నాశ గలుగుచున్నది. అయిననిందుఁజరించుట దుర్ఘటముగ నేయున్నది. వైరి రాజకుమారుఁడనని యెఱింగినచో నద్దురాత్ముఁడప్పుడే నన్ను వధించియుండునుగదా? ఈకష్టముల ననుభవించుటకే కాఁబోలు నాకన్నియు నొకదానికొకటి సంబంధమగుచున్నవి.

సీ॥ మాళవాధీశు సమరభూమినిజయింప
నేతేఁరియట నివసింపనేల
వసియించితినిపో ననుసహాయమహామంచు
భూసురుండటుగొని పోవనేలఁ
గొనిపోయెపో మిత్రకోటినేనచ్చడి
దాఁకనిలువకెందొ తరలనేల
తరలిరిపో నన్ బ్రథమమందుబుపుష్పోద్భ
వామాత్యుఁడయ్యెడ నరయనేల
తే॥గీ॥ నగసెపో మాళవాధీశు నాత్మజభువ
నైకసుందరి యంచువచింపనేలఁ
జెప్పినంతనే నీపురిఁజేరనేలఁ
జేరి యాచానఁగని కీడుఁజెందనేల?

ఇంతవఱకు నావర్తమానమేమియుం దెలియరామి నాజననియెంత దుఃఖించుచున్నదో? నాకు శనివలె యీ చండవర్మ దాపరింపవలయునా? హా! విధీ? నీవైరమెంతయు వర్ణనాతీతము (చేతులనున్న సంకెలయూడి సురతమంజరీనామ దేవతాస్త్రీయై నిలుచును.) (తనలో) ఆహా! ఇదియేమి! జలధరాంతర్గతంబై వెలుఁగు విద్యుల్లతా ప్రకాశంబువోలె నంధకారబంధురంబగు నీబంధనాలయంబున నెద్దియో ప్రకాశిల్లుచున్నది. కారణమేమైయుండును? ఓహో పదునార్వన్నె పసిండితీవవోలె మెఱయు నీజవ్వనితనూకాంతియై యుండవలయును. ఈపె యీబంధనాలయంబున కెటుల రాఁగలిగెను. ఇదియేమి?

నాకరంబుల నింతఁ దనుకనున్న శృంఖలము లేదే? ఇది యదృశ్యంబు కాఁగత మేమి? ఇదియంతయు మాయగానున్నది. స్వప్నావస్థయా! ఏమి? ఈవిచిత్రము. ప్రథమంబున శృంఖలబద్ధుండ నెటులైతినో యటులే యిప్పుడు విముక్తుండను గూడ నైతిని కాబోలు దైవవిధానం బెంతయు వర్ణనాతీతము గదా? ఈపె నాతో సంభాషింపనే తెంచిన విషయం బేమైయుండును? కారాగృహబద్ధుండనగు నాతో నీపెకుఁ గావలయును ప్రకృతి యేమైయుండును? కాదు. కాదు. దురదృష్టవంతుం డనగు నన్నుఁ గాపాడ నేతెంచిన భవానియో కరుణాసాంద్రుండగు నమ్మహావిష్ణుపత్నియగు నిందిరామాతయో లేక భాషాయోషయో యయియుండవలయును. ఎవ్వరని నిర్ణయింపఁగలను. దేవతావిభూతియైయుండునా? దేవతావధూటియే గాకున్న సింహపరాక్రములగు యోధవరులచేఁ గాపాడఁబడు నీకారాగృహంబున కెటులు రాఁగలుఁగును. ఏద్వారంబుఁ దెఱువఁబడలేదే! నేనిటుల డోలాందోళనమానసుండనై విచారింపనేల? కరుణావంతురాలగు నీమెనే ప్రార్థించెదను. (నమస్కరించి ప్రకాశముగా) అమ్మా!

సీ॥ భక్తునోమెడు కృపావతి వౌట నన్నుఁగా
పాడగా దిగిన శర్వాణివేమొ
ఆర్తనినాదంబు నాలించి నన్నావ
నేతెంచిన త్రిజగన్మాతవేమో
ఆపన్నుఁడౌ వీని నాదరింపఁగఁ బూని
యరుదేతెంచినట్టి వాక్తరుణివేమొ
విలపించుచున్న నన్వీక్షించి బ్రోవ నే
తెంచిన యాశచీదేవివేమొ

తే॥గీ॥ గరుడకామినీమణివో, కింపురుషసతివో,
యక్షకన్యవో, విద్యాధరాంగనవొకో,
దేవతాకన్యవో, వేగఁ దెలుపుమను
సద్దయం జెంది నానమస్కారమంది॥

సురతమంజరి—రాజనందనా! మహనీయులయూహలు రిత్తలగునా? తాము తుదవాక్రుచ్చినటులు దేవతాకన్యనేగాని తదితరాంగనను గాను. నాయెడ దయార్ద్రహృదయుఁడవై నేవచియించు కథనాలించి నేఁజేయనున్న మేలుఁబాటింపుము.

రాజ—తల్లీ! లోకంబున మేలుసేయనెంచువారి నిరసించుమూఢులు గూడఁగలరా? అమ్మా! తమనామధేయమేమి?

సురత—నన్ను సురతమంజరియని వ్యవహరింతురు. నేను సోమరశ్మి యను వేల్పుటింతియనుంగుకూతురను. ఏనొకనాఁడు గగనమార్గంబున దేవయానంబునధిష్ఠించి సురలోక ప్రయాణోన్ముఖురాలనై యేగుచు నీక్షణమధుకరాంచితమైన నావదనంబును జలజలప్రసూనంబుగా భావించినయొక హంసాంగనచేఁ బట్టువడితి.

రాజ—అయ్యో! తదీయ చంచుపుటఘాతంబున నీవదనంబెంత నొచ్చెనో కదా! తరువాత.

సురత—అంతనేను భీతచేతస్కరాలనై రభసంబున ముక్తాహారంబులు జలింపనదల్చిన నందొక ముత్తియంపురసంబు భిన్నగుణమై జారి దైవయోగంబునఁ దపోనిష్ఠాగరిష్ఠుండై జలిమలమాఁదస విలంబమున నొక్కకాలను గెలంకున మునిఁగిలేచు మార్కండేయ మునీంద్రశీర్షంబున మహాప్రకాశము నదల్పుచుంబడియె.

రాజ—అక్కటా! ఎంతతప్పుఁబనిఁగావించితివి. దీనికత్తపసి గెరలియేమైననననా?

సురత—అంత నాజడదారి రోషకషాయ నయనయుగళుండై కన్నుల లగ్నికణంబులురియఁ గ్రోధావేశంబుననింగినున్న నన్నుంగాంచి "ఓసీ! పాపిష్ఠురాలా! నాతపంబుఁ జెఱుపనిట్టి కూరకార్య

బుఁగావించితివి కావున చేతనారహితంబైన లోహజాతివై పడియుండు" మని శపియించె.

రాజ—ఎట్టివారికైన విధివ్రాత దుర్లంఘ్యముగదా?

సురత—అంత నేను దైన్యంబుగదుర ధరణీతలంబునకుడిగ్గి యమ్ముని పాదంబులఁబడి నిజవృత్తాంతం బెఱింగించి శాపవిమోచనంబునకై వివిధప్రకారంబులఁ బ్రార్థించిన వెండియుఁ గరుణార్ద్రాంతరంగుండై త్వదీయ కరపద్మంబుల మాసద్వయంబు రజతశృంఖలంబై యుండి పదంపడి ప్రకృతినొందునటులఁగరుణించె. ఇట్టి పెనుదోసంపుకతంబున నద్ధరాతలంబున వెండిసంకెలనై పడియుండిని.

రాజ—శృంఖలాకారిణివగు నీవు నాకరంబుల కెటు బంధింపఁబడితివి?

సురత—తెలిపెద. సావధానుఁడవై యాలింపుము. ఇక్ష్వాకవంశజుండును వేగవంత పౌత్రుండును మానసవేగుతనయుండునునగు వీరశేఖరుండను విద్యాధరుండు జనకు నిమిత్తంబునఁ దనతో వైరంబులఁ బాటించిన విద్యాధరచక్రవర్తియగు నరవాహనదత్తునంకు విరసాశయుండై యాతని నెట్టులైన నొంపఁదలఁచి యేకపింగాచలంబునఁ దపోనిష్ఠనున్న దర్పసారస్నేహమువలంబించిన తన కార్యంబు నెఱవేఱఁగలదని యోచించి యాతనిఁ జేరె. అంత రాజర్షియుఁ దగువిధంబుల సన్మానించి యాతని కభయంబొసంగి ప్రసంగాంతరంబున నొక్కయెడఁ దనసోదరియగు నవంతిసుందరిని వివాహంబొనరింతునని వచించె అంతవాని వాక్యంబుల విశ్వసించి విద్యాధరుఁడొక దివసంబునఁ గైరవమిత్ర కరవ్రాత పరిపాండురంబైన యంబరంబునఁ ద్రిమ్మరుచుఁ దనకేలసంబునఁ దరితీపుఁగొలుపు సుందరియగు నవంతిసుందరిదలంపురా వివశేంద్రియుఁడై తత్కన్యం జూడ బయలుదేరి మార్గ

మధ్యంబున శృంఖలాకారంబునఁ బడియున్న నన్ను స్వీకరించి తత్కన్యాంతఃపురంబునఁ జొచ్చి తిరస్కరిణీ విద్యాప్రభావంబున నొరుల కెఱుంగరాకదిరుగుచు దృఢపరిష్వంగ బంధీకృతులు నన్యోన్యాధరపీడితులును స్యందత్ఘర్మబిందు సందోహగాత్రులును దృఢరత్యుత్సాహులునై యున్న మిమ్ముఁగని కోపోద్దీపిత మానసుండై నీయనుభానంబున వేఱొక కూరకార్యంబుగావింప శక్తుండుగాక మీరిరువురనన్యోన్యాలింగనగాత్రులై నిద్రించుతఱి దైవదత్తోత్సాహుండై రజత శృంఖలాకారంబుననున్న నన్నుఁ ద్వదీయ కరంబులఁ దగిలించిచనియె.

రాజ—ఎట్టి మహనీయుసకైనను క్రోధావేశంబున యుక్తాయుక్తంబులు పొడఁగట్టవుగదా!

సురత—ఇప్పుడా మునీంద్ర శాపంబు దీరినకతంబున మనకిరువురకును మేలయ్యెను.

రాజ—ఓ దేవతాలలామా! దివ్యజ్ఞాన సంభూతురాలవగు నీకుఁ ద్రికాలంబులఁ దెలియని విషయంబులుండవు. కావున నాకీవిషయం బెఱింగింపుము. నేనీజన్మంబున నేయకార్యంబు నొనరించి యెఱుంగనట్టిచో నాకీపరిపంథి కారాగృహావాసంబును శృంఖల బంధంబును నేలసంభవించెను.

సురత—దేవా! ఆలింపుము. తొల్లికాంబుండను ధరాధినాథుఁడు భార్యాసహితంబుగ నంతఃపురోద్యానవనంబుల విహరణ క్రీడలఁగావింప నేతెంచి జలకేళ్యోత్సాహుండై యొక కమలాకరంబునుడాసి చెంగలునపిండుల దండను సుఖనిద్రంగూడి యున్న నొక్కరాయంచంబట్టి బిసతంతువులఁ దదీయ చరణ ద్వంద్వంబున బంధించి కొంతదనుక కరుణార్ద్రహృదయుండై యీషదంకురితగండయుగళుండగుచుఁ దనహృదయేశ్వరింజీరి "కాంతామణీ! ఈ యందపుటంచ నాచే సందానితంబై మానిచందంబునొందె. ఇంకదీని యిచ్చవచ్చిన తెఱంగున

బోవుఁగాక యని విడువ నా రాజహంసం బాపరాని కోపతాపం బునఁ గనలుచు "నోపాపపుపుడమితేఁడా! నైష్ఠికుండనగు నేను మృణాలఖండంబుల ననుష్ఠానపరుండనై యూర్పునడిపి యంగంబులఁగుదియించి తలంపునెటుఁబోనీక యాత్మైకనిష్ఠఁ బరమానందాబ్ధి నోలలాడుచుండ రాజ్యమదంబున నిష్కారణంబుగ నన్నవమానించితివి. కాన నీదోసంబునకు ఫలంబు గాంతావియోగసంతాపంబునఁబొమ్మని శపింప నప్పుడమితేఁడు మోమున విషాదంబుదోఁప నారాయంచకుఁ బ్రణమిల్లి దైన్యంబుగదుర నజ్ఞానంబునఁజేసిన తప్పుసైరింపుమని ప్రార్థింపనయ్యది శాంతించి "నావచనంబులు రిత్తవోయిన నీజన్మను లభింపక ముందుజన్మంబున ముహూర్తద్వయంబు నన్ను బంధించిన కతంబున మాసద్వయంబు రజత శృంఖలబద్ధుండవై పరిపంథికారాగృహంబున విరహదుఃఖంబంది పెద్దకాలంబు రాజ్యంచేలెదవని యరిగె. ఆశాంబుఁడవేనీవు. తద్భార్యయే యవంతిసుందరి. కావున నీవిధంబున నీకీయవస్థఘటిల్లె. దానికై వగపకుము. నిన్నీబంధనాలయంబుననుండి విడచెద. నీవిప్పుడేగి యీశిబిరప్రాంతసమీపంబున ననిష్టురాలగు నంబాలికఁ బరిణయమాడనున్న చండవర్మనుదునుమాడి యవంతి పురంబునకేగి నీప్రేయసిఁగలిసికొనుము.

రాజ__తల్లీ! అటుల నేగావించెదను కాని నీవిప్పుడరిగి విరహార్తినున్న నాప్రేయసి కీవర్తమానమెఱింగింపుము. ఈద్వారంబు దెఱువఁబడుటెట్లు.

సురత__ఓయీ! అమాయికుఁడా! గాంధర్వ విద్యానైపుణ్యరాలనగు నాకు సాధ్యంబుగాని కార్యంబులుండునా? కారాగృహ రక్షకులపై మచ్చుఁజల్లి తాళపుంజెవిఁగొనివచ్చి యీ ద్వారబంధంబుఁదెఱచి నిన్నువిడిచెద. క్షణమోర్వుము.

రాజ__ముందునీవెటులేగఁగలవు.

సురత—నాకేమి. ఏ క్రిమిరూపంబుననైన పగఁగలను. (నిష్క్రమించును)

రాజ—ఘడియకేమి రానున్నదో యెఱుంగనశక్యముగదా? పూర్వజన్మకృతపాప ఫలంబనుభవింపకఁదీరదనుట నిశ్చయము. విద్యాధరమాయయేగాకున్న మాశయన మందిరంబునుఁజొచ్చి ఎవ్వఁడిట్టి కార్యంబున కొడిఁగట్టఁగలఁడు. ఈమె కరుణాకటాక్షంబునఁగదా నేఁటికి బంధనాలయ విమోచనంబౌనఁగూడినది. ఈమెయొనర్చిన యుపకృతి నెట్లుమఱువఁగలను. ప్రత్యుపకార మెటులఁగావింపఁగలము.

సురత—(తాళముఁదీసి తలుపుఁదెఱచి) దేవా! ఇటుదయచేయుఁడు తమకొక్క దుఃఖవార్త నెఱింగింపవలసి వచ్చినందులకు క్షమింపుఁడు.

రాజ—నిశ్చింతగా నెఱింగింపుము. నాజీవితమెల్లను దుఃఖవార్తా శ్రవణంబేకదా?

సురత—రాకుమారా! సహజ శౌర్యవంతుఁడవగు నీకేమియు నిక్కట్టులుండవుకాని యేకపింగాచలంబునఁ దపోనిష్ఠనున్న యప్పుడ మితేఁడగు దర్పసారుఁడు

శా॥ పంపెన్ వార్తను చండవర్మనకు భూపా! నీదుశీర్షంబు ఛే
దింపంగావలెనంచు దేహమునునిందేఁగోసి మాంసంబు వే
యింపంగావలె నెల్లపక్షులకటం చిల్లాలిబాధంబుతో
నుంపంగావలెనంచు సేయఁగనితండొప్పెన్నుమీయట్టులన్॥

రాజ—హా! ప్రేయసీ! (మూర్ఛిల్లి సురతమంజరి యుపకృతింజేయఁ దెప్పరిల్లి) హా! అవంతిసుందరీ! నాదేహంబుననున్న పలలంబెల్ల ఖండఖండములుగావించి పతగతతులకెఱఁగవైచినఁ జంతింపను గాని యంధకారబంధురంబగు బంధనాలయంబున నిన్నుంపఁగడంగినందులకెంతయు దురపిల్లెద. సతీ! నాకును నీకు

నీనాటితో ఋణముదీరినదికాబోలును. నీవు కారాగృహం
బున బంధింపఁబడియుండ బంధనాలయ రక్షకులే తెంచి

మ॥ శిరముం ద్రుంచియు నాదుమాంసమును పక్షిశ్రేణికిన్ మేతవై
చిరటంచున్ వచియింపఁబై కెగయు నీజీవంబులచ్చోటఁ బ్ర
స్తరసంఘట్టనమందువ్రాలఁగ భవచ్ఛారీరమందెల్లచే
కురగాయంబులు, గాచువారలెవరో కో నిన్నటన్ మానినీ!

ఛీ! నేనెంతటికౄరుఁడను. అమ్మా! దేవతాలలామా! నీవింకనరు
గుము నేనిప్పుడే ప్రాణములవీడెద. ఆతుచ్ఛునిచేతిలో మృతినొందు
టకన్న నాత్మహత్యయే యుత్తమము.

సీ॥ పుత్రమోహంబు సంపూర్తియాయెనుమీకుఁ
గనిపెంచిన జననీజనకులార!
సహవాసినింగాంచఁ జాలరుమీరింక
సహపాఠులౌ హితజనములార!
సేనాధినాథు వీక్షింగాలేరింక
నాహవస్థలసైనికాళులార!
యజమానుజాడ మీరారయలేరింక
కరిసైంధవాండ జగణములార!

తే॥గీ॥ నాదుదర్శనమింక నీనాటితోడ
సాంతమె, యవంతిసుందరీ సాధ్వినీకు
దైవమా! మమ్ముసాధించి ధన్యుఁడైన
వాఁడవొకఁడవే సంతోషపడుమునీవు॥

నామిత్రుండగు పుష్పోద్భవుని గతియేమాయెనో? వీరందఱి కష్టంబులఁ
జూచుచుండుటకన్న మృతినొందుటయె శ్రేయస్కరము.

సురత—ఓయీ! అవివేకీ! మేలుఁజేయుచుండఁగ కీడుఁదెచ్చుకొనునటు లున్నావె విముక్తుండవైన నీవుదప్పక పోక ప్రాణములేల వీడ నెంచెదవు.

రాజ—అమ్మా! ప్రచండ యోధవరపరివేష్టితంబైన యీ కారాగృహంబును దాటుటెట్లు.

సురత—రాజా! మద్వార్తకతంబున నీమనంబు గలఁతనొంద నిట్టుల నీచవాక్యంబులాడుచుంటివని యూహించెద లేనిచో శౌర్యవంతుండవగు నీనోట నిట్టి పాఱఁబోతువాక్యములు రాఁగలవా? నేనిదివఱకు వచియించియున్నటుల నందఱు స్మృతిఁ దప్పియున్నవారు. నీవీ భూసురవేషంబును మార్చికొని యోధవర వేషధారివై వైవాహికసభాంగణంబునకేగి పగతురన్నిర్జింపుము.

రాజ—అమ్మా! నాయవినీతికి క్షమియింపుము. తల్లీ! నామదన సామ్రాజ్యలక్ష్మియగు నవంతిసుందరి బంధనాలయంబునఁ గుంద నేఁదప్పుకొనిపోయి వైరిఁగూల్చిన నేమిలాభము. ప్రేయసీ! నాఁడు కారాగృహ ప్రవేశకాలంబున నాత్మహత్యఁ గావించుకొనఁబోవు నిన్ను వారించినది కష్టంబులనొందఁ జేయుటకే కాఁబోలు.

సురత—రాకుమారా! నీప్రేయసికై దుఃఖింపకుము. ఆపె సుఖంబుగాఁ గాపాడు భారమునాయది నిన్ను రాజసభకుఁ గొనిపోవచ్చిన చారులపై మచ్చుంజల్లి మోసపెట్టి యీతాళపుచెవులఁగొనివచ్చి నిన్విడిపించితి. తదుపరి నీప్రేయసి సంగతి విచారింపవచ్చును. నేఁటికి నేఁజెప్పినటులఁ గావింపుము. ముందిందుండి బయలువెడలుము. (రాజవాహనునిఁ బైటకు లాఁగి) ఈ వేషంబుననున్న నపాయము రాఁగలదు జాగ్రతగాఁ బ్రవర్తింపుము

రాజ—తల్లీ! నీయభీష్టానుసారమే ప్రవర్తించెద. కరుణింపుము. (నమస్కరించి సురతమంజరితోఁగూడ నిష్క్రమించెను.)

[ద్వితీయ రంగము — చంపానగరమున వివాహమంటప ప్రాంతము దంతావళమధిష్ఠించి కృపాణపాణియైన రాజవాహనుఁడు ప్రవేశించును]

రాజ —

మ॥ అరరే! నిల్వుఁడు, రాజవాహనుని బాహాశౌర్యసంగ్రామ దు
ర్ధరనైపుణ్యమహావిజృంభణము శూరత్వంబు వీక్షింపనే
ర్తురు భూదేవుఁడొ క్షాత్రవంశఘనపాథోరాశి పూర్ణేందుఁడో
పరికింపంగలవారువీని క్షణమధ్యామర్ధముం జేయుచో॥

ఓరోరీ! మదాంధులారా! పరిపంథులార! సంగరరంగంబున వైరివీరులఁగాంచి భయోత్పాతంబునఁ బారు మీజీవంబులేల? ఛీ. ఛీ! ఏమొగంబున సంగ్రామ విద్యానైపుణ్యంబునను దోర్వీర్యప్రతాపుండునగు నీరాజవాహన క్షత్రియకులాభరణుఁదాక నెంచెదరు. ప్రాణంబులపై నాశగలదేని శరణుఁజొచ్చుఁడు లేదేని మిమ్ముల నందఱినిప్పుడే మదీయాకుంఠ హేతిపాతంబునను ధనుర్జ్యావిముక్త నారాచంబులను శమనపురికంపెదఁగాచుకొనుఁడు. ఛీ! పిచ్చుకపై బ్రహ్మాస్త్రమనునటులఁ బిఱికిపందలగు మీపైననా నాశౌర్యముఁజూపించుట. ఓరోరి! యహితులార!

మ॥ కలుషాత్ముండు, వినూత్నదంపతుల గిన్కంజూచు మూఢుండు, రా
ట్కులపాథోధికృశానుకల్పుఁడు, జడుండున్, చండవర్మాఖ్యుఁడో
ఖలునింగూల్పఁగ నేనుగాని మిమునున్ ఖండింపగా నేల దో
ర్బలముంజూపగ నోర్వువారిపయి జూపంగావలెన్ శౌర్యమున్॥

కావున మీరింక సమరవిముఖులయి మీతేనింజూపుఁడు క్షాత్రవుల తోఁడ మీకుఁగూడ కష్టంబులకుఁగంటగలవు (తనలో) ఇదియేమి. వివాహ మహోత్సవ మవలోకింప నేతెంచిన సైన్యసందోహంబెల్ల నాయుధపాణులై యెవరినో దాకుచున్న వారలు అబ్బబ్బా! సైన్యమెంత పుడమింగూలినది.

సీ॥ మస్తకంబులఁ బాసి ప్రస్తరంబులచెంత
వ్రాలినకాయంపు వరుసతోడ
బాహువుల్దెగిజాఱఁ బ్రాణములోర్వక
బాధనొందుచుమూల్గు ప్రాణితోడ
కరవాలములమత్త కరికరంబులువోవఁ
గూలినదేహంపు గుములుతోడ
స్యందనంబులతోడ హయసంఘములఁద్రుంప
కొండలవలెనున్న గుంపుతోడ

తే॥గీ॥ చండభండననిపుణోగ్ర శత్రుమకుట
రత్ననిగనిగచ్ఛాయలఁ రంజిలంగ
నతిశితకృపాణములును భయంబుదోప
రక్తవాహినితోనిండె రంగభూమి॥

ఓహో! వివాహవేదిక రణవేదికయైనటులున్నది. అనిష్టురాలగు పరస్త్రీని కామించి బలాత్కృతి వివాహమాడనెంచిన దుష్టుండగు చండవర్మని దుర్ణయమే యీరీతి ఫలించియుండును. (ప్రక్కకుఁజూచి) అదియేమి? వివాహవేదికపై సకలవస్తు భూషణాంబరధారియైన యొక వ్యక్తి మస్తకరహితంబై గళంబుననుండి రుధిరప్రవాహంబులు బయలు వెడల ధరణీతలంబునఁబడియున్నది. అతఁడెవ్వఁడై యుండును. అదిగో! అయ్యెడనే పుచ్చడీకతనంబుతోఁగూడిన భయోత్పాతంబున నవనత ముఖయై యొకయబలగానవచ్చెడి. ఆపెయే యంబాలికయైయుండును. శీర్షచ్ఛేదనంబై పడియున్న దురాత్ముఁడే చండవర్మ కాబోలును స్త్రీలోలత్వంబున వృద్ధిజెందినవారలుగలరా! ఈతని యమపురికంపిన సాహసుండెవ్వఁడై యుండును. వీరినే ప్రశ్నించెద.

ఉ॥ ఓరిపుసేనలార! సముదోద్ధతి నన్యసతీమణిన్ బలా
త్కారముతోఁ జేకొనఁగఁదా జతనంబునొనర్చె నేఁడు దు
ర్వారమతిం బెనంగు తమరాజును గూల్చినవాఁడెవఁడో ని
ర్ధారణఁజేసి చెప్పనెడ దండనఁజేయఁగబోను మిమ్ములన్॥

వేగ నెఱింగింపుఁడు లేకున్న మీఱేనికి సంభవించిన దురవస్థయే మీకును సంభవింపఁగలదు. (తెరలో)

దేవా! అంబాలికామనోహరుండగు నొకక్షత్రియ యోధుఁడేతెంచి నీవివాహంబునుఁగాంచలేక రోషకషాయనేత్రుండయి క్రోధజ్వాలలు మోమునఁదాండవమాడ సైన్యంబున మున్నె దాఁగియుండి మాంగల్యధారణ సమయంబున హేతిపాతంబున నొక్కక్షణంబులో నీదుష్టుని శిరంబునుఁగూల్చె. తత్కారణంబున మాసైన్యం బాతనిపైఁగవిసి రణంబొనర్చుచుండె. ఆసంగరాంతంబునందుఁ దురగారూఢుండగు నాతఁడే చండవర్మ శీర్షఖండన హేతుభూతుఁడు.

రాజ— ఆ మహనీయుఁడా! యీతనిఁదునుమాడినది. ఔరా! లోకంబున నెట్టి యుద్ధవిద్యానిపుణులగు యోధవరులుండిరి. అట్టివాని చెల్మిఁగావింపకున్న నాజన్మమేల?

ఉ॥ మానవజన్మమందు నొకమానిసి సల్పఁగలేనిరీతి నే
నానివహంబుఁజొచ్చి కదనంబొనరించెడు నమ్మహామహుం
డేనరుఁడో, దురాత్ముఁగుటిలేక్షణుఁ గ్రూరునిచండవర్మ భూ
జానివధించినట్టి విలసద్భుజశౌర్యుఁడు వాఁడుతుల్యుఁడే?

మ॥ సురవిద్యాధరసిద్ధకింపురుష సంస్తోమంబులంగూడ సం
గరరంగంబునఁ గెల్వఁగాఁగలఁడు వేగన్మత్సహాయార్థమై
యరుదేరంగరిపై నాతఁడు స్వశౌర్యంబుం జవింజూడ నే
స్తురుప్రత్యర్థులనన్నుఁ దాఁకఁదుదిఁ జెందున్ ఘోరసంగ్రామమున్

అపహారవర్మ— (ప్రవేశించి) దేవా! నమస్కారములు. (నమస్కరించును)

రాజ— (అంగుష్ఠాంబాది శిరఃపర్యంతము వీక్షించి) అపహారవర్మా! నీవేనా! (చేనిచ్చి దంతావళమధిష్ఠింపఁ జేసి కూర్చుండఁబెట్టును)

అప— నేఁడుగదా సుదినము. మిత్రమా నాటి యర్ధరాత్రంబున మమ్ము విడనాడిపోయి యిప్పటివఱకెచ్చటనుంటివి? మనహితులేరీ?

రాజ—మాతంగనామ భూసురసహాయార్థమైమిమ్ముల విడనాడిపోయి ప్రథమంబున సోమదత్తుంగలిసి యనంతరము పుష్పోద్భవ సహితుండనై శాత్రవపట్టణంబగు నవంతికాపురంబునఁజొచ్చి తక్షీయాత్మజను మోహించి కొన్ని కష్టములపాలైతిని. ఇదియాంతయు సావధానంబుగా నెఱింగించెదను. ముందుమన హితులెచ్చటనున్నారో వచింపుము.

అప—మిత్రమా! నీవింకను బరీక్షింపనేలేదా? అంగదేశాధీసుండగు సింహవర్మ కుమార్తెయగు నంబాలికను మోహించి దుర్మార్గుండగు చండవర్మ రణంబునకుఁబోవు నాకు సాయంబొనరింపనే తెంచి యీసంగరంబున నేత్వదీయహితులున్నారువీక్షింపుము

సీ॥ శాత్రవసంగ శీర్షములందునుమాఁడు
నాతఁడే మాయుపహారవర్మ
కరిశీర్షంబులఁగందుక క్రీడఁగావించు
బలుఁడాతఁడే యర్థపాలశౌరి
స్యందనఘనసమూహంబుల వెసభిండి
వాలంబులంగూల్చు వాడెఁప్రమతి
రంగదుత్తుంగతురంగ గళంబులఁ
గూల్చునాతఁడె మిత్రగుప్తఘనుఁడు
తే॥గీ॥ మంత్రగుప్త, విశ్రుత, హితామాత్యవరులు
వారెసంగ్రామ పృథివినున్నారుచూడు
నాఁటిరేనిముఁబాసి యీనాఁటికిటుల
గాకతాళీయమట్టులు గలసినాము॥

రాజ—మిత్రమా! అపహారవర్మా! నేఁడుగదా సంతసింపఁదగినదినము' ఏలయన

సీ॥ నడిరేయినడవిలో నెడఁబాటుఁజెందిన
పదుగురుహితులు గన్పడిరినేఁడు

పరిపంథినగర సంప్రాప్త కారాగృహా
వాసకష్టంబులు వాసెనేఁడు
పూర్వజన్మోదితామోఘ మరాళశా
పవిమోచనంబు ప్రాప్తిమైనేఁడు
మాళవాధీశు నాత్మజవరియింపఁగాఁ
గలిగినసౌఖ్యంబు గలిగెనేఁడు

తే॥గీ॥ స్వైరవిహారణక్రీడల సలుపఁగలుగు
స్వేచ్ఛ వెండియునాకు లభించెనేఁడు
పూర్వకష్టంబులమఱచి పోతినేఁటి
కట్టినాభాగ్యమేమన నౌనుసఖుఁడ॥

అప—దేవా! ఇంక నీప్రథనస్థలిని విడనాడి మన వాసస్థలంబుల కేఁగుదమురండు. మన హితులందఱు నచ్చోటున కేతేరఁగలరు. భావికార్యాలోచనము కూడఁగాఁగలదు.

రాజ—మిత్రమా! ముందుమన మవంతికాపురంబున నాకతంబున చండవర్మనిచేఁ జెఱసాలనుంపఁబడిన బంధుపాలాది వణిజులను మన హితుండగు పుష్పోద్భవుని దత్ప్రియసియు మత్పరిణయంబు కతంబున శ్రమనొందిన సాధ్వీలలామయగు బాలచంద్రికను విడిపింప యత్నము గొనరింపవలయు.

అప—ఏమేమి? మన హితునిగూడ నద్దురాత్ముఁడు బాధనాలయమందుంచెనా? ఔరా! ఏమి? వీనిపోఁగాలము. "వినాశకాలే విపరీతబుద్ధి" యనుట నిజమాయెను.

రాజ—మిత్రమా! ఇంకొక్కటి. పాటలీపురంబున వామలోచనయను భార్యతోఁడఁగూడి యువరాజ్య సుఖమనుభవించు మనహితుని సోమదత్తునిఁ బిలిపింపవలయును.

అప—అటులే రమ్ముపోదము. (నిష్క్రమణము.)

పంచమాంకము సంపూర్ణము.

శ్రీ

రాజవాహనవిజయము.

షష్ఠాంకము.

[ప్రథమ రంగము—చంపానగరమందు నొక భవనము. ప్రవేశము: రాజవాహనాపహారవర్మ లింకఁగొందఱు.]

రాజ—మిత్రమా!

మ॥ వనసీమన్ ననుఁబాసిపోయిన హితవ్రాతావలోకంబు, త్వ
ద్ఘనసత్త్వైక వివాహశౌర్య నిపుణత్వప్రక్రియల్ కన్నుదో
యిని కర్ణద్వయి సమ్మదాబ్ధినిడె నాయిల్లాలియాలింగనం
బొనఁగూడన్ ముదమెట్టులుండునొమదిన్ యోచింపఁగాశక్యమే

లోకైక ప్రశంసనీయంబుగ రాజ్యసముపార్జనంబొనరించిన మీచరితాంశంబులెంతయు సంస్తవనీయంబులు. సోమదత్తుండును మీవలెనే ధీకౌశల్యంబున యువరాజ్యపట్టాభిషేకంబును రాచకన్యామణినొంది ప్రథమంబున నన్నుఁగలిసి తదీయచరితంబెల్ల నెఱింగించె. తదుపరి పుష్పోద్భవుఁడేతెంచి తా వరించిన బాలచంద్రిక చండవర్మానుజుండగు దారువర్మచే బలాత్కరింపఁబడి తన్నుడాయ బుద్ధిప్రభావంబునఁ దాను స్త్రీ వేషంబును ధరియించి యాతనిఁబోకార్చి యాపెను వివాహమాడి నన్నుఁగలిసి యవంతిసుందరీ పరిణయము గావింతుననికొనిపోయి వివిధమాయోపాయంబుల నట్టుగావించి దుర్ఘటంబగు బధనాలయంబున బంధింపఁబడియె. ఈ మీపునర్దర్శన లాభంబొనఁగూడినందుల కతఁడుగూడ నున్న నెంత సంతసమయ్యెడినోగదా?

అప—దేవా! ఏలవిచారించెదరు. అనుభవింపవలసిన కష్టంబులు దప్పునా కాని యద్దురాత్ముఁడు దన కంత్య కాలము దాపరించుటచేతనే మిమ్ములను కుటుంబ సహితముగ బంధుపాలాదుల నటులఁగావించె. వారిని విడిపింప నెద్దియైనయుపాయ మొండాలోచింపవలయు.

రాజ—అవును మిత్రమా! సోమదత్తామాత్య కుమారుండింకను రాలేదా?

అప—ఈసరికి వచ్చుచు నేయుండును.

రాజ—మిత్రులారా!

మ॥ పరిపంథీశుని మాళవేంద్రుఁ బరిభావంబందగాఁజేసి దు
ర్ధరదోర్వీర్యపటుత్వ సత్వనిపుణత్వప్రౌఢిమై ఘోరసం
గరమందామగధావనింగొన మహాకాంతారముంజొచ్చి యీ
కరణిన్ వ్యర్థులమాచునుంటి మితగురుల్ గన్గొన్న నేమందురో॥

కాని యొక్క కార్యాచరణంబున నంతగాదూషింపరని తోఁచుచున్నది యేమందురేని.

చ॥ పదుగురయొక్కరేయి నెడఁబాటునుఁజెంది, యనేకశాత్రవాం
బుదబలగర్వజృంభణ విమోచనపూర్ణసమీరులౌచు సం
పదసహితావనీశుల కుమారికలం గ్రహియించియుంట నె
య్యదొయొక కార్యలాభముగదాయని యాప్తులూరడిల్లనా

అప—అవును మాకునటులనే తోఁచుచున్నది.

రాజ—మిత్రులారా! మనమిప్పుడొనరింపవలసిన కార్యమేమి.

అప—రాకుమారా! శేముషీ విభవోపేతుండవగు నీకన్న మాకు దెలిసిన విషయములుగలవా? ఏదియో యడుగఁదలచి యడిగితిరి కాన నాకుఁదోచిన విధంబున నుడివెద నాలింపుడు. ప్రస్తు

తమే మన కార్యంబును సాధింప నెంచినను దగిన సైన్యసాధన సామగ్రి లవసరములు. కావున మన జన్మ స్థలంబునకేగి సేనానివహంబులఁగొని తేర మనలో నొకరేగవలయును.

రాజ—అపహారవర్మా! ఏమి నీవెట్టి మన స్వార్జితంబులగు నీ సేనాదళంబులుచాలవా?

అప—దేవా! అటులనకుఁడు. మన సైన్యంబులుకూడనున్న జయ ము సుకరంబుగదా?

రాజ—అవునటుల నేగావింతిము. ఇందెవ్వరీ కార్యభారమూనఁగలరు

అప—దేవా! ఎవ్వరుపూనఁగలరని ప్రశ్నింపనేల? తమరెవరిపై నీభారముంచినవారీ కార్యంబొనరించుటకు సంసిద్ధులైయున్నారు.

సేవకుఁడు—(ప్రవేశించి) దేవా! రాజహంస మహారాజుగారి నుండి సైన్యదళంబులతోడ వార్తాహారి యేతెంచి తమ దర్శనార్థమై హాజారంబున వేచియున్నాఁడు.

రాజ—సేవకా! నిరంకుశాధికారంబుగ లోనికిఁ బ్రవేశపెట్టుము.

సేవ—చిత్తము (నిష్క్రమణము.)

రాజ—మిత్రులారా! ప్రథమంబున నాయనగారి సందేశం బాలించి కార్యంబేదేని యొనరించుట యుక్తంబని భావించెద. దీని కే మందురు.

అప—దేవా! ఊహింపఁ దమకంటె మేమధికులమా?

రాజ—అటులనకుఁడు. పదుగురిమధ్య నూహింపఁబడిన కార్యమెట్టి దైనను నెఱవేఱుటలో సంశయముండదు.

(తెరలోఁ గలకలము)

రాజ—ఆకలకల స్వనము లేమి?

అవ—మన సేనా నివహంబులై యుండనోపును.

వార్తాహరి—(ప్రవేశించి) నిరంకుశాధికారా! రాజవాహనకుమారా! జోహారు. రాజహంస మహారాజుగారు లేఖాముఖంబునఁ దమకొక సందేశమంపియున్నారు. (ఉత్తరమిచ్చును.)

రాజ—(ఉత్తరమందికొని.) ఓరీ! వార్తాహరీ! మదీయ సంశయ నివారణముఁగావింపుము.

ఉ॥ ధీవినుతప్రకాశుఁడు సుధీవరుఁడౌ నలరాజహంస ధా
త్రీవిభుఁడందు సేమమె?

వార్తా—ఆ సేమముగ నేయున్నారు.

రాజ—ఉ॥........................సతీసుజనార్చిత పాదపద్మ సా
ధ్వీవరరత్నమా వసుమతీజననుత్రి సుఖంబె?

వార్తా—నిరంతర సుఖసంపత్తిఁ దులఁదూగు దేవి కన్యథా గలుగునా!

రాజ—ఉ॥.......................................సౌఖ్య సు
శ్రీ విభవోన్నతిన్ జనులు జీవితమెల్లనుఁ బుచ్చుచుండిరే?

వార్తా—అందఱును సౌఖ్యముగ నేయున్నారు. కాని,

వార్తా—ఏమిరా! కాని యనుచున్నావు. ఎవ్వరికేదేని యాపద తటస్థించినదా?

వార్తా—సతతమా శ్రీపతి పాదపద్మములఁ బూజించువారి కాపదలు తటస్థించునా?

రాజ—అటులయినచో నీవటులేల వచించితివి.

వార్తా—దేవా! ఆలింపుము. తామటుల నవకుమార పరివేష్టితు లరై కాంతార సీమాంతరంబున నొకే నిశీథమునఁ బరుండి యుండి యుదయమునఁ గానరాలేదని విన్నదాది వృద్ధరాజ దంపతులిరువురు దరిలేని దుఃఖసాగరంబున నేఁటివఱకును మునింగియున్నారు.

రాజ—పూజనీయులగు మాతాపితృ లిపుడెందున్నారు?

వార్తా—త్రికాలవేదియగు వామదేవమహర్షి యాశ్రమమునఁ గాల మెట్టులోఁబుచ్చుచు శల్యంబులై యున్నారు.

రాజ—అక్కటా! ఎంతటి కృత్యమాచరించితిని. వయస్యా! అః హారవర్మ పిత్రుహ స్తలిఖితమగు నీయుత్తరముజదువుము. (ఉ త్తరమునిచ్చును)

అప—(అందుకొని.) చిత్తము. ఆలింపుము.

"శ్రీరస్తు వామదేవాశ్రమ ప్రాంతమునుండి రాజహంస మహా రాజుగారు కుమార పరివేష్టితుండగు రాజవాహను జయలక్ష్మీవిరా జితుగాఁదీవించి వ్రాయు నాజ్ఞాపన పత్రిక".

రాజ—ఓయీ! దుఃఖసాగరనిమగ్నులై యున్న వారికి నేనీ చంపాపు రంబున కుమారపరివేష్టితుండనయియున్నటు లెటులుదెలియ వచ్చెను.

వార్తా—దేవా! నాకావిషయ మంతగాఁదెలియదు.

రాజ—సరియే. తరువాతఁ జదువుము. అదియే తెలియఁగలను. (లేఖఁజూచుచు)

అప—కుమారా! నాఁడు నీవటుల వృద్ధులమగు మాచెంతను పూజ నీయుండగు వామదేవమహర్షి చెంతను జయలక్ష్మీ శోభాన్వ

తుండవగు నటుల దీవింపఁబడి నవకుమార పరివేష్టితుండవయి సేనాసహితంబుగా బయలువెడలి యొక్క ఘోరారణ్య ప్రాంతంబున నొక్కరేయి పరివారంబుతో విడిసి సాయంసమయ కృత్యానంతరంబున నందొక్కస్థలంబున శయనించితిరఁట. తదుపరి యేమిజరిగినదో కాని యరుణోదయంబున ద్వదితర కుమారులు మేల్కాంచి నిన్నరయలేక నీవు సనినమార్గంబును గ్రహింపలేక విచారతరంగమాలికానిమగ్నులయి వృద్ధరాజ దంపతులఁగాంచిన రాజవాహన సహితంబుగ కీర్తినధూటికా పరిగ్రహణంబొనర్చి కాంచవలయును. లేదా! ఈ ఘోరారణ్యమే శరణ్యంబు సేనానివహంబు సేనాపతులతోడ వెనుకకంపి వివిధదేశ పరీక్షోత్సాహులై నిన్నుఁగనుఁగొన బయలువెడలిరట. ఇట్టి మాయవస్థను సేనాముఖంబున నాలకించి నేనుత్వజ్జనయిత్రియునొందిన దుఃఖంబింతింతయని తెలుపనశక్యము. అటుల కొంతదనుక విచారించి శరీరంబులఁ దొఱఁగనిశ్చయించికొని వామదేవమహర్షి పాలికింజని యీ వృత్తాంతంబెఱింగించి మృతినొందఁ దదీయవాసంబున కేగితిమి.

రాజ—అక్కటా! అవినీతుండనయి యెట్టికృత్యంబొనరింప సాహసించితిని.

అప—(మరల లేఖఁజూచుచు.) త్రికాలవేదియగు నమ్మునివరుండును నీవృత్తాంతంబును విని మరణోన్ముఖులముగాఁ బోవుమమ్మువారించి దివ్యదృష్టిని వృత్తాంతంబెల్లఁబరిశీలించి “ రాజా! నీకుమారుండు మాతంగాభిధాన భూసురసహాయార్థమై పాతాళంబున కరిగి సుఖుండై యున్నవాఁడు. తదీయ హితంబొనర్చి షోడశ మాసంబులకు కుమారపరివేష్టితుండై నినుఁగలియఁగలఁడు. అంతదనుక నిట్టికట్టడి కృత్యంబులకొడిఁగట్టక మేనప్రాణంబులనిలుపుఁడనివచించె. అమ్మునివాక్యంబులఁగల విశ్వాసమ్మున

నమ్మునికుటీరప్రాంతంబుననే నేటివఱకు జీవచ్ఛవంబులమై యున్నారము ".

రాజ—అమ్మునియే మావిషయం బెఱింగింపకున్న నీసరికి మాపితృదర్శనము పరలోకంబుననే గదా? తరువాత.

అప—(లేఖఁజూచుచు) గడుపుకాలంబు వఱకెట్టెటులో యోర్చి యిప్పటికి నీసుందర వదనారవిందావలోకనంబొనఁగూడమి మరల నమ్ముని సందర్శించి మావిచారం బెఱింగింప నమ్మునీంద్రుఁడు గృపాంతరంగుఁడై " నృపాలా! నీకుమారుండిప్పుడు వివాహసహిత రాజ్యాంచితుఁడైన కుమార పరివేష్టితుండై యంగదేశంబున చంపానగర సమీప యుద్ధరంగస్థల ప్రాంతంబుననున్నవాఁడు. నీసైన్యంబుల నిచ్చిపంపుము. నీవైరి గర్వభంగ మొనర్చి నీకామోదముం గావింపంగలఁడ " ని వచింప మేమిరువురము సంతోషితాంతరంగులమయి చమూదళంబులనెల్లఁ ద్వత్సహాయార్థము నీలేఖతోఁగూడఁ బంపియున్నారము. కావున నీవింకఁ గుమారులతోడఁగూడి మాళవదేశంబును ముట్టడించి మానసారున పగతమానసారుఁగావించి ప్రాణంబులతోడఁ గొనిరావలయును. ఇంక నాలస్యమైన మాదర్శనంబొనఁగూడుట దుష్కరము, కావున నాస్థలంబునువీడి పాసియంబులైనను మార్గమధ్యంబుననే దాఁపవలయును.

ఇట్లు,
రాజహంసుఁడు.

రాజ—అమాత్యులారా! భావి కార్యాలోచనమేమి?

అప—దేవా! వెదకఁబోయిన తీవపాందబులఁజుట్టుకొనినయటుల సైన్యంబులఁదెప్పింపఁ బ్రయత్నంబులొనరించు మన కప్రయత్నముగ సేనానివహంబులేతెంచె. ఇంక నాలస్యమేలఁ జేయవలయును? మీతండ్రిగారానతిచ్చినటుల సంగరంబునకు బయలువెడలుటయే యవశిష్టము.

రాజ— ఇది యందఱకును సమ్మతమే కదా?

అందఱు. ఇది మాకందఱకును సమ్మతమే?

రాజ—మిత్రులారా! మనమిప్పుడే చమూదళంబులతో నేగి మాళవ రాజధానిని ముట్టడింపవలయును. ఏలనన చండవర్మ పరిపాలితంబగు నారాజ్యంబున కేయిక్కట్టులు రావని దర్పసారుఁడేకపింగాచలంబున నిశ్చింతతోఁ దపంబొనరించుచున్నాఁడు. మనమిప్పుడవంతికాపురంబును ముట్టడించిన వృద్ధుండగు మానసారుఁడు మనతో సంగరమొనరింప నశక్తుండునుఁగావున జయంబు సుకరంబు.

అప—రాకుమార! విజ్ఞానవంతుండవగు నీకొకరు చెప్పవలయునా?

రాజ—కావున మన సేనానివహంబుల బయలువెడల సేనానాయకుల కాజ్ఞనొసంగుదము. ఓరీ! వార్తాహారీ! నీవిప్పుడే యేగి మాతాపితరులతోడ మాయానతి శిరసావహించి సంగరంబునకు బయలు వెడలిరని విన్నవింపుము. ఓ! సేనానాయకులార!

ఉ॥ మాళవరాజధాని నసమానదురంధర బాహుశౌర్యతన్
గూలిచిదర్పసారజనకుం బరిభావమునొందఁజేసి, ని
ర్మూలముగాగఁదూల్చి యరిమూఢుల, వాహనవస్తుధాన్య సం
జాలములన్గ్రహింపవలె సత్వరమేపురి ముట్టడింపుఁడీ॥

మఱియు నోసైనికులార!

ఉ॥ ఉన్నతిమానసారుఁడు సముజ్జ్వల శంభువరప్రభావ సం
పన్నతఁగొన్నమామగధ పట్టణమున్ ద్వదఖండబాహు శౌ
ర్యోన్నతి నేఁడుచేకొనఁగ నోపునుగావున మీరలెల్లరున్
గ్రన్నన నేగుదేరుఁడి సఖడ్గశరాసన బాణహస్తులై॥

ఓమిత్రులారా! అమాత్యకుమారులారా! కపటోపాయంబుల పరిపంథిసాధోపరిభాగంబులఁజొచ్చి మదీయ పత్నియగు నవంతిసుందరినిఁగొని

రావలయును. వలదు. వలదు. నేనేయీకార్యమునకు సాహసిం
చెదను. మీరెల్లరు కారాగృహవాసులై యష్టకష్టంబులొందుచున్న
బంధుపాలాది వణిజులనుఁ దత్కుటుంబములను మీమిత్రుండగు పుష్పో
ద్భవునిఁ దదీయ పత్నియగు బాలచంద్రికను విముక్తబంధనులఁగావించి
తోడ్కొరావలయు సైనికుల కింకొక్క విషయ మాజ్ఞాపింపవల
యును. సైనికులారా!

చ॥ పురజనకోశవాహన విభూషణ జాలములున్న జాడ మీ
రరయఁగఁబోక, తత్సతులయందు బలాత్కృతిసేయఁబోక, న
వ్వరిఁగనుఁగొన్న హింససలుపంజనఁబోక, యకారణంబ, భూ
వరధనరాసులంగొనుఁడి వారిచెఱంగలవారివీడుఁడీ ?

ఈకార్యంబునకు వ్యతిరిక్తముగాఁ బ్రవర్తించిన మీప్రాణంబులఁ
గూడ వీడవలసినవారలగుదురు. మిత్రులారా! శిబిరంబుల నూడఁ
బెరికింపుఁడు. ఇప్పుడే యీస్థలంబును జనకాజ్ఞ వీడవలయును.

అప—చిత్రము. ఓసైనికులార! మీమీ గుడారంబుల నూడఁబె
ఱికి యనంతి పురమార్గంబునఁ బట్టుఁడు.

(తెరలో చిత్రము.)

అందఱు నిష్క్రమింతురు.

ద్వితీయ రంగము—అవంతికాపుర సమీప యుద్ధభూమి.

ప్రవేశము—మాళవసైనికుఁడు.

సైని—అబ్బబ్బా! మూఁడు దినములనుండి యెడతెరపిలేకుండ సంగరంబు జరుగుచున్నను మాకు జయమనుమాట యొకప్పుడును గలుగదయ్యె పాపము. వృద్ధుఁడగు మానసార మహారాజుగారు సంగరంబొనరింపలేక యొక్కచోటఁ గూలఁబడి నన్నుఁ జూచి "ఓరీ! మనకింక జయమనుమాట కల్ల. నీవిప్పుడేగి యేకపింగాచలంబుననున్న కుమారునితో మున్ను నాచేఁబరాభవింపఁబడిన రాజహంసుని కుమారుఁడు రాజవాహనుఁడు నలువదివేల సైన్యంబులతోఁ జేతెంచి నేటికి మూఁడు దినంబుల క్రిందట కోటను ముట్టడించె రాజ్య పరిపాలన మొనరింప నియమింపఁబడిన చండవర్మ యంబాలికా పరిగ్రహణావసరంబున మున్నాపెచే వరియింపఁబడిన యొకశూరునిచేఁ జంపఁబడియె వృద్ధుఁడనగుటచే నేనీ సంగరభారంబును భరియింపలేకున్నాను. కావున వేగమేతెంచి రాజ్యమును రక్షింపుకొనుము" ని వచియింప ననుఁబుత్తెంచియున్నాఁడు. కావునఁ దక్షణమే యేగవలయును. (ప్రక్కకుఁజూచి) వహ్వా! ఈ సంగరంబునుఁ జూచుకొలఁది యుత్సాహముదయించి రణభూమినుండి వెడలనీయకున్నది. ఆహా! ఏమి! ఈతని రణకౌశల్యము. అక్కటా! ఇంకెక్కడియాశ! ఈతని కాయంబు ప్రేతంబైనది. అబ్బా! అంతతో నూఱకొనక యప్పుడే శ్రమ నివారించుకొని శరాసనంబునుఁగొన్న మా రాజుగారిపై కుఱుకుచున్నాఁడు. అయ్యయ్యో! ఈతనిఁగూడ మడియించునా యేమి. (పరికించి) అమ్మయ్యా! ఎట్టెట్టులో రాజుగారు మాత్రము దప్పుకొని సేనామధ్యంబునఁ జొచ్చినారు. (మరలఁ జూచి) అదుగో రాజవాహనుఁడిటే వచ్చుచున్నాఁడు. నేనేక

పింగాచలంబున కేగుచుంటినని తెలియవచ్చెనా యేమి. వెళ్లిన వచ్చిన నేక పింగాచలముగాదు కాని యమలోకము సాక్షాత్కరించును. కావున నిక నిందుండరాదు. అయ్యో యితఁడు వచ్చుచున్నాఁడే. (పాఱిపోవును.)

(పిదప శరాసనధారియై రాజవాహనుఁడు ప్రవేశించును.)

మ॥ అరరే! దుష్టవిపక్షులార! భుజశౌర్యంబున్ ప్రత్యర్థి దు
ష్కరదోస్సత్త్వ పటుత్వమింతఁ జవిగాంచం జాలు నేకాని యీ
సరణిం బారగనౌనె యాజివిడి లజ్జాశూన్యులే, గాజులన్
గరయుగ్మంబునఁ దాల్చినారలె, వివేకం బింతయున్లేదొకో॥

నిరంతరయుద్ధ విద్యాభిలాషం బ్రవర్తించు రాజవాహనుని సేనాసమూహంబులం దాఁకి జయించువారలు మీరా! ఏల వివేకరహితులై యనలంబునఁ జొచ్చు శలభంబుల మాడ్కి ముగ్గెదరు శరణాగతత్రాణ బిరుదాంకుండగు నీతని శరణుఁ జొచ్చిన మీ ప్రాణములకేమియు భయం బుండదు. లేకున్న,

మ॥ శరసంధానవివేకసంగర సముత్సాహాంధులౌ యోధురీ
పరిబంధుల్ భవదీయజీవముల నభ్యాసార్థభూమీస్థలాం
తరమందే బలివెట్టి దన్పెదగుభూతవ్రాతమున్ వీరి దు
ర్ధరదోర్వీర్యము నడ్డువారుగలరే రక్షింపమిమ్మియ్యెడన్॥

కావున నావాక్యంబుల విశ్వసింపుఁడు. ఓరీ! మదాంధులార! పరిబంధులార! రాజశేఖర వరప్రసాదమున మదోన్మత్తుండై తన్ను మన్ రక్షించెనను విశ్వాసంబు సుంతైన లేక కాననభూమికి మమ్మంపిన మీ వృద్ధరాజెందున్నాఁడు. ముహూర్తమాత్రంబయిన మదీయ కఠోర నారాచంబుల సహింపలేని యాతండెటుల మమ్ము జయింపఁగలఁడు? మీకీ వెఱ్ఱితనంబేల. ఓహో! ఎంతపొరపడుచుంటిని అనంగ రంగజయోన్మాదంబున క్రిందుమీఁదు నెఱుంగక మామయగు మీ సారుని దూషించుచుంటిని. తండ్రి యానతిచే పూజనీయుండై

యమ్మహానీయునికూడ బంధింపవలసివచ్చె. గురుల వాక్యంబులు దిరస్కరింపరానివగుటయే యిందులకుఁగారణము. సామంబున రాజ్యంబు నర్పించునేమోనని సమరాది రాయబారి ముఖంబున నెన్ని విధంబులఁ బ్రార్థించినను బెడచెవింబెట్టి మూడుకాళ్ల ముదుసలియైనను ప్రాణంబులకన్న మానంబె విశ్వసనీయమనుచుఁ బ్రాణంబులుండ రాజ్యంబును వీడననుచు సంగ్రామమునకు సిద్ధపడియె. ఔరా! ఏమి పౌరుషమెంత శ్లాఘనీయము. ఔను క్షాత్రవంశుల పౌరుషంబట్టిదేకదా! అయిన మరల నొక్కసారి యమ్మానసారునకు వినంబడున టుల నేనేవచియించి చూచెదను. మామా! మానసారా!

చ॥ జనకుని యాజ్ఞమీరుటయు, సంగరమందున మామనెంపగాఁ
జనుటయు, లోకదూష్యములు సంధియె యిత్తరి యుత్తమంబుగా
వినమును రాయభారమునుఁ బుచ్చితి నేఁడిటు వేఁడుచుంటి నిం
కనుఁబగవీడి నామగధ కావున వేగమె మాకొసంగుమా ?

చ॥ కడచినదెల్లఁ ద్రవ్యసమకట్టకఁ జుట్టరికంబొకింత చే
పడుటఁద్వదాత్మజంగల సుభావముచే తనయేనివే యొసం
గుము పితృరాజ్యమెల్ల మనకున్నశియించును ద్వేషభావ మి
ప్పుడె మనలోన మేమనము పోరఁగఁ జెల్లునె నవ్వరే జనుల్॥

ఇంకనైన నావాక్యంబులు విశ్వాసార్హంబుగా లేవా? అవును విశ్వసనీయంబగుటెట్లు? పైత్యరోగికి పంచదార రుచించునా? మామవని చేమిమగఁ బరాభవమొనర్ప నిష్టములేక యెన్నెన్నియో విధంబుల నీతులుగడించినను నావాక్యంబులు రుచింపకున్నవి. "బుద్ధిః కర్మానుసారిణీ" యను నటులు పరాభవ సంపద వెన్నాడుచుండ మావాక్యంబులు విశ్వసనీయంబులగునా? సరియె రణము ప్రారంభమయియే యున్నదికదా? మా బాహుబలంబిప్పుడే తేటపడఁగలదు నిలువుఁడు. భళిరా! మాసైన్యంబులెంత భయానకములై యొప్పారుచున్నవి! ఇదియే మాకు జయసూచనంబుగాబోలు (ప్రక్కకుఁజూచి). ఓహో.

అప్పుడే సాంధ్యారాగ ముప్పతిల్లుచున్నది. సంగ్రామ పరిశ్రమంబున నలసిన మాసైనికులకు విశ్రాంతినొసంగెద.

చ॥ ప్రతిశితఖడ్గరాజ శరహస్తచమూపతులార! మీరుఁగ
దుస్తనముచాలు, సేనలనిటు శిబిరంబులకై మరల్పుఁడీ
వ్రతము రణప్రసిద్ధమ సమానము నేటికి దండుపోదమె
ధ్రితమభుజాంచితోగ్ర శరలీలనుఁజూపఁగవచ్చు నెంతయున్॥

సీ॥ నాళీకసంతతి నాధుకై దుఃఖింప
సౌగంధికంబులు సంతసింప
రామామణులు భర్తరాకకై వీక్షింప
మదనుండుశరముల పదనునుంప
యక్షగంధర్వాదులందందు విహరింప
శార్దూలములునిచ్చ సంచరింప
నక్షత్రసంఘముల్నభమున రాణింప
చక్రవాకులుగంట జలములుంప

తే॥గీ॥ రాక్షసులగుంపు దిండికై రాఁదలంప
యతిచయముసాంధ్య కృత్యంబులాచరింప
కృషికులెల్లరు గృహముల కేగుదేర
తిరిగిచూడక భాస్కరుండరుగ నెంచె॥

కావున నేను నిదే సాంధ్యకృత్యముల దీర్ప నేగుచున్నాను.

(నిష్క్రమణము.)

తృతీయ రంగము—కోట ప్రాకారము.

ప్రవేశము—అవంతిసుందరీ సురతమంజరులు.

సురత—రాకుమారీ! ఏలవిచారించెదవు.

తే॥గీ॥ రాజరాజాధిరాజులు ప్రధనచణులు
శేముషీవంతులును మునిశ్రేష్ఠులధిక
ధనికులైనఁగాని విధివిధానమున్న
నెట్టిబాముల నేసియు నీఁదవలయు॥

ఏమనిట్టి పరాభవంబునకుఁ బాల్పడ నీజనకుండు దనచేతిమీఁదుగనే తెచ్చుకొనినదిగాని వేఱుకాదు. చూడు.

చ॥ కడకువరాయబారి సముఖంబున నాజనినీకు జీవితే
శుఁడువచియింప "ద్వేషమునుఁ జుట్టరికంబుననున్న మీరుమే
ముఁడుగుటమేలుమాదుగధర్మోర్వి లోసంగుట శ్రేయమాజిమె
ప్పుడుజనదూష్యము" చుఁదలపోసిన నీపితయట్లుసేయఁగన్॥

ఎంతటి సంగరనిపుణుండాకినఁ దగిన పరాభవమునఁగూడునుగాని యూరకపోవునా? వైరులు లోఁబడుదురా? వృద్ధుండయ్యు నవయౌవనంబున నొప్పు బ్రత్యర్థిందాక నెల్లుసిద్ధపడియె. ద్వేషులు గఠోర నారాచంబుల విడువక సూనాస్త్రంబుల విడతురా? ఐననేమి నీవింత చింతపడవలసిన యవసరము లేదు. సకలశాస్త్ర సారాంశముల నెఱింగిన జీవితేశ్వరుఁడు నీజనకునకేమియుఁ బ్రాణాపాయముఁ గావింపడని నేనభయమీయఁగలను.

అవం—అమ్మా! తాము వచించినవన్నియు నిక్కములేగాని మామయని సున్నితైన విచారంబు లేక పలువురమధ్య బంధించి తన రథంబునకుఁగట్టుకొని పోయెనని మన్నాథు లోకంబెంత నిందించునోయని భయంబగుచున్నది.

సురత—వెఱ్ఱిదాన! అల్లుఁడని యించుకేని సందేహింపక సంగరంబునకొప్పి త్రుంపసమకట్టినవాని మామయనీ యూఱకొను, వెఱ్ఱి యొకఁడుండునా? లోకంబులు దూషించునని యేలవాపోయెదవు. లోకంబులేమి దూషించును? రాజవాహనునిదెంత మాత్రము తప్పని నిర్ణయింప వీలులేదు. తనకెంత హితుఁడైననుఁ జుట్టమైనను జనకునానతిమీఱి ప్రవర్తించుట యధర్మంబని శాస్త్రంబులు ఘోషించుచుండ వానిప్రవర్తనము విరుద్ధంబెట్లగును. సత్ప్రవర్తనుండు కావుననే సమరాది రాయబారిసముఖంబునను రణావని స్వయంబుగ నెంతయు సామోపాయంబున నీతులుగ్గడించుచుఁబలికెను. కాని యవియన్నియుఁ బధిరునిచెంత శంఖారావమువలె నీజనకునిచెంత వ్యర్థమైనవి.

అవం—అమ్మా! నీవెన్ని చెప్పినను కన్నతండ్రిగావున వగపుఁబాయుదు మన్న నశక్యమగుచున్నది.

చ॥ చినతనమందునుండి తనచేతులఁబెంచి వివేకమబ్బ వి
ద్యనుఁగఱపించి నన్నుఁ బ్రమదంబలరారఁగఁగాంచుచున్న నా
జనకు పరాభవంబున విచారము నొందకయుండుటెట్లు దు
ర్జనుఁడనియైనఁ దండ్రియెడ సత్కృతిమానెడు వారలుందురే॥

(ప్రక్కకుఁజూచి) తల్లీ! అచలశ్రేష్ఠంబునఁ దపోనిష్ఠనున్న మాయన్న గారే సంగరంబునకెట్లు రాఁగలిగిరి.

సురత—మున్న నీజనకుండు చండవర్మ మృతియు వైరిసేనముట్టడియు రణంబునజయంబు దుష్కరంబనియుఁ గుమారునకు సైనికునిచే వర్తమానమంపఁ దనతపంబున ఫలంబు సిద్ధింపకున్నను రాజ్యంబుపోవునను సందియంబున నింతకుమున్నె యీసంగరమునకేతెంచి జనకుపరాభవ సంపదఁగన్నులారఁగాంచి క్రోధారుణితలోచనుండై పగరసేనందాకుచున్నాఁడు. అబ్బా వీనిప్రతాపమెంత దుస్సహముగనున్నది.

శబ.—రుధిరసిక్తంబులయిన పుట్టంబులతో శరాసనంబునుం గొని మాయన్నం దాంకు నావీఁడెవ్వఁడు.

సుర.—జనకుఁ పరాభవంబునుం గన్న నాకుంగూడ మనసు మనసున నిలువక చంచలంబాయెనాయేమి! రోషకషాయితనేత్రుండయి తన హస్తంబుననున్న శరాసనమౌర్వీనినాదంబు మిన్నుముట్ట శరప్రయోగంబొనరించు నాతఁడు నీమనోహరుఁడుగాఁడా?

ఉమ—(లజ్జవడి) రౌద్రాకృతి రుద్రదేవునిమించు నామూర్తిపుంజంబునుం బోల్చుకొనలేక మోసపోతిని. క్షమింపుము. అయ్యో మన్నాథుని యురఃప్రదేశమున నన్నయొక్క కఠోరనారాచంబును నొక్కవాలకంబును నిగుడించినటులున్నాఁడే యేదైన నపాయము రాదుగదా?

ఘృత—అమ్మా! నీనాథుఁడు వైరిశరాసన విముక్తనారాచంబులఁ దప్పించుకొనలేనంతటి వ్యర్థుఁడనుకొంటివా? ఇటుచూడుము. బాలచంద్రాకృతినొప్పారు నొక్కసాయకంబున తచ్ఛరంబుం దుతునియలంగావించి నీయన్నపై శరంబులనెటులు విడచుచున్నాఁడో చూడుము.

అవ.—శౌర్యమన్న నమ్మహానీయునిదే.

(తెరలో)

మ॥ ఫలపత్రంబులఁ గందమూలములనే భక్షించి పాషాణ వే
దులఁ బొర్లాడి మృగాళివోలె మదులందున్ లజ్జవోనాడి ని [భూ
స్తులకాంతారములందుఁ గ్రుమ్మరిలుధూర్తుల్ మీరుసంగ్రామ
స్థలికాంక్షయకహస్తులైన మముసేచందానఁ డీకొందురో!

సుర.—అమ్మా! ఉన్మత్తునివలెఁ దబ్బిబ్బులంగూయు నీసోదరుని వాక్యంబులు వింటివా? విధివిధానమున్న నెట్టివాఁడైన నిట్టి కట్టడి కృత్యంబు లనుభవింపవలసినదే? ఒక్క పశువును

జయిరవా దవానిష్ఠాగరిష్ఠుండై యన్నపానీయంబులులేక యిన్ని వత్సరము లామంచుకొండ నేలనుండవలసియునా? (తెరలో) ఓరీ! దుర్మతీ. పరులలోపంబుల నెన్నుటే పనిగాఁగఁదలఁకించు వారికెన్నియైన స్ఫురింపఁగలవు. కాని యది వీరోచితమా?

చ॥ భుజబలమున్న శాత్రవచమూహరణంబొనరింప క్షాత్రవం
శజులకుఁజెల్లుఁగాని, యిటుమాటలతోడనుఁ గాలమెల్లఁబా
పజనునె! నీదుపల్కు విను వారలుమెత్తురె? రాజహంస పా
దజలజముల్ గ్రహించిన పితందలపోయవె, జ్ఞప్తిపోయెనే?

సురత— రాకుమారీ! నీజీవితేశునివాక్యము లాలించితివా? వివేకవంతునకునుమూఢునకుఁగల తారతమ్యమిదియే? హనుమంతుని చేతఁ గుప్పిగంతులవలె నఖండశౌర్య ధురంధరుండగు రాజవాహనుని చేత వీని శౌర్యసాహసములు సాగునా?

అవం—అయ్యో. అయ్యో. అదియేమి.

సురత—ఇంక నేమున్నది నీమనోహరుఁడు శరవర్షంబున రంగస్థలం బెల్లఁగప్పి నీసోదరునిపైకి లంఘించి పాశంబులఁ గరంబుల బంధించి తన స్యందనంబునకుంగొనిపోయి యాతని బాధించుచున్నాఁడు. ఇం దెవ్వరు పౌరుషవంతులో కాంచితివా?

అవం—హా! సోదరా!

తే॥గీ॥ తల్లిగర్భమందున నుద్భవిల్లినాది
యొక్కకంచమునందిని యొక్కశయ్యఁ
బవ్వళించిననిన్ను నే భండనమున
శూరుఁడొక్కఁడు గొనిపోవఁజూడవలసె॥

సురత—అమాయకురాల. చూడక చేయునదేమున్నది. మగనిపైఁ గత్తిఁగట్టుదువా? దుర్మార్గ పరాభవంబునుఁగాంచి సంతసిల్లుట యటులుండ మీదు మిక్కిలి వగచుచుంటివా? నాఁడేకపింగా

చలంబుననుండి నీజీవితేశునిఁ ద్రుంపుమనియు నిన్నుఁగారాగృహంబున నుంపుమనియు వార్తాహారింబుచ్చిన వీఁడు విరోధిగాక సోదరుండగునా? నేనిటులో యాకృపవర్మను మోసపుచ్చి చండవర్మ మృతినొందుచున్నాఁడని నీనాథు సంగరస్థలి కంపి నీచెఱనూన్పించుటచే నిటుల స్వేచ్ఛా సంగరంబునుఁ జూడఁగలిగితివిగాని లేకున్న నీసరికిఁ గారాగృహంబునఁగుందుచు నుండవలసినదేఁగదా.

అవం—అమ్మా! ఎంతటిదుర్మార్గుఁడయిన సోదరుఁడుగదా?

సుత—ఏమి నీయమాయకత్వము. నీకెగ్గొనరించినవాఁడు సోదరుఁడగునా? ఇంక నీవగపుఁ దిగనాడి రానున్న సౌఖ్యంబుల కెదురుసూచుము.

అవం—అమ్మా! నీవిటనుండుము. వైరిసేనలుఁ గోటలోనికిఁ జొచ్చునటులున్నవి. నేఁబోయి యోధవేషధారినయి వారి లోనికి రాకుండ సేనలంగూడి కాపాడెద.

సుత—క్షత్రియవంశ సంజాతవగుటచే నిటులాడుచుంటివిగాని మహారథికులందఱు నేలపాలగుచుండ రణంబొనర్పుదానవునీవా? వారినాప నిర్జరశ్రేష్ఠులకైన వశమా? ఇదిగో యిటుచూడుము నీహృదయేశుఁడుఁ ద్వదీయ సందర్శనార్థంబును హేతులు కారాగార విముక్తికొంటకునుఁ గాఁబోలు కోట ద్వారముందాటి యిటేవచ్చుచున్నాఁడు పోయి స్వాగతమొసంగుదమురమ్ము.

అవం—(సిగ్గుతో). ఇటే వచ్చుచున్నారుకదా? యిచ్చట స్వాగతమొసంగరాదా?

సురత—సరియే నీయభీష్టమే యొనర్చెద.

(అంత రాజవాహనుఁడుఁ బ్రవేశించును.)

ఉ॥ సైనికవర్యులార! విలసద్భవదీయధృతిన్ విపక్షభూ
జానియుఁదత్సుతుండు మనస్యందనమందున బద్ధులైరి, కో
పానలమందఁగూలె సహితాళియు, మాళవరాజ్యమున్నవ
న్మానవనాథ మాగధయు మాకులభించెను మోదమయ్యెడిన్।

కావున మీరెల్లరింక రాజభవనంబులఁజొచ్చి కోశభూషణ వాహనంబులఁగొని రిపుకారాగృహవాసంబున నష్టకష్టంబులఁగుందు వర్తిల్లఁగియున్న బంధుపాలాది వణిజులను బాలచంద్రికా పుష్పావచాయికలనుఁ దదితర కారాగృహవాసులనందఱి విడచిపుచ్చుఁడు. నేఁటిదాఁ కేగి యంతఃపుర సౌధోపరిభాగంబున విచారమనస్కురాలై యున్న మదీయ ప్రేయసింగొనివచ్చెద ననంతరము సేనాపతులఁగూడి వామదేవ ఋష్యాశ్రమంబుఁ జేరి మాతాపితరులఁగలసి పుష్పపురంబున కేగుదము (ప్రక్కకుఁజూచి) అహాహా! ఏమిది? ఈ ద్వారంబున నెవ్వరో యిద్దఱు సుందరీమణులు నంగిపాటంబుఁ దల్చు చూడ్కులతో మందగమనంబున నిటువచ్చుచున్నారు. (సందేహించి) కొండొకచో మదీయ ప్రేయసియగు నవమాలికయు సుదతియు నవ్వుచున్నాది ద్వితీయయో? కారాగృహవాసంబునుఁ బాపి నన్నుఁగాపాడిన యరోవనితయగు సురతమంజరియగునున్నది. వారేమైన ఘోరమగు శాత్రవ చమూ విధ్వంసంబుఁగాపాప నెలువడు శరపాతంబులకుం గుంది యిప్పుడిస్థలంబున నేలఁగూలుచున్నారు. (ఆలోచించి) సంగ్రామ [illegible] కొత్సాహులై యేతెంచిరటులున్నారు. వారిఁబరామర్శించెదఁగాక.

సురత—దేవా స్వాగతము.

రాజ—అమ్మా! నమస్కారము (నమస్కరించును.)

అవం—నాథా! దురదృష్టవంతురాలగు మీప్రేయసి వందన మొనరించుచున్నది. (నమస్కరించును.)

రాజ — ప్రేయసీ! శుభమగుఁగాక! నీకిందుఁగల్గిన దురదృష్టమేమి.

మ॥ అనలజ్వాలలస్వర్ణముం, దఱచుటన్ హైయంగవీనంబు, క
ష్టనిపాతంబుల సద్యశంబొఱపిడిఁ సద్రత్నమున్ హెచ్చువ
న్నెనుఁ జెందఁగలవంచు బుద్ధిమతులెంతేఁ జెప్పరో? బాములం
గోనమిన్ సౌఖ్యము లబ్బనేర్చునెయిటుల్ ఘోషిల్లగాఁ జెల్లునే॥

అవం — మనోహరా!

తే॥గీ॥ పాద్యమిా చంద్రుఁగను కైరవంబువోలె
ప్రత్యుషవిభానసునిఁగన్న పద్మమటుల
మేఘమాలనుఁగాంచిన మెఱుపుకిరణి
నినుచూడ్కి వికసించెనాదుమనము (కౌగలించుకొనును)

రాజ — మన్మనోహారిణీ!

తే॥గీ॥ కన్నుదోయిని బాష్పముల్గారుచుండ
నమమునజ్వాడ నడుగులుఁదడఁబడంగ
నేల హెచ్చువాపోయె దీలీలనబల
జనకి సోదరులకయి విచారపడెదొ

అదియే నిజమైన

చ॥ జనకునినాజ్ఞమీరగ నసాధ్యముగావున, నీదుతండ్రి నీ
రిణమునమామ యూనని దలంపక కట్టిడికార్యమిట్టొన
ర్పనుసమకట్టఁగానలసె, పద్మదళాక్షిరో! వీనినీదుదా
సుని క్షమియింపులేని యెడఁజూపుము శిక్షనుజ్ఞానమబ్బగన్॥

అవం — దేవా? మిము నేక్షమియించెడిదాననా? మీరొనరించిన కార్యములలో విరుద్ధమేదికలదు. గుర్వాజ్ఞయేరికైన దుర్లంఘ్యముగదా? కరుణాస్వాంతులుఁ నీతివిచక్షణులు గావున నే రాయ భాగముఖంబునను స్వయముగనుఁ బెక్కువిధములఁ

గీరంబునకు బోధించినటుల నుడివితిరి. కాని విధివిధానముచే నిటులాయెను. ఇవ్వియన్నియు నెఱింగి మిమ్మెటుల నిందింతును.

రాజ — అటులయిన నేకృతార్థుఁడను. ప్రేయసీ! నాయీ కారాగార విముక్తి సమయంబున నీకులభింపఁబోవు బంధనాలయంబును గూర్చి యెంతవిలపించితినో యాపద్యార్థమున కేమిక

ఉ॥ ఆతపశుష్కమై, నవఘనాగమమందుఁజిగిర్చి, హేతిసం
ఘాతమునన్నశించులతకైవడి నాదుచరిత్రమెంతయున్
భీతినిఁగొల్వఁ బ్రాణములవీడఁగఁబూనితిఁగాని యప్పరో
జాత కృపంగనుంగొనుట సాధ్విరో గాంచఁగనోచితిన్ననుఁ

దేవీ! నీబంధనాలయవాసంబెటులఁదప్పినది.

అవం — ప్రాణనాయకా! కరుణాంతరంగురాలగు నీమాఁనీమఱి దయచేత కారాగృహముందప్పుకొంటిని.

రాజ — ఏమీ? నీకారాగారవిముక్తికి సహితమీపెయే కారణమా? ఇది మన యదృష్టమే అమ్మా! సురతమంజరీ! కారాగృహవాసులమగు దురదృష్టవంతుల మమ్మిరువురనుఁ గాపాడిన నీ చరితంబెంతయు సంస్తవ్యము. నీఋణము వేయేండ్లకునైనఁ దీర్చుకొనదుష్కరము.

సురత — రాకుమారా! నేనొనర్చినదిందేమిగలదు. ఇదియంతయు మీ యదృష్టంబనియేఁదలంపుఁడు.

రాజ — అమ్మా అటులనవలదు. తమరీవిధినొనర్పకున్నఁ గారాగృహంబుతోఁబాటు మరణంబుఁగూడఁదప్పదుగదా! అమ్మా! మీయాజ్ఞానుసారంబుగా చండవర్మ వధోద్యోగమున నేగితిని గాని యీమరదృష్టవంతున కాపుణ్యముచిక్కలేదు. మీయానతినొనర్పనెఱుఁగని యీతప్పు క్షమింపవలయును.

సురత—రాకుమారా! ఆవిషయమంతయు నేనెఱుంగుదును. తద్వ
ధోద్యోగంబునఁ బ్రోత్సాహ మొనరించినఁగాని నీవాచింతనుఁ
బాసి కారాగృహమునుండి వెలువడవని యట్లు నుడువవలసి
వచ్చినది.

రాజ—అమ్మా! మీయూహల గ్రాహ్యంబులుగదా?

సురత—రాజా! నాఁడు నీప్రేయసికే కష్టంబు లేకుండఁగాపాడి నిన్నుఁ
జేర్తునని వచియించిన నాప్రతిజ్ఞ నెరవేఱినదిసుమా?

రాజ—అమ్మా తమవాక్యంబులకును గార్యంబులకు నసాధ్యంబు
లుండునా?

సురత—రాజా! నేనింక మాపురంబునకేగి ముసలియగు నాజన
యిత్రిని సంతోషపెట్టవలయు. కావున సెలవొసంగుము.
పోయివచ్చెదను.

రాజ—అమ్మా! మేము సెలవొసంగెడివారమా?

అవం—అమ్మా! మానమస్కారములంగొని దీవించి యేగుఁడు. (ఇద్దరు
నమస్కరింతురు.)

సురత—శీఘ్రమే పట్టాభిషేకమగుఁగాక.

రాజ—తామట్టి సమయంబున నొక్కసారి విచ్చేయవలయునుసుఁడీ.

సురత—అటులనే (నిష్క్రమించెను.)

రాజ—దేవీ! ఈపె చరిత్రం బతివిచిత్రమని నీ వెఱింగియుందువేకదా?

అవం—అవును మున్నే యాపె వదనగహ్వరమునుండి యెల్లవిషయంబు
లాలించియుంటిని. ఇంకనిచ్చట నేలవసింపవలయు. మన
మంతఃపురంబునకేగుదమురండు.

రాజ—నీయభీష్టము నెఱవేరుఁగాక. ముందు వృద్ధురాలగు మీజననిని నాశ్వసింపవలయును.

అగం—దేవా! బాలచంద్రిక విషయమేమిచేసితిరి.

రాజ—తత్కుటుంబసహితముగ విడిచి పుచ్చుమని మన్మిత్రునంపితిని.

అగం—మంచిపనిఁగావించితిరి. సహజవివేకవంతులగు మీకుసూచింపనిపనొండుగలదా? (ముందునకు నడుతురు.)

రాజ—ప్రేయసీ నాథుఁడులేని వనిత చందంబున రాజులేని యీసౌధంబెటుల కళాహీనమైయున్నదో చూడుము.

తే॥గీ॥ శీతలాంశుఁడులేని నిశీథమటుల
కంజహితుఁడులేని సురమార్గంబుకరణి
నాయకుఁడుఁజెంతలేని సైన్యంబుమాడ్కి
రమ్యహీనమై యీసౌధరాజమొప్పె॥

(నిష్క్రమణము.)

[చతుర్థరంగము—మగధరాజ్యమునందలి పుష్పపురసభాభవనము ప్రవేశము. రాజహంస రాజవాహనాపహారవర్మలు. తదితర మంత్రి కుమారులు వామదేవమహర్షి వసుమతీ దేవ్యవంతీ సుందరీ బాలచంద్రికా సురతమంజరులు.]

రాజహంసుఁడు—ప్రేయసీ నేఁడుగదా మనమదృష్టవంతులము.

సీ॥ పరిపంథిచేనోడి వనసీమనందిన
యిక్కట్టు వీధిగట్టెక్కినాము
సాందాటవిని మిత్రసంతతివిడనాడి
యరిగిన పుత్రునేఁడరసినాము

నవకుమారులు సుఖానందులై యుండఁగా
గాంచిసంతోషింపఁ గలిగినాము
ఎన్నఁడో బాసిపోయిన రాజ్యలక్ష్మియే
యంకపీఠిని నుండ నరసినాము

తే॥గీ॥ వైరివీరమాళవ రాజవంశజులకు
మెండుపరిభావమునుఁ గూర్చినుండినాము
సౌఖ్యములతోడ సుతునొందఁ జాలినాము
భాగ్యమన్నను మనయదే వసుధలోన॥

వసుమతి—నాథా! యోగ్యతముండైన పుత్రుండు గలుగుటను గదా మనపరాభవ దుఃఖమును మఱవఁగలిగితిమి.

రా. హం.—అవును పూజ్యుండగు నీమహర్షి కరుణాకటాక్షంబు లేకున్న నీసరికిట్టి సౌఖ్యంబులఁ జూచువారముగాముగదా?

వామదేవుఁడు—రాజా! ఇందు నాకరుణాకటాక్షమేమీకలదు. ఇదియంతయు విధిప్రేరితము మీయదృష్టము.

రా.హం.—దేవా! అటులేల వాక్రుచ్చెదరు. నా జననంబాది నేఁటివఱకు మావంశాభివృద్ధికిఁ గారకులు మీరేకదా?

వామ—రాజా! ఈవితండవాదముతో నేమిపని. భావికార్యాలోచనుండవుకమ్ము.

రా.హం.—తమ యాజ్ఞానుసారంబ కావించెదను. కుమారులారా బంధీకృతులైన పరిపంథులేరి?

రాజ—నాయనా వారినిఁగొనిరా పుష్పోద్భవుఁడేగెను. ఈసరికి వచ్చుచునేయుందురు.

వసు—అదుగో వచ్చుచునేయున్నారు. వారే మానసాదర్పసారులు.

రాజ—(వీక్షించి) అవును.

(శృంఖలబద్ధులగు మానసారదర్పసారులఁ పుష్పోద్భవుఁడుప్రవేశింతురు)

పుష్పో—దేవా! నమస్కారము. (నమస్కరించును.)

రా.హం.—పుష్పోద్భవా! వీరెవరు. మాళవాధీశుఁడగు మానసార మహారాజుగారా? ఈద్వితీయుండెవఁడు. దర్పసార మహారాజుగారా? అయ్యో! అవివేకివై వీరికేల శృంఖలబాధ పూజ నొనర్చితివి.

పుష్పో—దేవా! పూజ్యులగు మిమ్ము దిరస్కరించిన వీరికిట్టి సత్కార్యంబు దగునని యే గావించితిని.

అవం—(మొగమువంచికొని తనలో) అక్కటా! పితృసోదరుఁలొందు చున్న పరాభవంబునుఁగాంచుటెటులు? హా! దైవమా! ఎట్టిదుస్థితినిఁదెచ్చిపెట్టితివి.

రా.హం.—మంచిపనిఁగావించితివి. అయినను జ్ఞానవిహీనులగు వీరివలెనేమనములోకదూష్యంబైన కార్యంబేల కావింపవలయును. బంధనంబుల నూడఁబెఱుకుము. (పుష్పోద్భవుఁడు బాధనముల నూడఁదీయును) ఓ మానసారదర్పసారులారా! యాసనంబులధిష్టింపుఁడు.

మాన. దర్ప.—(నమస్కరించి కూరుచుందురు.)

రా.హం.—మానసారా! రాజ్యమదోన్మాదంబున నెట్టివారలైననుఁ గన్నుఁగానక సాటికులంబువారలకుఁ బరాభవంబుఁ గావించుట చెల్లదు నాఁడు మీరొనర్చిన కార్యంబునకుఁదగిన కార్యంబొనరింప వలసినదే కాని వియ్యంకుఁడవగుట చేతను వృద్ధుఁడవగుటచేతను మాకులోఁబడిన వాడవగుటచేతను నీకెట్టి పరిభవంబును సలుపఁదలఁచియుండలేదు.

మాన—(తనలో) అక్కటా! ఎట్టివాని కట్టి దుస్థితి తటస్థించినది: ముల్లుకులవ లెనున్న వీరిపలుకులకు లోఁబడవలసివచ్చినదిగదా ?

తే॥గీ॥ ప్రథమమందునఁగల్గు సౌభాగ్యగరిమ
నన్యజనములదూషింపనౌనె ప్రజకు
నెంతగల్గిననంతకు నేనుమదుఁగు
లడఁగియుండుమనియెడి వాక్యంబువినమె॥

దర్ప—(తనలో) కానిపనిసంభవించినప్పుడూరకొనుటయే శ్రేయము. నేఁటికెట్లైన వీరిచేతనుండి తప్పుకొని మహేశ్వర వరప్రసాదితుండనై యింతకుఁ బదింతలుగావింపక మానను.

రా.హం.—మానసారా! నీకుమార్తె మదీయతనూజు నభిలషించుటయు నింద్రజాలిక ప్రభావంబున వివాహంబాడి నీచెల్లెలి కుమారునిచే కారాగృహబంధితుఁడై యప్సరోజాత కరుణాకటాక్షమున విముక్తుండై దేశాక్రమణంబొనరించుటాది యింతవఱకును జరిగిన ఘనకార్యంబులన్నియు వింటిని మత్కుమారుని విషయంబున నీవు ప్రవర్తిల్లిన విషయమే ముఖ్యకారణంబుగాఁగొనుట మిమ్ము విడుచుటయేకాక మాకులోఁబడిన మీరాజ్యంబును మాసామంతరాజులై పరిపాలించుకొన నాజ్ఞనొసంగినారము.

దర్ప—(తనలో) అమ్మయ్యా! ఇప్పటికి మంచివీలు దొరికినది.

మాన—చిత్తము.

రా.హం.—బావా! మాకోపశమనార్థంబును సంతోషార్థంబును నీకుమార్తెయగు నవంతీసుందరిని నీచేతుల మీఁదుగ మత్కుమారునకొసఁగి వివాహంబుఁగావించుటయు నమాత్యకుమారపరిణయంబులునుఁ గుమార పట్టాభిషేకంబునుఁ గావింప,

వలయు. కావున తామంతఃపుర జనములతోఁగూడ మాపు
రంబునవసించి మాయొద్దు సపర్యలంగొనవలయు.

మాన—దేవా! తమ యాజ్ఞానుసారమే కావింతుము.

(అనంతరము రాజవాహనావంతీసుందరులకు బాలచంద్రికా పుష్పోద్భవులకు నంబాలికాపహారవర్మలకుఁ దక్కినమంత్రికుమారులకు వారు వలచికొనివచ్చిన కన్యలకు వివాహ మొనరింతురు.)

మాన—అమ్మాయీ! అవంతీసుందరీ! నీకోరినవరుఁడు లభించుటయే కాక మీకష్టంబులన్నియుఁ బాసెనుగాన సుఖంబుండుము. ఇంకఁగొన్ని వాక్యంబులనుడివెద సావధానచిత్తురాలవయి యాలింపుము.

సీ॥ ప్రత్యూషపవనాంకురములు వీవగనె మే
లొ్కని హృదయేశు మేల్కొలుపుమమ్మ
శయ్యాతలమువీడి చనియెదుముందు వి
భుని పదాబ్జములకు మ్రొక్కుమమ్మ
నాస్త్యస్తివాదంబు నాచరింపకనిష్ట
నిష్టదైవము భజయింపుమమ్మ
అత్తమామలయందు ననురక్తిలోనుంచి
దండంబులొనరించు చుండుమమ్మ
తే॥గీ॥ చిన్నతనపుఁ జేష్టలనింకఁ జేయకమ్మ
మాళవాన్వయసత్కీర్తి మాపకమ్మ
ధవునియానతిమదిలోనఁ దలఁపుమమ్మ
మమ్ముఁ దలిదండ్రులను మాట మఱువకమ్మ॥

అల్లుఁడా రాజవాహనా

సీ॥ భాషాభిలాష ప్రవర్తిల్లెనేగాని
యేనాఁడు పనిపాట లెఱుఁగదయ్య
బంగారుటుయ్యెలఁ బండియుండుటెగాని

కలకు నేలనుఁ బాడి యెఱుఁగదయ్య
సఖులతోడను బరిచర్యలందుఁ గాని
యేరిసి సేవించి యెఱుఁగదయ్య
కసరి మాటాడ వగవునందుఁ గాని
యెదురించి మాటాడి యెఱుఁగదయ్య

తే॥గీ॥ పాపపుణ్యంబు లెఱుఁగని బాలయయ్య
పెక్కు సద్గుణంబులుగల వెలఁదియయ్య
నాదుసుకుమారి నిటుల నీనాఁడు నీదు
చేతనుంచితి నెల్లు పోషింతువయ్య॥

రాజ—చిత్తము. మీ కానసందియ మవసరములేదు. తమ యాజ్ఞానుసారమే ప్రవర్తిల్లెద.

రా.హం.—అమ్మాయీ! బాలచంద్రికా! మత్కుమార పరిణయంబునకుఁ గారకురాలవగు నిన్నును నీనాథు నెంత నుతించినను మీ ఋణము తీరదు.

చ॥ పురుషుఁడు సల్పనేరని యపూర్వపుకార్య మవంతిసుందరీ
పరిణయమిావుసల్పితివి వహ్వారె! నీదగుబుద్ధికల్మి జాణరొ! యెటులీవొసంగిన ఋణమ్ము గ్రహింతుము కాన నీమనోహరుని నమాత్యుఁగాఁగ మగధావలి నిల్పితిమమ్మ ప్రేముడిన్॥

పుష్పోద్భవా! నీప్రధానామాత్యపదవిని సంతోషింతువా?

పుష్పో—దేవా! అసమర్థుఁడనగు నేనీయుద్యోగంబున కర్హుండనుగాను కాని దేవరవారి యానతి మీరలేక యీకార్యమును మోయవలసివచ్చుచున్నది.

రా హం.—అపహారోపహారవర్మలార! మీరాజ్యంబులు మీరు పాలించుకొనుఁడు తతితరామాత్యకుమారులార! మీస్వార్జిత రాజ్యంబుల మాపాలనకులోఁబడి యేలుకొనుఁడు.

అందఱు చిత్తము.

రా.హం.—దేవా! వామదేవ మహర్షి సత్తమా!

మ॥ మునుపాలించిన రాజ్యమేయగుటనే మూర్ధాభిషిక్తుండనై
గనుసౌఖ్యంబులు లేవొకింత సుతునింగావించెదన్ బట్టభ
ద్రుని, నేకాననమందునొక్కయెడ సంతోషంబునన్ మాపివృ
త్రినిఁగాలంబునుఁ బుచ్చువాఁడనిక నెంతేపత్నిసాయంబునన్॥

రాజ—నాయనా! జ్ఞానాజ్ఞాన విహీనులగు పసికూనలను మమ్మిందు
విడనాడి వనంబునకేగెదరా?

రా.హం.—కుమారా! పసికూనవేయైనను బుద్ధికిఁబెద్దవాఁడవే.
అప్పుడప్పుడేతెంచి మీసౌఖ్యంబుల వీక్షింతుము. అధైర్యం
బునుఁజెందకుము. దేవా! దీనికేమందురు.

వామ—నీయిష్టానుసారమే కానిమ్ము. ఇప్పుడే కుమారునిఁ బట్టభ
ద్రునిఁగావింతును. (రాజవాహనుని నవరత్నఖచిత సింహాస
నాసీనుంగావించి శిరంబునఁగిరీటముంచి.)

కం॥ శ్రీశైలహిమాచల మ
ధ్యాశాపర్యంతము మనుజాధీశుఁడవై
శ్రీశపదయుగ ధ్యానా
వేశుఁడవై యశమునంది వృద్ధినిఁగనుమా॥

కుమారా! నీకింకేమైన వరంబుగావలెనేని కోరికొనుము.

రాజ—దేవా! ఆశ్రితజనమందారుఁడవైయుండ వరంబులఁగోరుకొ
నుటకేమి.

చ॥ పరులకుఁగీడుసల్పెడు కృపారహితాత్ములు మూఢమానవుల్
మరణమునొంద్రుగాత, యవమానవిహీనత దంపతుల్ పర
స్పరము మహానురాగమున వర్ధిలుచుందురుగాత, సన్మహీ
వరుపరిపాలనంబుననుఁ బౌరజనంబు సుఖించుఁగావుతన్॥

వామ—తథాస్తు.

రాజవాహనవిజయము సర్వము సంపూర్ణము.

శ్రీ. శ్రీ. శ్రీ.

పుటం	పంక్తి	తప్పు	ఒప్పు
69	4	కొరివారి	కొఱవారి
,,	6	తోఁడ	తోడ
,,	8	చేసుకొని	చేసికొని
,,	13	నీచుఁడుఁ	నీచుఁడు
,,	15	సాగు	సాఁగు
,,	17	చేయు	చేతు
,,	19	బ్రాయఁగ	బ్రాయుఁగ
70	5	సాయిశా	సాయశా
71	4	రోమగుల్	రోమఁగుల్
,,	8	సంతత	సంతస
72	6	మీద	మీఁద
,,	18	మరియు	మఱియు
73	6	దోద్దండ	దోర్దండ
,,	15	ధీకర	భీకర
75	18	కలదే	కలదె
76	15	కోకటి	కోఁకటి
77	20	కాదు	నీదు
79	8	(వీణజంఘుని తరువాత)	చంద॥ అటులనే కానిమ్ము
80	4	దుహితు	దుహితృ
81	10	దావంత	దావంతి
83	15	మూగు	మూఁగు
84	8	జాటు	జాఁటు
,,	16	నిందాక	నిందాఁక
,,	17	మన్నసు	మన్నసు
85	22	భూవణాల	ధూవణాల
86	15	వేడి	వేఁడి
,,	6	కష్టముల	గష్టముల
,,	25	లిటికి	లింటికి
,,	7	ఫీ	చీ
,,	19	రాసుకొల	రాసతుల
87	11	నేచ	శేచ
,,	15	మూకలు	మూఁకలు
,,	17	పిటికి	పిడికి
,,	25	యూకలి	యూఁకలి

పుటు.	పంక్తి.	తప్పు.	ఒప్పు.
90	8	యటని	యాటవి
,,	18	బుపుష్పోద్భవ	పుష్పోద్భవ
,,	18	జెద కేల	జెంద వేల
91	8	సాంద్రుండగు	సాంద్రుండగు
,,	26	కన్యవా దెలుపుమమ	కన్యవో దెలుపుమమ్మ
92	10	వదినంబును	వదనంబును
,,	•11	జలజల	జలజ
,,	18	సవిలంబమున	సలిలంబున
93	15	వైరంబుల	వైరంబు
94	8	రజత	రజిత
,,	22	గూడి	గూతి
95	10	వోయిన	వోవయిన
96	1	నైనవేగ	నైన వేఁగ
,,	3	బనభవింపకఁదీర	బనుభవింపక తీర
,,	8	గలము	గలను
,,	19	బంధఁబులో	బంధంబులో
97	14	వీక్షింగా	వీక్షింపగా
,,	16	తేరింక కరి	తేరింకఁగరి
98	2	దప్పక	దప్పక
99	11	భరణుఁదాక	భరణుఁదాఁక
,,	19	మిమునఙ్	మిములఙ్
,,	20	జూపగ	జూపఁగ
100	11	దోప	దోఁప
102	13	కరిశిగ్నంబులగండుక	కరిశీర్షములగండుక
,,	24	గలని	గలిసి
105	13	వశాచునుంటిమిత	వశాచునుంటమున
,,	19	పిత్రులు	పితృలు
,,	20	తోచు	తోఁచు
109	10	శరణ్యంబు సేసా	శరణ్యంబని సేసా
110	19	ద్రాపవలయును	ద్రావవలయును
111	8	నశక్తుండుతు	నశక్తుండగును
,,	13	మాయాశతి	మీయాశతి
,,	17	గాగ	గాఁగ
,,	22	జేగు	వేఁగు

పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు.
112	4	బధనుల	బంధనుల
,,	5	తోడ్కొ	తోడ్కొని
,,	8	సుతుల	సుతుల
113	26	అడుగో	వాఁడుగో
1 4	15	యౌధరి	యౌధురి
115	14	జూట్టరికం	జూట్టితికం
,,	17	మనలోన మే	మనలోన నే
116	5	దండు	రండు
,,	12	శార్దూలములు నివ్వసంచరింప, నక్షత్రసంఘముల్	గ్రోల్పులుల్ చరియింప గూర్కి నుడుగణమ్ములు పెంపొదు
117	5	శ్రేష్ఠ	శ్రేష్ఠ
,,	12	మాదుగధోర్వి	మాదుమగధోర్వి
119	3	నాకు	నీకు
121	5	స్వేచ్ఛా	స్వేచ్ఛగా
,,	19	దాటి	దాఁటి
123	17	జనకునినాజ్ఞ	జనకునియాజ్ఞ
124	6	జజీగిర్చి	జీగిర్చి
126	20	వీధి	వీథి
129	21	సాంధ్రబును	సార్ధంబును
131	19	పదవికి	పదవికి
132	17	వరంబు	వరంబులు

దశకుమారచరిత్రమునందు "అవంతీసుందరి" అనియున్నది. ఇందు "అవంతిసుందరి" యని కొన్నిచోట్లపడినది. పాఠకులు దీని ముందే సవరించుకొందురు గాక. వ్యాకరణ లబ్ధార్థ బిందువులు నొకసారి సవరింపఁ దిరిగివచ్చిన తప్పులను దప్పొప్పులపట్టిక యందిక మఱచున్నందున సవరింపలేదు. పాఠకులు మన్నింతురు గాక. ముద్రణమందున్నటుల వామదేవమహర్షి వార్తాహారి కాదు. ఒక మునీంద్రుడు మాత్రమే.

గ్రంథకర్త.

శ్రీ మత్పరదేవతాయైనమః.

ఉ॥ శ్రీయుతమూర్తివై, పిసునసెందక, కందక, నింపుకుండగా
దా! యనమీాటినాఁడవు, సహాయముఁ గైకొని, యన్నమల్లి నా
రాయణరావు! పురాణమునఁ, బ్రాజ్ఞుఁడవౌటఁ దదీయమార్గముల్
హాయిగఁ జూచి, చూచి, తగునట్టులఁ జేసితివయ్య దీక్షన్॥

ఉ॥ సుబ్రహ్మణ్య శతావధాని, గురుఁడై, చొక్కమ్మకావ్యమ్ము శ
బ్దబ్రహ్మమ్ముఁ బొనర్పఁ జేసెఁ గద, సమ్మతమ్ముగా, నీకునై
యబ్రాహ్మణ్యపదమ్ముఁ గైకొనక, మాయల్ గావు పుణ్యాత్ముఁ డెం
తో, బ్రహ్మాండము మీఁదువచ్చినను బ్రజ్ఞోత్సాహముల్ మానునే?

చం॥ వినయముకల్మి, నెంతయు వివేకముఁ బూనుట సేసి, రాజవా
హనవిజయమ్ముఁ, గాంచుటకు, హాయి, విశేషము, సంస్కృతాం
[ధ్రముల్
గనియె, రచించుటన్, రుచిరిగమ్మతనమ్ము ప్రసిద్ధమైచనన్
దనరుచునుండుఁ గావుత యథాస్థితిఁ గీర్తిసిఁ గాంచి యొప్పఁగన్॥

ఉ॥ శ్రీయుతుఁ డాంధ్రపండితుఁడు, వృద్ధికినై పెనుమెత్స సత్యనా
రాయణరాజు పీఠికను వ్రాసెనుగావున నింతకన్న నే
నేయది వ్రాయనోననియె యెంచి, లిఖించితి శిష్యగౌరవా
దాయము భాగ్యదాయకము ధర్మమునన్ సిరులన్ ధరించుతన్॥

విద్వాన్, భమిడిపాటి అయ్యప్పశాస్త్రి, శతావధాని,

సంస్కృతపండితుఁడు,

బోర్డుహైస్కూలు, గుడివాడ.

17—12—23.

ఉ॥ శ్రీ

Printed at the C. S. Press, Bezwada.

ప్రతులు వలయువారు :—

ది మోహినీ ఫ్యాన్సీ బజార్,

గుడివాడ, (కృష్ణాజిల్లా.)

అని వ్రాయవలయును.

Na